పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
Shop online through our website navachethanabooks.in
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★★★



ఎంజి నరేగా రద్దు వినాశ పరిణామాలకు దారి
'సర్' ప్రక్రియ తప్పుల తడక 05
మూకదాడిపై కేరళ ప్రభుత్వం సీరియస్



సంపుటి 09, సంచిక: 27 | మంగళవారం | 23-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## పల్లెల్లో కొత్త పాలన

- అట్టహాసంగా కొలువుదీరిన నూతన పాలకమండళ్లు
- సర్పంచ్, వార్డు సభ్యులకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధుల కరదీపికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పల్లెల్లో సోమవారం పండగ వాతావరణం సంతరించుకుంది. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు మామిడి తోరణాలు, పూల అలంకరణలతో కొత్త శోభను సంతరించుకున్నాయి. నూతన పాలకమండలి సభ్యులైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పంచాయతీ కార్యాలయాలకు పదవీ బాధ్యతలు చేపట్టేందుకు వచ్చారు. కొంత మంది అయితే డప్పు వాయిద్యాలతో తరువాయి 2లో



గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధుల కరదీపికను ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, తదితరులు

## 29 నుంచి అసెంబ్లీ!



- గోదావరి, కృష్ణా జలాలు, స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చ

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఈ నెల 29 నుంచే ప్రారంభం కానున్నాయి. 30, 31, జనవరి 1వ తేదీ అసెంబ్లీ సమావేశాలు జరగవు. మళ్ళీ జనవరి 2 వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు కొనసాగనున్నాయి. సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన మంత్రుల భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సమావేశాలు ముఖ్యంగా గోదావరి కృష్ణా జలాల అంశం ఎజెండాగా కొనసాగనున్నాయి. తెలంగాణ, ఎపి రాష్ట్రాల నీటి వాటాలు, కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఎపి అక్రమ నీటి వినియోగం, అనుమతి లేకుండా చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను శాసనసభ సమావేశాల సందర్భంగా చర్చకు పెట్టనున్నారు. నీటిపారుదల అంశాలపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎండగట్టాలని ముఖ్యమంత్రి సూచించారు




వామపక్ష నేతల పిలుపు

# నరేగా పునరుద్ధరించే వరకు ప్రజా ఉద్యమాలు

### నూతన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని నిరసన ప్రదర్శన

- 'ఎంజిఎన్ఆర్ఇజిఎను తొలగించడమంటే పేదల హక్కులను కాలరాయడమేనని విమర్శ
- పార్లమెంట్‌లో వామపక్షాలకు ఎక్కువ స్థానాలు ఉంటే 'విబి – జి రామ్ జి' బిల్లును బలంగా అడ్డుకునేవారని అభిప్రాయం
- మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

'వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం2025'ను (విబి –జి రామ్ జి) రద్దు చేసి, మళ్లీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజిఎన్ఆర్ఇజిఎ) పునరుద్ధరణ చేసేంత వరకు వామపక్షాలు, ప్ర జాతంత్ర, లౌకికవాద శక్తులన్నీ విస్తృతంగా నిరంతర ప్రజా ఉద్యమాన్ని చేపట్టాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, పేద వర్గాల పొట్టను కొట్టేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 'విబి –రామ్ జి' చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎను తొలగించడమంటే పేదల హక్కులను కాలరాయడమేనని, ఎంజిఎన్ఆర్ఇజిఎను రద్దు చేసే బిజె పి కుట్రదారుల ను అడ్డుకుందామని, ఉపాధి చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా నూతన చట్టాన్ని తక్షణమే ఉప సం హరించుకోవాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్‌లోని ఎం.జి రోడ్ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తరువాయి 2లో



## రాష్ట్రపతి శీతాకాల విడిది ముగిసింది

- ఢిల్లీకి తిరిగి వెళ్లిన ద్రౌపది ముర్ముకు హాకీంపేట్ విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికిం ది. శీతకాలం విడిదిలో భాగంగా ఈ నెల17న హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము 6 రోజుల తన శీతాకాల విడిది ముగించుకొని ఢిల్లీకి తిరుగు బయలుదేరి వెళ్లారు. రాష్ట్రపతి ద్రౌప తి ముర్ముకు సోమవారం సాయంత్రం హాకీంపేట్ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిలు వీడ్కోలు పలికారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క , ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

# కృష్ణా నీటి పై మాటామాటా

## పాలమూరు ఎత్తిపోతల 90% పూర్తి

- 299 టిఎంసిల నీటి ఒప్పందంపైన కెసిఆర్ సంతకం పెట్టినట్టు చూపిస్తారా?
- ఒప్పందం చేసుకుంటే సెక్షన్ 3 ఎందుకు అడుగుతాం? : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లో 90% పనులు ఎక్కడ పూర్తి చేశామని, తమ వెంట వస్తే చూపిస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో 299 టిఎంసిల నీటి ఒప్పందంపైన కెసిఆర్ సంతకం పెట్టినట్టు చూపిస్తారా? అని ప్రశ్నించారు. తాము ఒప్పందం చేసుకుంటే సెక్షన్ 3 ఎందుకు అడుగుతామని, అపెక్స్ కౌన్సిల్‌ను ఎందుకు ఆశ్రయి స్తామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ పాలమూరు డిపిఆర్ ఏప్రిల్ 12, 2023లో కేంద్రం నుంచి వాపస్ వస్తే, మూడు రోజుల్లోనే బిఆర్‌ఎస్ ప్రభుత్వం జల్ శక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాసిందని, కేంద్ర జల్ శక్తి అధికారులతో కెసిఆర్ మాట్లాడారని, ఆ తర్వాత సిడబ్ల్యుసికి అప్రైసల్ కొనసాగించేలా ఆదేశాలు ఇప్పించామని వివరించారు. డిసెంబర్ తరువాయి 2లో

## ఒక్క ఎకరాకు కూడా నీరెందుకివ్వలే?

- ఇప్పటికీ పర్యావరణ అనుమతుల్లేవ్
- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపించాం
- 299 టిఎంసిలకు అపెక్స్ కౌన్సిల్‌లో కెసిఆర్ ఒప్పుకున్నారు : మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/హైదరాబాద్



పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణ పనులను 90 శాతం పూర్తి చేస్తే, ఒక్క ఎకరాకు కూడా నీరు ఎందుకు ఇవ్వలేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌కు ఇప్పటి వరకు పూర్తిగా పర్యావరణం అనుమతులు కూడా రాలేదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆపించామని వివరించారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు జరిగిన అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఆంధ్రకు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలకు కెసిఆర్ ఒప్పు కున్నారని అన్నారు. 45 టిఎంసి మైనర్ ఇరిగేషన్, గోదావరి డైవర్షన్ సేవింగ్ 45 టిఎంసిలని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ ఒప్పంద నిర్ణయం ప్రకారమే తాము లేఖ రాశామని వివరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో జర్నలిస్టులతో తరువాయి 2లో



## విద్యుత్ ఉద్యోగులకు 17 శాతం డిఎ

- 71,387 మంది ఉద్యోగులకు ప్రయోజనం
- విద్యుత్ సంస్థలపై ప్రతి నెలా రూ.9.39 కోట్ల అదనపు వ్యయం
- ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- పెండింగ్ స్కాలర్‌షిప్ రూ.365.75 కోట్లు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం కరువు భత్యం (డిఎ) ఖరారు చేస్తూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆమోదం తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ధరల సూచి ఆధారంగా ప్రతి సంవత్సరం జనవరి, జులై నెలలో కరువు భత్యం (డిఎ) అలవెన్స్, డియర్ నెస్ రిలీఫ్ (డిఆర్) ను సమీక్షిస్తూ విడుదల చేస్తారు. అందులో భాగంగా ఈ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అమలయ్యేలా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డిఎ, డిఆర్‌ను 17.651 శాతంగా ఖరారు చేశారు. తాజా ఉత్తర్వులతో విద్యుత్ సంస్థల తరువాయి 2లో

### ప్రజలను దోచుకునేందుకు

## ఏ అవకాశాన్నీ వదలడం లేదు

రైల్ టికెట్ ధరల పెంపుపై ఖర్గే ఫైర్



**న్యూఢిల్లీ:** దేశంలో అన్నింటిపై ధరలు పెరుగుతుండడం పట్ల మోదీ సర్కార్‌పై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. సామాన్య ప్రజలను దోచుకోవడానికి కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ఒక్క సంవత్సరంలోనే రెండుసార్లు రైలు ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. 215 కిలోమీటర్ల ప్రయాణానికి మించి సాధారణ తరగతికి కిలోమీటరుకు 1 పైస, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని తరువాయి 12లో

### రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు

## ఒకే పోర్టల్‌లో..

- భూ భారతి పోర్టల్‌తో అనుసంధానం
- ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ రూపకల్పన
- ఆధునీకరించిన వ్యవస్థ జనవరి నుంచి అందుబాటులోకి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భూభారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల తరువాయి 2లో




## బంగ్లాదేశ్‌లో మరో విద్యార్థి నాయకుడు కాల్చివేత

**ఢాకా:** బంగ్లాదేశ్ జులై ఉద్యమ నాయకుడు ఒస్మాన్ హది హత్య, అంత్యక్రియలు జరిగిన మరునాడే మరో విద్యార్థి నాయకుడు కాల్పుల్లో హతుడయ్యారు. 2004లో హింసాత్మక విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడు మోతలెబ్ షిగ్దర్ (42) సోమవారం గుర్తుతెలియని ముష్కరులు జరిపిన కాల్పులో మరణించాడు. బంగ్లాదేశ్ నైరుతీ ప్రాంత నగరంలో తరువాయి 12లో

## భారతదేశం, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో టెలిఫోన్ సంభాషణ
- రానున్న 15 ఏళ్లలో భారత్‌లో 20 మిలియన్ డాలర్ల పెట్టబడి పెట్టనున్న కివీస్



**న్యూఢిల్లీ :** భారతదేశం, న్యూజిలాండ్ మధ్య సోమవారం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. కోసం చర్చలు ముగిసినట్లు ప్రకటించాయి. ఈ ఒప్పందంలో దేశీయ వస్తువుల శ్రేణికి, ముఖ్యంగా శ్రమతో కూడిన రంగాలకు చెందిన వాటికి సుంకం లేకుండా యాక్సెస్ లభిస్తుంది. న్యూజిలాండ్ రానున్న 15 ఏళ్లలో భారత్‌లో 20 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఒప్పందం వస్తువులు, సేవలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఐదు సంవత్సరాలలో యుఎస్‌డి 5 బిలియన్లకు రెట్టింపు చేయడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం ఈ ఒప్పందాన్ని బలోపేతం చేస్తున్నట్లు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## సూడాన్ మార్కెట్‌పై దాడి.. 10 మంది మృతి

**పోర్ట్ సూడాన్:** సూడాన్ ఉత్తర దార్ఫర్‌లోని మార్కెట్‌పై జరిగిన డ్రోన్ దాడిలో 10మంది మరణించారు. ఈ దాడి ఎవరి పని అనే విషయం మాత్రం బయటకు తెలియరాలేదు. ఈ దాడి లితంగా దక్షిణ సూడాన్ కదుగ్లి లో ఉన్న శాంతి దళాలు అక్కడి నుండి ఖాళీ చేసి వేరే ప్రాంతానికి వెళ్ళాయి. ఆర్ఎస్ఎఫ్ నియంత్రణలో ఉన్న అల్ హ్రా ప్రాంతంలో ఈ డ్రోన్ దాడి జరిగింది. అనేక దుకాణాలు ధ్వంసమయ్యాయి. విస్తారంగానరుకు నాశనమైంది. ఐతే ఈ దాడి ఆర్ఎస్ఎఫ్ లేదా సూడాన్ ఆర్మీ గ్రూపు ఎవరు చేశారనే విషయం తెలియలేదు. 2023 ఏప్రిల్ నుండి సూడాన్‌లో ఆర్ఎస్ఎఫ్, అధికార సూడాన్ సైనిక వర్గాల మధ్య ఘర్షణల కారణంగా దేశంలో వేలాదిమంది మరణించారు. దాదాపు 1.20 కోట్ల మంది ప్రజలు సూడాన్ ప్రాంతాలను వదలి పారిపోయారు. ప్రపంచంలో అతిపెద్ద సంఖ్యలో ప్రజలు దేశం వదలివెళ్ళిపోయింది, అతిపెద్ద శరణార్థులు సూడానీయులే.

# మాస్కోలో కారు బాంబు పేలుడు
## రష్యన్ మిలటరీ జనరల్ సర్వరోవ్ మృతి

**మాస్కో:** రష్యా సైన్యంలో ఆపరేషనల్ ట్రైనింగ్ విభాగం అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్ (56) దుర్మరణం పాలయ్యారు. దక్షిణ మాస్కోలో సోమవారం ఉదయం జరిగిన కారు బాంబు పేలుడు ఘటన ఉక్రేన్ స్పెషల్ సర్వీసెస్ చేసిన పనే అని రష్యా పూర్తిగా నమ్ముతోంది. ఈ ఘటనలో వెంటనే ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ దాడికి ఉక్రేన్ సెక్యూరిటీ సర్వీసెస్‌దే ప్రధాన బాధ్యత అని ని రష్యా అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఇదేవిధంగా ముగ్గురు రష్యన్‌అధికారులు మరణించారు. రష్యా సాయుధ దళాల ఆపరేషన్ శిక్షణా విభాగంలో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న సర్వరోవ్ మరణించినట్లు రష్యన్ ఇన్వెస్టిగేటివ్ కమిటీ ప్రతినిధి స్వెత్లానా పెట్రెంకో చెప్పారని టాస్ వార్తాసంస్థ తెలియజేసింది. ఈ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సాక్షులను విచారణ చేస్తున్నారు.



1969 మార్చి 11న సర్వరోవ్ రష్యాలోని పెర్మ్ ప్రాంతం గ్రెమ్యాచిన్స్క్‌లో జన్మించారు. సైన్యంలోని అన్ని పదవులను ఆయన నిర్వహించారు. 2015–16లో సిరియాలో సైనిక కార్యకలాపాల బాధ్యతలు నిర్వహించారు. 2016లో సైనిక కార్యకలాపాల ఆపరేషనల్ ట్రైనింగ్ కార్యకలాపాల అధిపతిగా నియమితులయ్యారు. ఆర్డర్ ఆఫ్ కరేజ్, సువరోవ్ మెడల్, ఆర్డర్ ఆఫ్ మెరిట్ టు ద ఫాదర్‌ల్యాండ్ ఫస్ట్ అండ్ సెకండ్ క్లాస్ అవార్డులు పొందారు. ఆయన హత్యపై అధికారులు రష్యా క్రిమినల్ కోడ్ 105 కింద పేలుడు పదార్థాల అక్రమ రవాణా చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఉక్రేన్ భద్రతా సంస్థలే ఈ నేరానికి పాల్పడ్డాయని ఆమె ప్రకటించారు. ఈ హత్యపై పరిశోధకులు అనేక కోణాలలో పరిశోధనలు చేస్తున్నారని చెప్పారు. పేలుడు పదార్థాలను రష్యా భూభాగంలోకి విదేశీ కుట్రదారులు అక్రమంగా తరలించారని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మాసెనయా వారి వీధిలో కారు అడుగుభాగాన ఈ పేలుడు పదార్థాన్ని అమర్చినట్లు ప్రాథమిక దర్యాప్తుల్లో వెల్లడైందని ఆమె చెప్పారు.ఏడాది క్రితమే రష్యా మిలిటరీ న్యూక్లియర్ బయలాజికల్, కెమికల్ ప్రొటెక్షన్ దళాల అధిపతి ఇగోర్ కిరిల్లోవ్ కూడా ఇదేవిధంగా ఎలక్ట్రిక్ స్కూటరులో పెట్టిన బాంబు కారణంగా (2024 డిసెంబరు 17) ఆయన అపార్ట్‌మెంటు భవనం వెలుపల మరణించారు. ఈ ప్రమాదంలో ఆయన సహాయకుడు కూడా మరణించారు. తామే చంపామని ఉక్రేన్ భద్రతా దళాలు ఆనాడు ప్రకటించాయి. అదేవిధంగా గడచిన ఏప్రిల్ నెలలో మరో రష్యా సైనిక అధికారి, జనరల్ స్టాఫ్‌లో మెయిన్ ఆపరేషనల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన లెఫ్టినెంట్ జనరల్ యరస్లావ్ మోస్కాలిక్ కూడా మాస్కో ఆయన అపార్ట్‌మెంటు సమీపంలో కార్‌పార్కింగ్ వద్ద పేలుడు కారణంగా హతులయ్యారు.

## ఇండోనేసియాలో బస్సు ప్రమాదం

**జకర్తా:** ఇండోనేసియాలో ఒక ప్రయాణికుల బస్సు ప్రమాదానికి గురికావడంతో అందులో ఉన్న 16 మంది మరణించారు. వీరిలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గామనడిర 18 మందికి వేరు వేరు ఆసుపత్రులలో చికిత్స చేశారు. బస్సు అతివేగంగా ప్రయాణం చేస్తోందని, అదుపు తప్పిందని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. జావా ప్రధాన దీవిలో సోమవారం తెల్లారకముందే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు. బస్సులో మొత్తం 34 మంది ప్రయాణిస్తుండగా టోల్ రోడ్‌లో బస్సు అదుపు తప్పి ఒక రాతి రైలింగ్‌ను ఢీకొంది. జకర్తా నుండి దేశంలోని పురాతన రాయల్ సిటీ యోగ్యకర్తకు బస్సు వెళుతుండగా ప్రమాదం జరిగింది. సహాయ బృందాలు ఆరు మృతదేహాలను వెలికితీశారు. ఆసుపత్రిలో మరో పదిమంది మరణించారు.

## మియామీ శాంతి చర్చల్లో భూభాగాంశమే ప్రధాన ఆటంకం

**లండన్ :** ఉక్రేన్‌లో కాల్పుల విరమణ, శాంతి సాధనకు సంబంధించి మియామీలో జరుగుతున్నచర్చల్లోప్రాదేశిక భూభాగాల అంశమే ప్రధాన ఆటంకంగా ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. మియామీలో మూడు రోజులుగా జరుగుతున్న చర్చలు పురోగతిలో ఉన్నాయన్నారు. డాన్‌బాస్‌లో ఉక్రేన్ భూభాగాల రాయితీల విషయం సమస్యగా ఉందన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక దూత కిరిల్ ద్మిత్రియేవ్ మియామీలో జరుగుతున్న చర్చల్లో పాల్గొంటున్నారు.చర్చలుకొనసాగుతున్నాయి.జెలెన్‌స్కీకి శాంతి చర్చలు ఇష్టం లేదని, ఆయన యుద్ధంవైపే మొగ్గుచూపుతున్నారని పుతిన్ విమర్శిస్తున్నారు. మరోవైపు మేక్రాన్‌తో చర్చలకు పుతిన్ సుముఖత వ్యక్తం చేశారు.

## థాయ్–కాంబో శాంతి సాధనకు ఏసియన్ మీట్

### రేపు ముఖాముఖీ చర్చలు ప్రారంభం

**కౌలాలంపూర్:** సరిహద్దు వివాదంపై థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలమధ్య రెండు వారాలుగా జరుగుతున్న ఘర్షణలను సర్దుబాటు చేసి శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ''ఏసియన్'' (ఆగ్నేయ ఆసియా దేశాలు) విదేశాంగమంత్రుల సమావేశం సోమవారం కౌలాలంపూర్‌లో జరిగింది. థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలమధ్య బుధవారం (డిసెంబరు 24) శాంతి చర్చలు పునఃప్రారంభమవుతాయి. సరిహద్దులవెంట దీర్ఘకాలం కొనసాగే శాంతి సాధనకు తాము కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా థాయ్‌లాండ్ విదేశాంగమంత్రి సిహాసక్ ఫువాంగ్కెట్కియో చెప్పారు. ఈ వివాదాన్ని అంతర్జాతీయం చేసే ప్రచారానికి బదులుగా సవివరంగా చర్చలు జరపడంపైనే శాంతి పురోగతి ఆధారపడి ఉందని ఆయన ఉద్ఘాటించారు. 'ఏసియన్' సమావేశంలో మలేసియా విదేశాంగమంత్రి మహ్మద్ హస్సన్ ప్రారంభోపన్యాసం చేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగ్నేయ ఆసియా ప్రాంతంలో శాంతి, స్థిరత్వం సాధించి తీరాల్సిందేనన్నారు. విమర్శలుప్రధానంగాచర్చల అజెండాలోకి రాకుండా రెండు దేశాల ప్రతినిధులు ఈ విధంగా ఏసియన్ మధ్యవర్తుల ద్వారా సమావేశం అవుతున్నందువల్ల సమస్య ఈ సారి శాంతియుతంగా పరిష్కరంకావాలనిఆయనఉద్ఘాటించారు. పక్షం రోజులుగా జరుగుతున్న ఈ యుద్ధంలో 60 మంది మరణించారు. లక్షలమంది ప్రజలు ఇరువైపులా సరిహద్దు గ్రామాలను వదలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. కాంబోడియా సరిహద్దులో ఆదివారం థాయ్‌లాండ్ చేసిన హింసాత్మక దాడులకుభయపడి2,74,800మందిమహిళలు, 1,67,100 మంది పిల్లలు సరిహద్దు గ్రామాలను వదలి వెళ్ళిపోయారనిఆ దేశ హోంమంత్రి ప్రకటించారు. ''ఏసియన్'' కూటమిలో థాయ్‌లాండ్, కాంబోడియా, ఇండోనేసియా,మయన్మార్, ఇండోనేసియా, మలేసియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, బ్రూనే, వియత్నాం, లావోస్ తదితర దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఈ ఏడాది జులైలో థాయ్‌లాండ్–ఇండోనేసియా మధ్య సరిహద్దుల్లో హింస ప్రజ్వరిల్లినప్పుడు అమెరికా సారథ్యంలో మలేసియా అధ్యక్షతన మధ్యవర్తిత్వ రాజీ ఒప్పందం కుదిరినప్పటికీ ఈ ఒప్పందం పదే పదే ఉల్లంఘనలకు గురవుతోంది. రెండు దేశాలమధ్యా ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీన తిరిగి సరిహద్దుల్లో యుద్ధం మొదలైంది. రాత్రికిరాత్రే థాయ్‌లాండ్ సైనికుణ్ణి చంపారన్న ఆరోపణపై యుద్ధం విస్తరించింది. ఇదిలా ఉండగా ఈ యుద్ధంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం బీజింగ్‌లో పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, 'ఏసియన్'లో కీలక భాగస్వాములైన థాయ్‌లాండ్–మలేసియా దేశాలు సరిహద్దుల వెంట శాంతిని స్థిరత్వాన్నీ కాపాడుకోవాలని కోరారు. ఈ విషయంలో మలేసియా మధ్యవర్తిత్వాన్ని తాము ఆహ్వానిస్తున్నామన్నారు. ముఖ్యంగా రెండు దేశాల ప్రజల ప్రయోజనాలు దృష్టిలోపెట్టుకుని సరిహద్దుల్లో శాంతి–స్థిరత్వాలను కాపాడుకోవాలన్నారు.

## నిరసనల మధ్య జపాన్ అణు విద్యుత్ కేంద్రం ప్రారంభం

**టోక్యో:**పుకుషిమాలో అణువిద్యుత్ కర్మాగార ప్రమాదం జరిగిన దశాబ్దకాలం తర్వాత నీగాటా ప్రిఫెక్చర్‌లో ఉన్న కాషివాజా కి–కరివా అణు విద్యుత్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని జపాన్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి 20 నాటికి ఈ రియాక్టర్ సిద్ధం అవుతుంది. ఈ మేరకు ఒక తీర్మానం ఆమోదించేందుకు అసెంబ్లీ సమావేశం కాగా ఈ సమావేశ మందిరం వెలుపల వందల మంది ప్రజలు గుమిగూడి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసినప్పటికీ తీర్మానం ఆమోదం పొందింది. ఈ అణు విద్యుత్ కేంద్రాన్ని పునఃప్రారంభించే ఆలోచన చేయకూడదని తీవ్రస్థాయిలో ప్రజలు ప్రతిఘటించారు. అణు విద్యుత్ వద్దు, ప్రమాదాలు వద్దు అని నినాదాలు చేశారు. ప్రదర్శకులు బ్యానర్లు ప్రదర్శించారు. ప్లాంటును పునఃప్రారంభించడానికి ప్రిఫెక్చర్ అసెంబ్లీ గతనెలలో ఒక తీర్మానం ద్వారా ఆమోదం తెలియజేసిన తర్వాత నీగాటో గవర్నర్ హిడెయో హనాజుమీ దీనిపై సంతకం చేసి ఆమోదం తెలియజేశారు. టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టెప్కో) కి చెందిన కాషివాజా కి–క



రివా అణు విద్యుత్ కేంద్రం ప్రపంచంలోనే అతి పెద్ద విద్యుత్ కేంద్రం పునఃప్రారంభానికి టెప్కో కంపెనీ కూడాఆమోదం తెలియజేసింది. టోక్యోకు వాయువ్యంగా 220 కి.మీ దూరంలో కాషివాజా కి–కరివా అణువిద్యుత్ కేంద్రం ఉంది. 2011లో టెప్కోకుచెందినపుకుషిమాడైచీ కేంద్రంలో సునామీ కారణంగా కోర్ మెల్ట్‌డౌన్ తర్వాత మూసివేసిన 54 అణు రియాక్టర్లలో ఇది కూడా ఒకటి. ఈ కాంప్లెక్‌లో ఉన్న ఏడు యూనిట్లలో నెంబర్ సిక్స్ యూనిట్ వచ్చే ఏడాది జనవరి 20 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

### జపాన్ అణ్వాయుధాలతో ప్రపంచానికి ముప్పు : చైనా హెచ్చరిక

పౌర అణు విద్యుత్ ప్లాంటు పేరుతో జపాన్ దేశం అణ్వాయుధాలను సమకూర్చుకుంటే ప్రపంచానికి పెద్ద ముప్పు వాటిల్లుతుందని చైనా హెచ్చరిక చేసింది. ప్రపంచంలోనే అదిపెద్ద అణు రియాక్టర్‌ను పునఃప్రారంభించాలని జపాన్ నిర్ణయం తీసుకున్న తర్వాత చైనా విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం బీజింగ్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ జపాన్‌లోని మితవాద పార్టీ శక్తులుగనుక అణ్వాయుధాల వెంటపడితే, అందుకు అనుమతిస్తే అంతర్జాతీయ ప్రపంచం మరోసారిప్రమాదంలోపడుతుందన్నారు. ఇదిలా ఉండగా కొత్త ప్రధాని తకైచీ అధికారంలోకొచ్చాక చైనా–జపాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. రెండు దేశాలమధ్య విమాన వాణిజ్య కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. చైనా మెయిన్ ల్యాండ్ నుండి జపాన్‌కు వెళ్ళే 2,100విమానాలు ఇప్పటికే రద్దుకాగా, కొత్త సంవత్సరంలో మరో 46 మార్గాలను మూసివేస్తున్నారు.

## కొత్త పాలన
(మొదటి పేజీ తరువాయి)

తరలివచ్చారు. దీంతో పల్లెల్లో కోలాహలం నెలకొంది.

### వేద మంత్రోచ్చారణల మధ్య బాధ్యతల స్వీకరణ

కొత్త పాలక మండలి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు, మంత్రోచ్చారణల మధ్య సర్పంచులు తమ కుర్చీల్లో ఆసీనులయ్యారు. గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నూతన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పలుచోట్ల స్థానిక ఎమ్మెల్యేలు ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### హోరెత్తిన బాణాసంచా..

సర్పంచులు బాధ్యతలు స్వీకరించిన వెంటనే వారి అభిమానులు, కార్యకర్తలు గ్రామాల్లో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. మిఠాయిల పంపిణీతో గ్రామాల్లో కోలాహలం నెలకొంది. వచ్చే ఐదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధే లక్ష్యంగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తామని ఈ సందర్భంగా సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. వాస్తవానికి ఈ నెల 20నే ప్రమాణ స్వీకారం చేయించాలని ప్రభుత్వం భావించినప్పటికీ, ముహూర్త బలం కారణంగా ఈ కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం నుంచి ఇక గ్రామాల్లో నూతన పాలన అధికారికంగా ప్రారంభమైంది.

### గ్రామ పంచాయతీల కరదీపిక ఆవిష్కరణ

గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకంగా ఉపయోగపడే గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల కరదీపికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అధికారికంగా ఆవిష్కరించారు. మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. పంచాయతీరాజ్ చట్టం–2018, గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, అధికారాలు, పాలన విధానం వంటి అంశాలపై సమగ్ర సమాచారంతో 292 పేజీల ఈ కరదీపికను తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (టిజిఐఆర్‌డి) రూపొందించింది. గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రజా సేవలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కరదీపికను అన్ని గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు అందించనుంది.

## నీరేందుకివ్వలే?
(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోమవారం ఇష్టగోష్టిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి 45 టిఎంసిల నీరు సరిపోతుందని 2020లో జరిగిన కెఆర్‌ఎంబి సమావేశంలో అప్పటి సిఎంగా కెసిఆర్ ఒప్పుకున్నారన్నారు. 2020లో జరిగిన కెఆర్‌ఎంబి సమావేశంలో కెసిఆర్ 34 శాతం నీటికి ఒప్పుకుంటే, తాము 71 శాతం కావాలని లేఖ రాసినట్టు వివరించారు. 45 టిఎంసి విషయమై రాసిన లేఖ కొత్తది కాదని, గత బిఆర్‌ఎస్ ఒప్పందాన్నే తాము లేఖ రాశామని ఉత్తమ్ వివరించారు. 90 టిఎంసిలను గతంలో కెసిఆర్ డివైడ్ చేసి 45 టిఎంసిలు చేశారన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాలోని పాలమూరు, కల్వకుర్తి, నెట్టెంపాడు, డిండి, ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్ట్‌లను కెసిఆర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల కోసం కమీషన్లకు కక్కుర్తి పడి ఆపెక్స్‌లో తక్కువ వాటాకు ఒప్పుకున్నారని, నల్లగొండ జిల్లాకు అన్యాయం చేసేందుకే, కెసిఆర్ డిండికి అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. కెసిఆర్ చేసిన అప్పులను తీర్చడానికి ఏడాదికి రూ.20 వేల కోట్లు చెల్లిస్తున్నామని వివరించారు. కాళేశ్వరం పేరుతో తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఉత్తమ్ మండిపడ్డారు. గడిచిన ఐదేళ్ల కాలంలో కాళేశ్వరం నుంచి 70 టిఎంసిల నీరు మాత్రమే ఉపయోగించారని వివరించారు. పదేళ్ళ పాటు పాలమూరు పూర్తి చేయకుండా అక్కడి ప్రజలను మోసం చేసిందే కెసిఆర్ అని ఆరోపించారు. కెసిఆర్, హరీశ్‌రావులు ఏపితో కుమ్మక్కై రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌లో రోజుకు 3టిఎంసి నీటిని అప్పగించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

## ప్రజా ఉద్యమాలు
(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి. నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.చాయాదేవి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రేమ్‌పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు డి.జి.నర్సింహరావు, సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ పోటు రంగారావు, సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసి నాయకులు అకాల పాపన్న, ఎఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ జోగిరెడ్డి, ఎంసిపిఐ నాయకులు అనిల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కొత్త చట్టం రద్దయి, పాత గ్రామీణ ఉపాధి చట్టం పునరుద్ధరణ అయ్యే వరకు నిరంతరం పోరాటం చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో వామపక్షాల బలం తగ్గితే సామాన్యులకు,పేదలకు నష్టమని, లౌకిక వ్యవస్థలకు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని అన్నారు. పార్లమెంట్‌లో వామపక్షాలకు బలమైన ప్రాతినిధ్యం ఉంటే కేంద్రం ప్రవేశపెట్టిన 'విబి జి రామ్ జి' బిల్లును బలంగా అడ్డుకునేవారని, చర్చకు తీసుకొచ్చేవారని కొందరు కాంగ్రెస్, బిజెపి నాయకులు గుర్తు చేస్తున్నారని నారాయణ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును విబిజి రామ్‌జి అని పెట్టి ప్రధాని మోదీ రెండవ సారి గాంధీని హత్య చేశారన్నారు. స్వాతంత్ర్య, పోరాట యోధులను వెనక్కి నెట్టి, గాంధీని చంపిన గాడ్సే, సావర్కర్, బ్రిటీష్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయని వారిని ముందుకు తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ అధికారంలోనికి వచ్చిన 2014 తర్వాతనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టుగా బావిస్తున్నారని, అందుకే అన్ని పేర్లను మారుస్తున్నారని ఆయన చెప్పారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి చట్టాన్ని నాశనం చేసి, గాంధీ పేరు ఉండకుండా కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. పెత్తందారి పెత్తనాలకు, కార్పొరేట్ శక్తులకు గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఒక సవాలుగా మారిందని,అందుకే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ'విబి జి రామ్ జి'లో 40 శాతం నిధులు, 75 శాతం పరికరాల ఖర్చును కూడా రాష్ట్రాలే భరించాలని కేంద్రం చట్టంలో పొందుపర్చిందని, తద్వారా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు ఈ పథకాన్ని సక్రమగా అమలు చేసే పరిస్థితి ఉండబోదన్నారు. పోటు రంగారావు మాట్లాడుతూ మోదీకి, బిజెపికి శ్రీరామునిపైన భక్తి లేదని, శ్రీరామున్ని కేవలం అధికారానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని , వారికి సావర్కర్, గాడ్సేనే నిజమైన దేశ భక్తులు అని అన్నారు. అకాల పాపన్న మాట్లాడుతూ కేంద్రం పేదల పొట్టకొడుతోందని మండిపడ్డారు. జగిరెడ్డి,అనిల్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని, అందుకు గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలను ఐక్యం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ నాయకులు నేర్లకంటి శ్రీకాంత్, కంపల శ్రీనివాస్, చెట్టుకింద శ్రీనివాస్, కళ్యాణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, సిపిఐ (ఎం.ఎల్) మాస్ రాష్ట్ర నాయకులు అన్వేష్, సిపిఐ (ఎం) నాయకులు శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే పోర్టల్‌లో..
(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఆధునీకరించిన ఈ వ్యవస్థను వచ్చే జనవరి నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.హైదరాబాద్‌నాంపల్లిలోని సిసిఎల్‌ఎ కార్యాలయాన్ని సోమవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు.

**కార్యాలయ నిర్వహణపై మంత్రి అసంతృప్తి..**
ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భూ పరిపాలనకు కేంద్రంగా ఉన్న సిసిఎల్‌ఎ కార్యాలయ నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్ స్థాయికి ధీటుగా కార్యాలయాన్ని ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో మరోసారి తనిఖీ చేస్తానని, అప్పటివరకు మార్పు స్పష్టంగా కనిపించాలని మంత్రి స్పష్టం చేశారు.

**రికార్డుల్లో వెంటనే మార్పులు చేయాలి..**
దశాబ్దాల క్రితం ప్రభుత్వం వివిధ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు సేకరించిందని, ఇప్పటికీ కొన్ని భూములు ప్రైవేటు వ్యక్తుల పేర్లపై ఉన్నాయని, వాటన్నింటిని రికార్డుల్లో సరిచేయాలని మంత్రి సూచించారు. అలాగే అసైన్డ్ భూధాన్ భూములపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులు, వివిధ విభాగాల్లో ఉన్న కోర్టు కేసులపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించబోయే తహసీల్దార్ కార్యాలయాలు ఒకే మోడల్‌లో ఉండేలా డిజైన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**భూభారతి పోర్టల్ ద్వారా అన్ని వివరాలు..**
ఒక్క క్లిక్‌తో రైతులకు పూర్తి భూసమాచారం లభించే విధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, మార్కెట్ విలువ, గ్రామ మ్యాప్, ప్రతి సర్వే నెంబరుకు మ్యాప్, నాలా ఆర్డర్లు, ఆర్వోఆర్, గ్రామ నక్షా, ఫీడ్‌బ్యాక్ వంటి అన్ని వివరాలను భూభారతి పోర్టల్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే అవసరమైన సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

**ప్రతి సర్వే నెంబరుకు మ్యాప్..**
క్రయ, విక్రయదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి సర్వే నెంబరుకు మ్యాప్ రూపొందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణలో సామాన్యుడి కోణం తప్పనిసరిగా ఉండాలని, లోపాలకు తావులేకుండా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, సిసిఎల్‌ఎ ఇన్‌ఛార్జి కార్యదర్శి మంధా మకరంద్, ఎన్ఐసి ఎస్ఐఒ ప్రసాద్, విజయ్‌మోహన్, కృష్ణ పాల్గొన్నారు.

## 17 శాతం డిఎ
(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని 71,387 వేల మంది ఉద్యోగులు, ఆర్టిజెన్లు, పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. పెంచిన డిఎ ప్రకారం టిజి ట్రాన్స్‌కోలో 3,036 మంది ఉద్యోగులకు, 3,769 మంది ఆర్టిజన్లకు, 2,446 మంది పెన్షనర్లకు మొత్తంగా 9,251 మందికి లబ్ధి చేకూరనుంది. జెన్‌కోలో 6,913 మంది ఉద్యోగులకు 3,583 మంది ఆర్టిజన్లకు, 3,579 మంది పెన్షనర్లకు లబ్ధి జరగనుంది. ఎన్‌పిడిసిఎల్‌లో 11,957 మంది ఉద్యోగులకు 8,552 మంది ఆర్టిజన్లకు, 8,244 మంది పెన్షనర్లకు లబ్ధి జరగనుంది. ఎన్‌పిడిసిఎల్ పరిధిలో 9,728 మంది ఉద్యోగులకు 3,465 మంది ఆర్టిజన్లకు, 6,115 మంది పెన్షనర్లకు లబ్ధి జరగనుంది. మొత్తంగా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు కలిపి 71,387 మందికి లబ్ధి చేకూరనుందని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

### పెండింగ్ స్కాలర్ షిప్ రూ. 365.75 కోట్లు విడుదల
### విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రజా ప్రభుత్వం : భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంక్షేమ శాఖలలో పెండింగ్ లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల బకాయిలు అన్ని ఒకేసారి ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం ప్రజాభవన్ లో ఆర్థిక, సంక్షేమ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షా సమీవేశం నిర్వహించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం మేరకు సోమవారం సాయంత్రం ఆర్థిక శాఖ అధికారులు గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న బిసి, ఎస్‌సి, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలకు సంబంధించిన రూ.365.75 కోట్లను విడుదల చేశారు. బిసి ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. విద్య విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. కేవలం విద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని అన్నారు. బిసి సంక్షేమ శాఖకు సంబంధించిన రూ.21.62 కోట్లు, ఎస్‌సి సంక్షేమ శాఖకు సంబంధించి రూ.191.63 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి రూ.152.59 కోట్లు విడుదలయ్యాయి.
ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## గీతం వర్సిటీకి నిరాశ

**హైదరాబాద్:** విద్యుత్ బిల్లుల బకాయి రూ. 118 కోట్లు ఉన్న హైదరాబాద్ గీతం యూనివర్సిటీకి సోమవారం హైకోర్టులో నిరాశే ఎదురైంది. విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ బకాయిలు చెల్లించాలన్న విద్యుత్ శాఖ నోటీసును, విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని సవాలు చేసిన వాటిలో జోక్యం చేసుకునేందుకు న్యాయమూర్తి నిరాకరించారు. విద్యుత్ బకాయిల్లో 50 శాతం చెల్లిస్తేనే పునరుద్ధరణకు ఆదేశాలిస్తామని చెప్పారు. గతంలో ఆదేశించిన మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈ సోమవారం విచారణకు హాజరయ్యారు.విద్యుత్ సప్లయ్ని పునరుద్ధరించాలని గీతం వర్సిటీ అత్యవసరంగా మధ్యంతర పిటిషన్లో ఉత్తర్వుల జారీకి జస్టిస్ నగేశ్ భీమపాక నిరాకరించారు. వీబీసీ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీకి యూనివర్సిటీకి సంబంధం లేదని, విద్యుత్ బకాయిల బాధ్యత వీబీసీ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీకే సంబంధమని యూనివర్సిటీ లాయర్ వాదించారు. కోర్టుకు వచ్చిన యూనివర్సిటీకి మధ్యంతర స్టే ఆదేశాలు జారీ కానందున విద్యుత్ సప్లయ్ ఆపేసినట్లు అధికారి చెప్పారు. వీబీసీ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ కూడా మీదేనని వర్సిటీని ఉద్దేశించి న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. సగం ఝ కాయి చెల్లిస్తేనే విద్యుత్ సప్లయ్ జరిగేలా ఆదేశాలిస్తామన్నారు. విచారణ ఈ నెల 24కి వాయిదా వేశారు.

## వార్డుల విభజనలో జోక్యానికి నిరాకరణ-హైకోర్టు

**హైదరాబాద్:** జిహెచ్‌ఎంసి వార్డుల డీలిమిటేషన్, కొత్త డివిజన్ల ఏర్పాటులో జోక్యం చేసుకోబోమని జస్టిస్ విజయ్సేన్రెడ్డి చెప్పారు. వార్డులు, వాటి మ్యాప్లను అధికారిక వెబ్సైట్లో పెట్టాలన్న తమ ఉత్తర్వులను డివిజన్ బెంచ్ కోర్టుకు వచ్చిన రెండు వార్డులకే పరిమితం చేసిందని గుర్తు చేశారు. ఆర్టికల్ 243 జెడ్జి అధికరణ కింద ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత జోక్యానికి వీల్లేదన్న ఏజీ వాదనల తర్వాత పైవిధంగా చెప్పారు. వార్డుల డీలిమిటేషన్, కొత్త వార్డుల ఏర్పాటు ప్రక్రియపై అత్యవసరంగా విచారణ చేయాలంటూ సోమవారం 80 లంచ్మోషన్ పిటిషన్లను న్యాయమూర్తి విచారించారు. వారంలోగా సమర్పించిన అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నందున తమ ముందున్న పిటిషన్లల్లో జోక్యం చేసుకోవడం లేదని చెప్పారు.

## 90% పూర్తి
(మొదటి పేజీ తరువాయి)

19న, 2024లో డిపిఆర్‌ను వెనక్కి పంపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నదని ఆయన ప్రశ్నించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాత్కాలిక ఒప్పందాన్ని చేసుకున్నదని, అయితే తుది అవార్డ్ వచ్చే వరకు 50:50 నిష్పత్తి ప్రకారమే అని కార్యదర్శి రాశారని, ఇదే డిమాండ్‌పైన గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 28 లేఖలు రాసిందని వివరించారు. 2014 నుంచి 2023 వరకు తమ ప్రభుత్వ హాయాంలో 17.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 31.50 లక్షల ఎకరాల స్థిరీకరణ చేశామని, తొమ్మిదిన్నరేళ్లలో మొత్తం 48.74లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 11 వేల ఎకరాలకు నీళ్లు ఎక్కడ ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో ఏపి తాత్కాలిక వాటా 512 టిఎంసిలు ఉండగా, 650టిఎంసిలకు పైగా నీటిని ఏపి తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు.కల్వకుర్తికి కొబ్బరికాయ కొట్టినప్పటి నుంచి 2014 వరకు 13వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని, బిఆర్‌ఎస్ పాలనలో రూ. 2600 కోట్లు ఖర్చు చేసి, 3 లక్షల 7వేల ఎకరాలకు నీళ్లు అందించామని వివరించారు. నెట్టంపాడు 2300 ఎకరాలకు నీళ్లు ఇస్తే, తాము రూ 540 కోట్లు ఖర్చు పెట్టి లక్షా 40వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని, బీమా తాము లక్షా 60వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని వివరించారు. కోయిల్ సాగర్ కింద 38వేల ఎకరాలకు నీటిని ఇచ్చామని, ఈ నాలుగు ప్రాజెక్టుల కింద ఆరున్నర లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చామని, మొత్తంగా పాలమూరులో పది లక్షల ఎకరాల్లో నీళ్లు పారించామని హరీశ్ రావు వివరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కెసిఆర్‌ను ప్రజలు కోరుకోవడం లేదు

టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా ప్రభుత్వానికి కెసిఆర్ తన అనుభవం, సలహాలు, సూచనలు ఇస్తే ప్రజలు హర్షిస్తారని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ న్యాయకత్వాన్ని ప్రజలు కోరుకోవడం లేదని, కెటిఆర్‌పై నమ్మకం లేకపోవడంతోనే బిఆర్ఎస్ పార్టీ నేతలు కెసిఆర్‌తో బలవంతంగా ప్రెస్ మీట్ పెట్టించారని తెలిపారు. రేవంత్ పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం పెరిగిందని, కెసిఆర్ పాలనలో జరిగిన దోపిడీని ఇంకా ప్రజలు మర్చిపోవడం లేదన్నారు. ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన గౌరవం 80 శాతం మంది గ్రామ సర్పంచులుగా గెలుపొందారని, మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు పెద్దపీట వేశారని, తెలంగాణ వనరులు, ప్రాజెక్టులు కాపాడుకోవాలని ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం ముఖ్య చిత్రం మారనుందని చనగాని దయాకర్ వెల్లడించారు.

## కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కెసిఆర్‌కు కనబడటం లేదా?

మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండేళ్లపాటు చేసిన అభివృద్ధి కెసిఆర్‌కు కనబడకపోవడం విడ్డూరంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా కెసిఆర్ నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని సూచించారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలు, మరోవైపు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, జరుగుతున్న అభివృద్ధిని కెసిఆర్ ఎందుకు చూడలేకపోతున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. కెసిఆర్ హయాంలో కూడా అనేక ఒప్పందాలు జరిగాయని గుర్తు చేస్తూ, రాష్ట్రానికి పెట్టుబడులు రావడం అనేది ఎప్పటికీ కొనసాగే నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కంపెనీలు తమకు అనుకూలమైన వాతావరణం ఉన్న రాష్ట్రాల్లోనే పెట్టుబడులు పెడతాయని, అందుకే పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం అనుకూల విధానాలతో ముందుకెళ్తోందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు రావడానికి అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఆసక్తి చూపుతున్నాయని, ఒక్క ఏడాదిలోనే 75 గ్లోబల్ కేపబులిటీ సెంటర్లను తీసుకొచ్చామని తెలిపారు. అత్యధిక జిసిసిలు వచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. గత ఏడాది రూ.3.40 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు వెల్లడిస్తూ, కొత్త పెట్టుబడుల వల్ల 1.40 లక్షల మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు కలగనున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేసిందని, ప్రపంచ అవసరాల్లో మూడొంతుల వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఎగుమతి అవుతున్నాయని చెప్పారు.

## కెసిఆర్‌ది మళ్లీ పాతపురాణమే

మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చాల కాలం తర్వాత మీడియా ముందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఇప్పుడైనా తెలంగాణపై కేంద్రం చూపిస్తున్న వివక్షపై మాట్లాడుతారనుకుంటే ఆయన మళ్లీ తన పాతపురాణమే మొదలుపెట్టారని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్‌కు ఉన్నట్టు ఉండి పాలమూరుపై ప్రేమ ఎందుకు వచ్చిందో తెలియదని,పాలమూరులో ఆయనకు ఊరు,పేరు లేకున్నా అక్కడ ప్రజలు ఎంపి గెలిపించారన్నారు. కాని కెసిఆర్ మాత్రం పాలమూరుపై గడిచిన 10 ఏళ్లలో కపట ప్రేమ చూపించడమే కాకుండా లేనిపోని అభూత కల్పనలు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ అంశంలో కెసిఆర్ మాటాలన్ని అన్ని అబద్ధాలేనన్నారు. లక్షల కోట్ల అప్పుచేసి తెలంగాణపై భారం మోపింది ఎవరో యువత ఆలోచిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. కెసిఆర్ మాటాలన్ని అమ్మ పులి వచ్చే కథలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. బి ఆర్ఎస్ హయంలో ధరణి తెచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎలా చేశారో,ఎంత మంది ప్రజల పొట్టకొట్టారో అందరికీ తెలుసు అన్నారు. పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగానే కనిపించినట్లుగానే కెసిఆర్ లాగే అందరూ ఉంటారని అనుకోవడం ఆయన భ్రమా అని, దానిలో నుంచి బయటికి వచ్చి వాస్తవ పరిస్థితులను చూడాలని హితువు పలికారు.

## గట్టిగా మాట్లాడితే... అబద్ధం నిజం కాదు

హరీష్‌రావుకు ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గట్టిగా మాట్లాడినంత మాత్రాన అబద్ధం నిజం కాదని ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాజీమంత్రి హరీష్‌రావుకు కౌంటర్ ఇచ్చారు. నీళ్ల నిజాలపై అసెంబ్లీలో చర్చిద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిని ఆహ్వానిస్తే, వస్తారో, లేదో చెప్పకుండా వాళ్ల మామ చెప్పినదాన్నే హరీష్‌రావు మళ్లీ మళ్లీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కెసిఆర్ చర్చకు వస్తే ఎవరు తెలంగాణ ద్రోహి అనేది అసెంబ్లీ సాక్షిగా నిరూపిస్తామన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పనితనం ప్రజలు మరిచిపోయారని అనుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని హెచ్చరించారు. బిఆర్ఎస్ హయాంలో యూరియా ఇంటికి తెచ్చి ఇచ్చామని హరీష్ అబద్దాలు మాట్లాడుతున్నారని, రైతులు ఎన్ని అవస్తలు పడ్డారో, తమ యొక్క పనితనమేందో పత్రికల్లో వచ్చిన వార్తలే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా సిఎం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి వస్తే ఎవరు ద్రోహినో తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు.

## సిపిఐ భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్ ఆకస్మిక మృతి



**హైదరాబాద్ :** సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్ సోమవారం నాడు ఆకస్మికంగా మరణించారు. ఆయన వయస్సు 54 సంవత్సరాలు. మధుమేహంతో బాధపడుతున్న సుదర్శన్ చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళగా, సోమవారం సాయంత్రం ఆకస్మాత్తుగా గుండె పోటు రావడంతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు వలిగొండ మండలంలోని స్వగ్రామం వెంకటాపురంలో మంగళవారం మధ్యాహ్నం తరువాత జరగనున్నాయి. బోడ సుదర్శన్ మూడు పర్యాయాలు వలిగొండ మండల కార్యదర్శిగా పని చేసి, ప్రస్తుతం జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. పల్లా, నెల్లికంటి సంతాపం: బోడ సుదర్శన్ ఆకస్మిక మృతి పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్కువ వయస్సులనే ఆయన దూరమవవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. సుదర్శన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి కూడా సంతాపం తెలియజేశారు.

## కుటుంబ రాజకీయాలే బిఆర్ఎస్ పార్టీ పతనానికి కారణం

పాలమూరు- రంగారెడ్డిపై కెసిఆర్‌వి పచ్చి అబద్ధాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ పతనానికి కుటుంబ రాజకీయాలే ప్రధాన కారణమని, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కెసిఆర్ సర్కారుదే 'దద్దమ్మ ప్రభుత్వం' అని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘాటుగా విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతోందని, కండ కరిగిపోయి కేవలం తోలు మాత్రమే మిగిలిందని గ్రహించే, తన రాజకీయ మనుగడ కోసం కెసిఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కొడుకు, అల్లుడు వ్యవహారశైలి వల్లే ప్రజల్లో ఆదరణ తగ్గిందని కెసిఆర్‌కు ఆలస్యంగా అర్థమైంది. అందుకే పార్టీని కాపాడుకోవడానికి ఇప్పుడు ప్రజల ముందుకు వస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కలిసి పనిచేసినా ప్రజలు వారికి మూడింట ఒక వంతు సీట్లు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై ప్రజలు ఇప్పటికే స్పష్టమైన తీర్పు ఇచ్చారు' అని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు ప్రాజెక్ట్ లను గత కెసిఆర్ సర్కార్ నిర్లక్ష్యం చేసిందని, కాలువలు పూర్తికాకుండానే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేశారు. కానీ ఒక ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని, 10 ఏండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయలేని దద్దమ్మ ప్రభుత్వం మీద అనిమండిపడ్డారు.

**అసెంబ్లీ సాక్షిగా బిఆర్ఎస్ పాలనపై చర్చిద్దాం : ఎమ్ఎల్‌సి బల్మూర్ వెంకట్**

నీళ్లపై నిగ్గు తేలాలంటే మామా, అల్లుడు అసెంబ్లీలో మాట్లాడాలని, దమ్ముంటే కెసిఆర్‌ను సభకు తీసుకొచ్చి మాట్లాడిస్తే వాస్తవాలు తెలుస్తాయని మాజీ మంత్రి హరీష్‌రావుకు ఎమ్ఎల్‌సి బల్మూర్ వెంకట్ సవాల్ విసిరారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో నీళ్ల వాటాలో ఎన్ని వాడుకున్నారో చెప్పాలని, మరిచిపోతే కెసిఆర్ కు మతిమరపు ఉందని చెప్పి, తప్పు ఒప్పుకోవాలని సూచించారు. బయట ప్రెస్‌మీట్‌లు పెట్టి, అబద్ధాలు చెబితే ఎవరు నమ్మే పరిస్థితి లేదని, ఎపికి వెళ్లి చేపల పులుసు తిని చేతులు కడుకున్నది మీరుకాదా అని ప్రశ్నించారు. ప్రజాభవన్ సాక్షిగా జగన్‌తో కెసిఆర్, కెటిఆర్ చేసిన మంత్రాగం ఏంటి? రెండేళ్లలో పూర్తి చేస్తానన్న పాలమూరు ప్రాజెక్టు పదేళ్లైనా చేయలేదని, కానీ, రూ.35 వేల కోట్లతో పూర్తయ్యే కాళేశ్వరంను రూ.లక్షకోట్లకు పెంచి దోచుకోవడం కోసమే మూడేళ్లలో పూర్తి చేశారని మండిపడ్డారు. పార్టీ నడపడంలో కెటిఆర్, హరీశ్ రావు ఫెయిల్ అయ్యారని, ఇద్దరు దద్దమ్మలనే కెసిఆర్ బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు.

## రైల్వే భద్రతే లక్ష్యంగా అన్ని విభాగాలూ సమన్వయంతో పనిచేయాలి

సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైల్వే భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సోమవారం సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. రైళ్ల సురక్షిత, సజావు నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధిపతులు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) పాల్గొన్నారు. మెకానికల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్ విభాగాలకు సంబంధించిన భద్రతా కార్యాచరణ ప్రణాళికలను కూడా సమీక్షించిన జిఎం, కీమెన్లు, పెట్రోలింగ్ సిబ్బందికి జిపిఎస్ ట్రాకర్లు, వాకీటాకీలు, ఫాగ్ పరికరాలు వంటి భద్రతా ఉపకరణాల లభ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైళ్ల సురక్షిత ప్రయాణం, లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, రైలు కార్యకలాపాల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిఎం ఆదేశించారు. భద్రతా నియమాలను కఠినంగా అమలు చేయడంతో పాటు జోన్ వ్యాప్తంగా కొనసాగుతున్న భద్రతా డ్రైవ్‌లను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. ప్రైవేట్ సైడింగ్‌లో పనిచేసే భద్రతా సిబ్బందికి శిక్షణ, కౌన్సెలింగ్ అందించాలని డిఆర్ఎంలను ఆదేశించారు. శీతాకాల సంసిద్ధతలో భాగంగా పట్టాల వెంట ఉన్న చెట్లు, పొదలను తొలగించి సిగ్నల్స్ స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని ద్వారా భద్రత మరింత మెరుగై సమయపాలన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## మీడియా అక్రిడిటేషన్లపై జిఓ జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌ల జారీ కోసం నూతన నియమనిబంధనలను ఖరారు చేస్తూ 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025'ను ప్రభుత్వం విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా 'అక్రెడిటేషన్ కార్డు', డెస్క్ జర్నలిస్టులకు 'మీడియా కార్డు' ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే 'మీడియా కార్డులు' కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మాత్రమే ఉపయోగపడతాయని స్పష్టం చేసింది. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల కాలం రెండేళ్లుగా నిర్ణయించింది. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాత కమిటీలే కొనసాగుతాయని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇచ్చేందుకు ప్రస్తుతం ఉన్న నియమనింబంధనలను సమీక్షించి వాటి స్థానంలో కొత్త నియమనిబంధనలను, అక్రిడిటేషన్ విధానాన్ని రూపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ గత ప్రభుత్వం 2016 జూలై 15వ తేదీన జారీ చేసిన ప్రస్తుత అక్రిడిటేషన్ నిబంధనలను అంశాల వారీగా పరిశీలించి కొత్త 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్'ను సిఫార్సు చేస్తూ నివేదికను అందజేసింది. ఈ కమిటీ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్–2025' జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు జిఓఎంఎస్ 252 ను సోమవారం జారీ చేశారు.

**అర్హతా ప్రమాణాలు :**

✻ **న్యూస్ పేపర్లు :** కనీసం 2,000 ప్రతులు పంపిణీ అవుతున్న దినపత్రికలే అక్రిడిటేషన్ పొందేందుకు అర్హత. పిఆర్‌జిఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

✻ **ఎలక్ట్రానిక్ మీడియా :** శాటిలైట్ ఛానళ్లు 50 శాతం వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం 3 బులెటిన్లు టెలికాస్ట్ చేయాలి.

✻ **జర్నలిస్టుల అర్హత :** స్టేట్ లెవల్ అక్రిడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలి.'నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి.

**ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు :**15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా అక్రిడిటేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటు:**

✻ **రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ :** రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీకి చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్, కోచైర్మన్‌గా సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఉంటారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) సభ్యులు ఉంటారు.

✻ **జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ :** రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా డిపిఆర్‌ఓ వ్యవహరిస్తారు.

**డిజిటల్ మీడియాకు తొలిసారి నిబంధనలు:** డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రిడిటేషన్ ఇచ్చేందుకు సంబంధిత వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల మంది విజిటర్స్ ఉండాలని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మీడియా కేటగిరీలో గరిష్టంగా 10 కార్డులు మాత్రమే ఇస్తారు.

**నిబంధనల ఉల్లంఘన జరిగితే :** అక్రిడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వులలో ప్రభుత్వం స్పష్టం చేసింది.



నల్లగొండ జిల్లా, పల్లెపహాడ్ గ్రామంలో నూతన సర్పంచ్, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకారానికి హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి, స్వాతంత్ర్య సమరయోధురాలు అండమ్మలతో కార్యక్రమం అనంతరం ఫోటో దిగుతున్న నూతన పాలకవర్గం




## తెలంగాణలో కేరళ తరహా కూరగాయల మార్కెట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేరళ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా కూరగాయల మార్కెట్లు మారాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. కేరళలో కూరగాయల సాగు బాగుందని, మార్కెట్ అందుబాటులో ఉన్నదని, కౌలు వ్యవసాయం కూడా బాగుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా కూరగాయాల సాగు అంశాలను పరిశీలించి, నెల రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు. రైతు కమిషన్ బృందం ఇటీవల కేరళ పర్యటనకు వెళ్లిన సందర్భంగా అక్కడ పరిశీలించిన కూరగాయల సాగు విధానం, మార్కెటింగ్, రైతులు ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలు, కౌలు రైతు విధానం, పాలసీలపైన హైదరాబాద్‌లోని వ్యవసాయ, రైతు కమిషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భూమి సునీల్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా,అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ నర్సింహా రావు, మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, అగ్రికల్చర్ ఎడిఎ అనిత, ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు, రంగారెడ్డి జిల్లా డిహెచ్ఎస్ఓ సురేష్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఎడిఎ సంధ్య, ఎఓ హరి, ఎఇఓ శ్రావణి, హార్టికల్చర్ అధికారి స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగు చేసే రైతులు అమ్ముకునేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హార్టికల్చర్‌ను పెంచాలని భావిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూడా కూరగాయల మార్కెట్లు మారాలని, దోపిడీ వ్యవస్థ లేని మార్కెట్లు రావాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి సంబందించిన పాలసీలు జరగలేదని, గత ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు.



## రెవెన్యూ సమస్యల పరిష్కారం.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూ పరిపాలన కమిషనర్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఎ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టిజిఆర్ఎస్ఎ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతినిధులు వివరించిన అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి త్వరలోనే తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, టిజిటిఎ ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్, టిజిఆర్ఎస్ఎ ప్రధాన కార్యదర్శి వి. భిక్షం, కోశాధికారి మల్లేష్, టిజిఆర్ఎస్ఎ– సిసిఎల్ఎ యూనిట్ అధ్యక్షులు రాంబాబు, తహశీల్దార్ పాండునాయక్ పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు పని కల్పించాలి

ప్రభుత్వ విభాగాలకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థల నుండి వస్త్ర కొనుగోలుకు వంద శాతం ఆర్డర్లను తీసుకుని చేనేత, పవర్‌లూమ్ సంఘాలకు వర్క్ ఆర్డర్ ఇచ్చి చేనేత కార్మికులకు నిరంతరం పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు వస్త్ర ఆర్డర్లను వారం రోజుల్లో టెస్కోకు అందజేయాలని సూచించారు.హైదరాబాద్‌లోని సచివాలయంలో చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సంస్థకు అన్ని ప్రభుత్వ శాఖల నుంచి వస్త్ర ఆర్డర్లను వారం రోజుల్లో అందించాలని తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. 2025–26 సంవత్సరానికి గాను టెస్కోకు అన్ని ప్రభుత్వ శాఖల నుండి వారం రోజులలో తమకు కావాల్సిన వస్త్ర ఆర్డర్లు ఇవ్వాలని సూచించారు. అలాగే వివిధ శాఖలు టెస్కోకు బకాయి పడిన నిధులను వెంటనే చెల్లించాలన్నారు. 2026 27 సంవత్సరానికి గాను నాలుగు శాఖల నుండి మాత్రమే ఆర్డర్లు రాగ, మిగిలిన శాఖల నుంచి వారం రోజులలో ఆర్డర్లు అందించాలని వివిధ శాఖల అధికారులను కోరారు. వస్త్రాల ఇండెంట్‌తో పాటు 50 శాతం నిధులను అడ్వాన్సుగా చెల్లించినట్లయితే టెస్కో వస్త్ర ఉత్పత్తి ని ప్రారంభించి, సకాలంలో సరఫరా చేస్తుందన్నారు. ఈ సమావేశంలో చేనేత,జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ ,సెర్ప్ సి ఇఒ దివ్య తదితరులు పాల్గొన్నారు

## ఇద్దరు ఐఎఎస్ అధికారులకు పదోన్నతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ ఐఎఎస్ అధికారులు నవీన్ మిట్టల్, ఎం.దాన కిశోర్‌లకు అపెక్స్ స్కేల్ (లెవల్17)కు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదోన్నతులు 2026 జనవరి 1 నుంచి లేదా వారు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. పదోన్నతులు, అధికారుల పోస్టింగ్‌లను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న నవీన్ మిట్టల్‌ను అదే శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా (స్పెషల్ చీఫ్ సెక్రటరీ) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, ఎల్ఈటిఎఫ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఎం.దాన కిశోర్‌ను కూడా అదే శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగించనున్నట్లు ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (స్పెషల్‌ఎ) శాఖ తెలియజేసింది. గవర్నర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు సోమవారం ఉత్తర్వులను విడుదల చేశారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
మెట్రోజోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్-63
టెండరు నోటీసు నెం.30/25-26 (పేపర్ నోటిఫికేషన్)
ఇ-టెండర్ల కోసం అర్హులైన ఏజన్సీల నుండి టెండర్లకు ఆహ్వానం: విద్యుత్ సరఫరా మరియు పంపిణీకి సంబంధించిన ఒరిజినల్ పనుల కింద ప్రస్తుతం ఉన్న 11కెవి లైన్‌ను యూజి కేబుల్‌తో స్థానభ్రంశం చేయాలి. ఎ) జనరల్ కేటగిరీ ఇఎంజెడ్-33/25-26 కింద కెవి ఎఎస్ఆర్ఆర్ ఎస్ఎస్ నుండి ప్రసరించే 11 కెవి జిహెచ్ఎంసి.పార్క్ ఫీడర్. బి) హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ మెహదీపట్నం ఇఎంజెడ్-34/25-26 జనరల్ కేటగిరీ కింద ఉన్న ఆసిఫ్‌నగర్ 33/11కెవి నుండి ప్రవహించే 11కెవి ఎన్ఎస్ఎఫ్ మరియు, సి)హైదరాబాద్ దక్షిణ సర్కిల్ బేగంబజార్ డివిజన్‌లోని ఇఎంజెడ్-35/25-26 లో జనరల్ కేటగిరీ కింద ఎసామియా బజార్ ఫీడర్ 11 కెవి బైఫర్‌కేషన్ పనులు. దీనికి సంబంధించి ఎలాంటి ఇతర సమాచారం కావాలనుకున్నాగానీ www.tender.telangana.gov.in మరియు www.tasouthernpower.org వెబ్‌సైట్ ద్వారా చూసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీరు, ఆపరేషన్స్, మెట్రో జోన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 12442-PP/CL/ADVT/1/2025-26, Date: 22-12-2025

## నేడు నుండి లైసెన్స్ రిజిస్ట్రేషన్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నల్లగొండ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ,గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోఉదయం 9 గంటల నుండి లైసెన్స్ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార పరిరక్షణ (ఫుడ్ సేఫ్టీ) విభాగం అధికారులు తెలిపారు.జిల్లాలోని అన్ని రకాల ఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందేలా అవగాహన కల్పించడంతో పాటు,ఒకే చోట సులభంగా సేవలు అందించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ మేళాలో కొత్త ఫుడ్ సేఫ్టీ రిజిస్ట్రేషన్లు,లైసెన్స్ నూతనీకరణ,లైసెన్స్ మార్పులు అవసరమైన మార్గదర్శకాలు,సలహాలు అందించనున్నట్లు తెలిపారు.మేళాలో హోటళ్లు,టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, బేకరీలు,కిరాణా దుకాణాలు,మాంసం, చేపల విక్రయ కేంద్రాలు,పాల,పాల ఉత్పత్తుల వ్యాపారులు,ఫుడ్ స్టాల్స్,వీధి ఆహార విక్రేతలు,క్యాటరింగ్ యూనిట్లు తదితర అన్ని రకాల ఆహార వ్యాపారులు ఈ మేళాకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ చెక్కు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** నూతనకల్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన సోమాని నాయక్ కుటుంబానికి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్‌పి కె నరసింహ ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ నగదు చెక్కును అందజేశారు. నూతనకల్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సోమాని నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ప్రయాణ సమయంలో సిబ్బంది అత్యంత జాగ్రత్తలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, విధులకు ముందుగా బయలుదేరి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు ఎస్‌ఐ రామచందర్, అడ్మిన్ ఆర్ఎస్ఐ కె అశోక్ సిబ్బంది ఉన్నారు.





## ప్రజల మన్ననలు పొందాలి

**ప్రజాపక్షం/చిలుకూరు/అనంతగిరి :** నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కోసం కృషి ప్రజల మన్ననలు పొందాలను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. కోదాడ నియోజక వర్గంలోని చిలుకూరు మండలంలోని నారాయణపురం, అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామ పంచాయితీలకు సర్పంచ్ అభ్యర్థులుగా సిపిఐ నుండి గెలుపొందిన మండల జయమ్మ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గంద్ర లింగస్వామి, సర్పంచ్ వాడపల్లి ఉమా, ఉపసర్పంచ్ వాడపల్లి స్వాతిల ప్రమాణ స్వీకారాలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజల చేత ఎన్నుకోవడం ఎంతో అదృష్టమని ఈ అవకాశం అందరికి రాదన్నారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లావుల రాములు, బద్దం కృష్ణారెడ్డి, భద్రారెడ్డి, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, కనకయ్య, సాయిబిల్లి పాల్గొన్నారు.

## తెలంగాణ ద్రోహి ఎవరనేది అసెంబ్లీ సాక్షిగా నిరూపిస్తాం

### హరీష్ రావు వ్యాఖ్యలపై ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజం

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు ,వాస్తవ పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆహ్వానాన్ని పక్కదారి పట్టించేలా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తెలంగాణ ద్రోహి ఎవరనేది అసెంబ్లీ సాక్షిగా నిరూపిస్తామని ముఖ్యమంత్రి సవాల్ విసిరితే, ప్రతిపక్ష నాయకుడు సభకు వస్తారో లేదో చెప్పకుండా కేసీఆర్ పాత మాటలనే వల్లెవేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో యూరియాను రైతుల ఇంటికి తెచ్చి ఇచ్చామన్న హరీష్‌రావు మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని, గత పదేళ్లలో యూరియా కోసం రైతులు పడ్డ ఇబ్బందులను ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. ఆనాడు పత్రికల్లో వచ్చిన వార్తలే బిఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. గట్టిగా మాట్లాడినంత మాత్రాన అబద్ధాలు నిజాలు కావని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి హాజరైతేనే ఎవరు తెలంగాణకు ద్రోహం చేశారో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## 3884 కేసులు పరిష్కారం

### సైబర్ నేరాలకు సంబంధించి 33 కేసుల్లో రూ.11.50లక్షలు బాధితుల ఖాతాలో జమ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 3884 కేసులను పరిష్కరించడంతోపాటు సైబర్ మోసాలకు సంబంధించి 33 కేసుల్లో రూ.11లక్షల 50వేల రూపాయలను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి కె నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 446 క్రిమినల్ కేసులు, 1582 ఈపెట్టి కేసులు, 1856 యంవి యాక్ట్, డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించామన్నారు. ఈ క్రమంలో బాగా పనిచేసిన జిల్లా పోలీస్ శాఖ సిబ్బందిని అభినందిస్తున్నానని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన నిరుపేదలైన మారగొని స్వామి,అనంత రమేష్ లకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయ కొట్టి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత,డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,పాలకూరి యాద య్య, తాటికొండ సైదులు,ఆ గ్రామ సర్పంచ్ జీడీమడ్ల సైదులు,పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధికి పాటుపడతా



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధికి పాటుపడ్తానని మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామ నూతన పదవీ బాధ్యతలు చేపట్టిన బాణావత్ నాగలక్ష్మి వంశీ అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించగా గ్రామ కార్యదర్శి ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిర్యాలగూడ మండలంలోని చింతపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ముందున్న కర్తవ్యమన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధికారుల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాణావత్ లక్ష్మి శంకర్‌నాయక్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దు

### చదువు పట్ల ఆత్మవిశ్వాసం పెంచాలి
### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా చదువు పట్ల ఆత్మవిశ్వాసం పెంచేలా అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రజావాణి ముగిసిన తర్వాత అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న కొందరు విద్యార్థులు మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు బాధ కలిగిస్తున్నాయని ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులకు నిరంతరం మానసిక అవగాహన కల్పించాలని విద్యార్థులపై విద్యాభారం, వ్యక్తిగత సమస్యలు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఒత్తిడి పెరుగుతోందని పేర్కొంటూ,వాటిని అధిగమించే విధంగా కౌన్సెలింగ్ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రతి గురుకుల విద్యాలయంలో రెండు నెలలకు ఒకసారి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవగాహన కల్పించాలని, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.వెల్ఫేర్ హాస్టల్లో విద్యార్థులు చిన్న వయసులో డ్రగ్స్ కి అలవాటు పడుతున్నారని,వారికి చదువు పట్ల మక్కువ చూపేలా చొరవ తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్చార్జ్ డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి జిల్లా అధికారులు పాల్గొ,న్నారు.

**ప్రతి దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలి**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి నిర్లక్ష్యం లేకుండా ప్రజావాణి ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరిష్కార ప్రక్రియలో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం ప్రజల నమ్మకానికి నిదర్శనమని, ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు.

## విపత్తులు సంభవించకుండా చర్యలు




మాక్‌డ్రీల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/కోదాడ:** విపత్తులు సంభవించినప్పుడు ప్రమాదం నుండి ప్రజలు ఎలా అప్రమత్తం అవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ మాక్ డ్రీల్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటి, మినిస్ట్రి ఆఫ్ హోం ఎఫైర్స్, తెలంగాణ అదేశాల మేరకు సోమవారం కోదాడ పట్టణంలోని అనంతగిరి రోడ్డులోని పెద్ద చెరువు వద్ద మాక్ డ్రీల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెద్ద చెరువులో అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డ్డర్ఎఫ్ వాలంటీర్లు, వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు ఏ విధంగా కాపాడుకోవాలో ప్రత్యక్షంగా మాక్ డ్రీల్ లో ప్రదర్శించారు. ఇద్దరు వ్యక్తులు చెరువులో మునిగిపోతుండగా వారిని పడవ సహయంతో ఒడ్డుకు చేర్చి కాపాడారు.జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ గతంలో వరదలు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజలను రక్షించుకోవాడం జరుగుతుందని భవిష్యత్‌లో వరదలు సంభవిస్తే వరదలు ఎక్కువైనప్పుడు ఎలా స్పందించాలని వివరించారు. వరదలు వచ్చిన్నప్పుడు రెవిన్యూ, ఫైర్, పోలీస్, ఇరిగేషన్, మెడికల్, మున్సిపాలిటి, ఇరిగేషన్ పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి, ఎలక్ట్రసిటి అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ మాక్ డ్రీల్ ద్వారా ప్రజలను రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతరామరావు, అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, డిఎస్‌వో మోహన్‌బాబు, డిప్యూటి సిఈవో శీరిష, వెటర్నరి అధికారి శ్రీనివాస్, వైద్య ఆరోగ్య అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు**: విపత్తుల సమయంలో ఎక్కువ ప్రాణ నష్టం,ఆస్తి నష్టం సంభవించకుండా అన్ని శాఖల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు.విపత్తుల సమయంలో తక్షణ స్పందన, తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం త్రిపురారం మండలం, పెద్దదేవుల పల్లి సమీపంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ లో మాక్ ఎక్సర్సైజ్ ను నిర్వహించడం జరిగింది.ఫ్యాక్టరీలో కెమికల్ లీకేజీ, అలాగే భవనం కూలిపోవడం, గ్యాస్ లీకేజ్ వంటి సంఘటనల జరిగినప్పుడు వివిధ శాఖల సహకారంతో ఎక్కువ ప్రాణనష్టం,ఆస్తి నష్టం సంభవించకుండా తీసుకోవాల్సిన చర్యలపై కళ్లకు కట్టినట్లుగా మాక్ ఎక్సర్ సైజ్ ను నిర్వహించడం జరిగింది.డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ శ్రీదేవి, జిల్లా పరిశ్రమల అధికారి సతీష్,జిల్లా ఫైర్ అధికారి సందేశ్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ నరసింహ నేత,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు .వెంకటేశ్వర్లు,డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ సైట్ హెడ్ చక్రవర్తి శంకరన్,ఈఎస్‌డిహెడ్ వెంకట కొండలరావు,సైడ్ సేఫ్టీ హెడ్ డాక్టర్ రవికుమార్,తదితరులు హాజరయ్యారు.





## మెరుగైన వైద్య సేవలు అందించాలి

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు.నల్లగొండ పట్టణంలోని తులసి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను సోమవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని వసతుల కూడిన హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని కోరారు. నిరుపేదలకు తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ రమేష్,డైరెక్టర్ రమావత్ లాలు,డిఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్,కొలనుపాక రవికుమార్,మాజీ కౌన్సిలర్లు ఎడ్ల శ్రీను,గోగుల శ్రీను,డిసిహెచ్ఎస్ మాతృనాయక్,డాక్టర్లు రాజిరెడ్డి,నరేష్,పద్మ మోహన్,వేణు,మూర్తి,రమావత్ గౌతమ్,అరుణచ,శ్రీను తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావు కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి 38 ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 29, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ 2, విద్యాశాఖ, వైద్య శాఖ, సర్వే ల్యాండ్స్, సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి, కోపరేటివ్, మున్సిపాలిటీ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.







## అభివృద్ధి పథంలో నడుపుతాం

### కొత్త సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం...

**ప్రజాపక్షం/హాలియా:** సుమారు సంవత్సరన్నర తర్వాత గ్రామపంచాయతీలలో కొత్త సర్పంచులు కొలువుదీరారు. గతవారం జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాదిన్నర కాలంగా వెలవెలబోయిన గ్రామపంచాయతీలు సోమవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంతో కళకళలాడాయి. ఈ ఎన్నికల్లో ఎక్కువ మంది యువకులు సర్పంచుల ఎన్నికల్లో గెలుపొంది సర్పంచ్ కిరీటం ధరించారు.యువతతో గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడతాయని భావించిన ప్రజలు యువ నాయకుల్ని ఎన్నుకునేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన కొత్త సర్పంచ్ లు గ్రామాల అభివృద్ధి తమ ప్రధాన అజెండా అని తమ గెలుపుకు ఒక ప్రాధాన్యత తీసుకువస్తామని ప్రమాణ స్వీకారం లో తమ మనసులో ఉన్న మాటలని ప్రజల ముందు పెట్టారు. హాలియా మున్సిపాలిటీ నుండి విడిపోయి కొత్త గ్రామపంచాయతీగా ఏర్పడిన ఇబ్రహీంపేట గ్రామానికి నూతన రథసారథిగా ఎడవల్లి వంశీ కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. రాజకీయక నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన ఎడవల్లి వంశీకృష్ణారెడ్డిపై ప్రజలు అభివృద్ధి చేస్తాడనే నమ్మకాన్ని పెట్టుకున్నారు. దీంతోపాటు యాచారం గ్రామ సర్పంచ్ గా కుందూరు స్వాతి రాజేందర్ రెడ్డిలు కూడా యువ నాయకురాలే కావడం గమనార్హం. హజార్ గూడెం సర్పంచ్ భాస్కర్ రెడ్డి, నాయుడుపాలెం సర్పంచ్ కందుల మదన్ రెడ్డి, పంగమానికొండ తండా సర్పంచ్ గా లక్ష్మి తదితరులు అంతా కూడా యువకులే కావడం రానున్న రోజుల్లో గ్రామపంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని నమ్మకాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వెలిబుస్తున్నారు. సర్పంచ్ లను ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.మండలంలోని అన్ని గ్రామాలలో పంచాయతీల కు వచ్చిన సారధుల ప్రమాణ స్వీకారాలతో హోరెత్తాయి.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి


### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీస్తూ,వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ అబ్దుల్ కలామ్ ప్రాంగణం, ఎస్.వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వలిగొండలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025/26 ఇన్ స్పైర్ అవార్డుల ప్రదర్శన (2024/25) కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావుతో కలిసి ప్రారంభించారు. సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శన నమూనాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లోనూ ప్రతిభను చాటి జిల్లా ప్రతిష్టను పెంపొదించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత పెంపొందించడం, రైతులకు ఉపయోగపడే విధంగా ఆవిష్కరణలు ఉండడం ఎంతో అవసరమని అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణతో పాటు, ఈ ప్రదర్శనలలో పాల్గొనే విద్యార్థులకు కూడా జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏడు అంశాలలో 242 ప్రదర్శనలను జిల్లాలోని 2300 మంది విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ NIT అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.హరిప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి కందుల సత్యనారాయణ, ఏ.డి.ప్రశాంత్ రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఎస్.భాస్కర్, జిల్లా కో ఆర్డినేటర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణం చేయించిన ప్రత్యేక అధికారి. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పొగమంచు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**సుల్తాన్‌పూర్(ఉత్తర ప్రదేశ్):** దట్టమైన పొగమంచు కారణంగా సోమవారం ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. సర్కిల్ ఆఫీసర్ ఆర్ కె చతుర్వేది వివరాలు ప్రకారం...పూర్వాంచల్ జాతీయ రహదారిపై జైసింగ్‌పూర్ ప్రాంతంలోని దర్పిపూర్ సమీపంలో పశుగ్రాసంతో బీహార్ వైపు వెళ్తున్న ట్రక్కు యాక్సిల్ విరిగిపోవడంతో నిలిచిపోయింది. దట్టమైన పొగమంచు కారణంగా నిలిచి ఉన్న ఆ ట్రక్కు కనబడక లక్నో నుంచి అజంగడ్ వెళుతున్న కారు వెనుకనుంచి బలంగా ఢీకొంది. ప్రమాద తీవ్రత ఎక్కువ కావడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు అజంగడ్‌లోని సరాయ్‌మీర్ ప్రాంతంలోని దేవఖర్ గ్రామానికి చెందిన సికిందర్ (27), శంభునాథ్ (55), సురేంద్ర (30) అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో మరో ఏడుగురు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం అంబేద్కర్ నగర్ ఆసుపత్రికి తరలించామని, మృతదేహాలను పోస్టుమార్టం కోసం పంపినట్లు తెలిపారు.

- నేషనల్ హెరాల్డ్ కేసులో

## సోనియా,రాహుల్ సమాధానం కోరిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సమాధానం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు కోరింది. వారిద్దరికీ వ్యతిరేకంగా దాఖలు చేసిన ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోవడానికి తిరస్కరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) దాఖలు చేసిన విజ్ఞప్తిపై స్పందించి సవాధానం ఇవ్వాలని సోనియా,రాహుల్ గాంధీలను ఢిల్లీ హైకోర్టు సోమవారం కోరింది. ఈ కేసులో ప్రధానమైన పిటిషన్‌పైన, డిసెంబరు 16న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై స్టే ఇవ్వాలని కోరుతూ ఇ.డి. దాఖలు చేసన దరఖాస్తుపైన సోనియాగాంధీతోపాటు ఇతరులకు జస్టిస్ రవీందర్ దుడేజా నోటీసులు జారీ చేశారు. ఈ కేసును కోర్టు తదుపరి విచారణ నిమిత్తం వచ్చే ఏడాది మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా సోనియాగాంధీ, ఇ.డి. పిటిషన్‌పై సోనియా,రాహుల్ గాంధీలతోపాటు సుమన్ దూబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మెర్కెండైజ్ ప్రైవేట్ లిమిటెడ్, సునిల్ భండారికు కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపున ప్రాతినిధ్యం వహిస్తుండగా, సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వి, ఆర్.ఎస్.ఛీమాలు సోనియా,రాహుల్‌గాంధీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ధనాన్ని లెక్కల్లో చూపించకుండా అక్రమంగా తరలించిన పిఎంఎల్‌ఎ చట్టం కింద ఎఫ్‌ఐఆర్‌లో నేరాన్ని ప్రస్తావించనందువల్ల సంబంధిత దర్యాప్తు, దాని విచారణకు కూడా అనుమతి లేదని ట్రయల్ కోర్టు ఉత్తర్వు పేర్కొంది. సోమవారం ఈ కేసు విచారణ సందర్భంగా ట్రయల్ కోర్టు చాలా ఘోరమైన తప్పిందం చేసిందని, ఇతర కేసుల విచారణపై కూడాదీని ప్రభావం పడుతుందని మెహతా అభిప్రాయపడ్డారు. దర్యాప్తు చేసిన తర్వాత ఇడి అధికారులు సాక్ష్యాలను, ఇతర సమాచారాన్ని సేకరించారని, అందువల్ల విచారణ నిమిత్తం ఇ.డి ఒక ఫిర్యాదు ఇచ్చిందని అన్నారు. ఐతే ఇ డి తరపున చేసిన విజ్ఞప్తితో సింఘ్వి విభేధించారు. ఐతే నోటీసును తాను ఆమోదిస్తున్నాని, సమాధానం దాఖలు చేస్తామని చెప్పారు.

## మావోయిస్టుల ఆయుధాగారం ధ్వంసం



**సుక్మా:**ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మా వోయిస్టులకు చెందిన ఆయుధాల తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలను ధ్వంసం చేసి, ఎనిమిది రైఫిళ్లు, తుపాకీలు, పేలుడు వస్తువుల తయారీకి ఉపయోగించే పెద్ద మొత్తంలో పదార్థాలు స్వాధీనం చేసుకున్న ట్లు పోలీసులు తెలిపారు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) 150వ బెటాలియన్, స్థానిక పోలీసుల బృందం ఆదివారం మీ నగట్ట గ్రామ సమీపంలోని అటవీ కొండలలో అక్ర మ ఆయుధాల తయారీ యూనిట్‌ను ఛేదించిందని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ సోమవారం తెలిపా రు. ఎనిమిది సింగిల్‌షాట్ రైఫిళ్లు, 15 12బోర్ కా ట్రిడ్జ్‌లు, ఐదు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 30 మీటర్ల కా ర్డెక్స్ వైర్, 2 కిలోల పిఇకె పేలుడు పదార్థాలు, 1 కిలో ఎఎన్‌ఎఫ్‌ఒ (అమ్మోనియం నైట్రేట్ ఫ్యూల్ నూనె) పేలుడు వస్తువు, 10 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఎనిమిది వైర్‌లెస్ విహెచ్‌ఎఫ్‌సెట్‌లు, ఒక వెల్డింగ్ మెషిన్, ఇతర సామగ్రి, మావోయిస్టు యూనిఫాంలు సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో సాయుధ కార్యకలాపాలను పెంచడానికి నక్సలైట్లు ఈ యూనిట్‌ను నిర్వహిస్తున్నారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, భద్రతా దళాల అప్రమత్తత వేగవంతమైన చర్య ఆ సదుపాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, మావోయిస్టులకు గణనీయమైన దెబ్బ తగిలిందని అధికారి తెలిపారు. జనవరి 2024 నుండి సుక్మాలో 599 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 460 మందిని అరెస్టు చేశారని, 71 మందిని మట్టుబెట్టారని ఎస్పీ చవాన్ తెలిపారు. 'బస్తర్‌లో శాంతి భద్రతలను కాపాడటానికి సుక్మా పోలీసులు పూర్తిగా కట్టుబడి ఉన్నారు. మావోయిస్టుల హింసాత్మక భావజాలాన్ని, వారి అందుతున్న నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి కార్యలాపాలు అవిశ్రాంతంగా కొనసాగుతాయిన్నారు.

## వంద మంది రైతులపై కేసులు

- నిరసన ప్రదర్శనలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని ఆరోపణలు

**ముజఫర్‌నగర్:** ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ముజఫర్‌నగర్ జిల్లా జగహేడి టోల్‌ప్లాజా వద్ద రైతుల నిరసన ప్రదర్శన సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేశారనే ఆరోపణలపై ఒక జిల్లా స్థాయి నాయకుడితో సహా రైతుల సంఘానికి చెందిన 100 మందికి పైగా కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. సర్కిల్ ఆఫీసర్ నీరజ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి టిటావి పోలీస్ స్టేషన్‌లో 100 మందికి పైగా వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిలో 20 మంది పేర్లను ప్రస్తావించారు. టోల్ ప్లాజా వద్ద ప్రదర్శన నిర్వహించిన భారతీయ కిసాన్ యూనియన్ (తోమర్ వర్గం) జిల్లా అధ్యక్షుడైన నిఖిల్ చౌదరిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) నిబంధనలతో పాటు, ప్రభుత్వ ఆస్తి నష్టం నివారణ చట్టం నిబంధనల కింద కేసులు నమోదు చేశామని, దర్యాప్తు జరుగుతోందని సింగ్ తెలిపారు. టోల్ ప్లాజా ఉద్యోగులు రైతులతో దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ వందలాది మంది కార్యకర్తలు జగహేడి టోల్ ప్లాజా వద్ద గుమిగూడి ధర్నా చేశారని పోలీసులు తెలిపారు. నిరసన సమయంలో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని వారు చెప్పారు. నిరసనకారులు తమ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా యంత్రాంగానికి 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారని అధికారులు తెలిపారు. టోల్ పన్ను విధించే ముందు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని, రైతులు ఉపయోగించే ట్రాక్టర్లకు టోల్ ఛార్జీల చెల్లింపు నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్లలో ఉన్నాయి. టోల్ ప్లాజా ఉద్యోగుల పోలీసు వెరిఫికేషన్ చేయాలని మరియు నేర చరిత్ర ఉన్నవారిని జగహేడి టోల్ ప్లాజాలో విధులనుండి తొలగించాలని కూడా ఆ సంఘం కోరింది. టోల్ ప్లాజా వద్ద సరైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలనేది ఇతర డిమాండ్లలో ఉన్నాయని పోలీసులు తెలిపారు. డిమాండ్లను అంగీకరించడానికి అధికారులకు 15 రోజుల గడువు ఇచ్చామని, అలా చేయని పక్షంలో రైతుల సంఘం జిల్లాలోని జగహేడి టోల్ ప్లాజా వద్ద మళ్లీ ఆందోళన చేపడుతుందని అన్నారు.

### ఎంజి నరేగా రద్దు


# వినాశ పరిణామాలకు దారి

- ప్రతి ఒక్కరినీ రక్షించే హక్కులను కాపాడుకునేందుకు అందరూ ఏకం కావాలి
- గ్రామీణ కష్టాలను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ఉపాధి హామీ పథకాన్ని బుల్డోజర్‌తో కూల్చివేశారు
- ఓ ఆంగ్ల పత్రిక సంపాదకీయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర ఆందోళన



**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)రద్దు చేయడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చారిత్రకమైన పథకాన్ని ధ్వంసం వల్ల గ్రామీణ భారతదేశంలోని కోట్లాది మంది ప్రజలపై వినాశకరమైన పరిణామాలను చూపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరినీ రక్షించే హక్కులను కాపాడుకోవడానికి అందరూ ఏకం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఓ ఆంగ్లపత్రికలో 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను బుల్డోజర్‌తో కూల్చివేయడం' అనే శీర్షికతో ఆమె సంపాదకీయం రాశారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను అంతం చేయడం ఒక సామూహిక వైఫల్యం అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు అందులో పేర్కొన్నారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో వచ్చిన, గ్రామీణ కార్మికులకు 125 రోజుల వేతన ఉపాధికి నిబంధన కల్పించే 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (వి బి–జి రామ్ జి) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన మరుసటి రోజు ఆమె రాసిన సంపాదకీయం ప్రచురితం కావడం గమనార్హం. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ మహాత్ముని సర్వోదయ (అందరి సంక్షేమం) ఆశయాన్ని సాకారం చేసిందని, పని చేసే రాజ్యాంగ హక్కును అమలు చేసిందని సోనియాగాంధీ పేర్కొన్నారు. ఇప్పుడు గతం కంటే ఎక్కువగా మనందరినీ రక్షించే హక్కులను కాపాడుకోవడానికి ఏకం కావడం అత్యవసరమని ఉద్ఘాటించారు. గ్రామీణ కష్టాలను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ఉపాధి హామీ పథకాన్ని ఇప్పుడు బుల్డోజర్‌తో కూల్చివేశారని ఆవేదన చెందారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 ద్వారా ప్రేరణ పొందిన హక్కుల ఆధారిత చట్టమని, ఇది పౌరుల పని హక్కును సురక్షితం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతుందని ఆమె అన్నారు. 'గత కొన్ని రోజులుగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్చ, సంప్రదింపులు లేదా పార్లమెంటరీ ప్రక్రియలు లేదా కేంద్ర,రాష్ట్ర సంబంధాలకు గౌరవం లేకుండా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బుల్డోజర్‌తో కూల్చివేయడానికి ప్రయత్నించింది. మహాత్ముని పేరును తొలగించడం కేవలం మంచుకొండ కొన మాత్రమే. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ ప్రభావానికి అత్యంత కీలకమైన దాని అసలు స్వరూపాన్నే నాశనం చేశారు' అని ఆమె అన్నారు. విబి–జి రామ్ జి అనేది కేవలం కొన్ని అధికారిక నిబంధనల సముదాయం తప్ప మరొకటి కాదు అని అభివర్ణించారు. మోదీ ప్రభుత్వం కొత్త బిల్లు, కేంద్రం తన విచక్షణ మేరకు తెలియజేసిన గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే ఈ పథకం పరిధిని పరిమితం చేసిందని గాంధీ అన్నారు. పరిమితి లేని కేంద్ర కేటాయింపులకు బదులుగా, ఇప్పుడు ముందే నిర్ణయించిన బడ్జెట్ కేటాయింపు ఉంది, ఇది ప్రతి రాష్ట్రంలో అందించే ఉపాధి రోజుల సంఖ్యను పరిమితం చేస్తుంది. అందువల్ల పనిదినాల సంఖ్య ప్రజల అవసరాలకు కాకుండా కేంద్ర ప్రాధాన్యతలకు వదిలివేయబడింది అని ఆమె అన్నారు. ఏడాది పొడవునా ఉపాధి హామీని రద్దు చేశారని ఆమె తెలిపారు. గ్రామీణ భారతదేశంలో భూమిలేని పేదల బేరసారాల శక్తి పెరగడమే ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ గొప్ప ప్రభావాలలో ఒకటి అని, ఇది వ్యవసాయ కూలీలను పెంచిందని గాంధీ అన్నారు. 'ఈ కొత్త చట్టం కింద ఈ బేరసారాల శక్తి కచ్చితంగా క్షీణిస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా వ్యవసాయ రంగంలో ఉపాధి నిష్పత్తి పెరిగిన సమయంలో, జరగాల్సిన దానికి విరుద్ధంగా, మోదీ ప్రభుత్వం వేతనాల పెరుగుదలను అణచివేయడానికి ప్రయత్నిస్తోంది' అని ఆమె పేర్కొన్నారు. ఖర్చులో గణనీయమైన భాగాన్ని రాష్ట్రాలపైకి బదిలీ చేయడం ద్వారా, మోదీ ప్రభుత్వం ఈ పథకం కింద పని కల్పించకుండా వాటిని నిరుత్సాహపరుస్తోందని కూడా ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు మరింతగా దెబ్బతింటాయని కాంగ్రెస్ నాయకురాలు అన్నారు. విబి– జి రామ్ జి బిల్లు ప్రకారం, కేంద్రం, రాష్ట్రాల మధ్య వ్యయ పంపిణీ నమూనా 60:40, ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు 90:10, శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు 100 శాతం కేంద్ర నిధులుగా ఉంటుంది. నరేగా కింద 100 రోజుల నుండి 125 రోజులకు ఉపాధి హామీని పెంచామని మోదీ ప్రభుత్వం మోసపూరిత వాదనలకు పాల్పడుతోందని, పైన పేర్కొన్న అన్ని కారణాల వల్ల, అది కచ్చితంగా జరగదన్నారు. నిజానికి, నరేగానును అణచివేయడంలో మోదీ ప్రభుత్వ దశాబ్ద కాలపు రికార్డు నుండి దాని ఉద్దేశాల నిజ స్వరూపాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. 'ఇది పార్లమెంటులో ప్రధానమంత్రి ఈ పథకాన్ని అపహాస్యం చేయడంతో ప్రారంభమైంది. స్తంభించిపోయిన బడ్జెట్లు, ఓటు హక్కును హరించే సాంకేతికత వాడకం, కార్మికులకు ఆలస్యంగా చెల్లింపులు వంటి 'వెయ్యి కోతలతో మరణం' అనే వ్యూహం ద్వారా వేగంగా కొనసాగింది' అని ఆమె ఆ వ్యాసంలో అన్నారు. పని హక్కును ధ్వంసం చేయడాన్ని విడిగా చూడకూడదని, రాజ్యాంగంపై, దేశం కోసం దాని హక్కుల ఆధారిత దృక్పథంపై అధికార వ్యవస్థ చేస్తున్న సుదీర్ఘ దాడిలో భాగంగా చూడాలని గాంధీ అన్నారు. 'అత్యంత ప్రాథమికమైన ఓటు హక్కు అపూర్వమైన దాడికి గురవుతోందన్నారు. 'సమాచార హక్కును సమాచార కమిషనర్ల స్వయంప్రతిపత్తిని బలహీనపరిచే శాసన మార్పులతో, తప్పుగా నిర్వచించబడిన వ్యక్తిగత సమాచార డేటా కోసం చట్టం నుండి పూర్తిగా మినహాయింపులు ఇవ్వడం ద్వారా అపవిత్రం చేశారని ఆమె అన్నారు. 'విద్యా హక్కును బలహీనపరిచారు. అటవీ హక్కుల చట్టం, 2006, అటవీ (సంరక్షణ) నియమాలు (2022) ద్వారా గణనీయంగా బలహీనపడింది, ఇది అటవీ భూమిని మళ్లించడానికి అనుమతించడంలో గ్రామసభ పాత్ర నుండి తొలగించబడింది. భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం, 2013 గణనీయంగా నీరుగార్చబడిందని' ఆమె అన్నారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల ద్వారా ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర పొందే హక్కును నిరాకరించడానికి ప్రయత్నించిందిదని, 2013 జాతీయ ఆహార భద్రతా చట్టం కూడా తదుపరి ప్రమాదంలో పడే అవకాశం ఉందని సోనియాగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

## విద్వేష ప్రసంగ నియంత్రణ బిల్లుకు బిజెపి వ్యతిరేకం : సిద్ధరామయ్య



**మైసూరు:** విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా కర్ణాటక ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును బిజెపి సభ్యులు వ్యతిరేకిస్తున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఈ బిల్లుకు ఆమోదం తెలియజేయవద్దని బిజెపి సభ్యులు గవర్నరుకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారని విమర్శించారు. కర్ణాటకలో అలాంటివాటికి తావు లేకుండా చేసేందుకు ప్రభుత్వం విద్వేష ప్రసంగం–విద్వేష నేరాలు (నియంత్రణ) బిల్లును తెచ్చిందని, రాష్ట్రంలో శాంతి, సామస్యాలను కొనసాగించేందుకు వీలుగా ఈ బిల్లు తెచ్చామని చెప్పారు. ఈ బిల్లును కర్ణాటకలోని ఉభయసభలూ ఆమోదించి చట్టరూపం దాల్చే ప్రక్రియలో ఉండగా, బిజెపి, జెడి(ఎస్) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. శీతాకాల సమావేశాలు డిసెంబరు 19వ తేదీతో ముగిశాయి. ఈ బిల్లును ఇప్పుడు గవర్నరు ముందు ఉంచారు. గవర్నరు సంతకం చేస్తే బిల్లు చట్టరూపం దాలుస్తుంది. ఈ బిల్లును బిజెపి క్రూరమైనదిగా విమర్శించింది. వాక్‌స్వాతంత్ర్యంపై దాడి చేయడమేనని, రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి ఒక ఆయుధంగా ఉపయోగపడుతుందని, ఇది ప్రమాదకరమైనదని బిజెపి విమర్శించింది. ఈ బిల్లును ఆమోదించవద్దని బిజెపి సభ్యులు గవర్నరుకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ''బిజెపి ఎందుకు ఆందోళన చెందుతోంది? ఈ బిల్లు అందరికీ వర్తిస్తుంది, ఏ పార్టీకైనా వర్తిస్తుంది'' అన్నారు. ''మీరు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? విద్వేష ప్రసంగాలు చేస్తే సమాజంలో శాంతి ఉంటుందా? శాంతి,సోదర భావాలు ఉండాలంటే ఈ బిల్లు తీసుకురావాలి, ఇటీవలికాలంలో విద్వేష ప్రసంగాలు పెరిగిపోయాయిఇ, అందువల్లనే వాటిని నిషేధించాం'' అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. వాళ్ళు (బిజెపి) విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు కాబట్టే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఈ బిల్లు ద్వారా విద్వేష ప్రసంగం చేసినవారికి ఏడాది జైలుశిక్ష పడుతుంది. దీనిని ఏడు సంవత్సరాల వరకూ పొడిగించే అవకాశం ఉంది. విద్వేష నేరాలకుగాను చూప50 వేలు జరిమానా విధిస్తారు. పదే పదే అదే తప్పు చేస్తే గరిష్ఠస్థాయిలో ఏడు సంవత్సరాలు శిక్ష పడే అవకాశం ఉంది.

## అటవీ భూముల ఆక్రమణ.. సుమోటో కేసుగా 'సుప్రీం' స్వీకరణ


**న్యూఢిల్లీ :** ఉత్తరాఖండ్‌లో భారీ స్థాయిలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ అంశంపై దాఖలైన పిటీషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు స్వీకరించింది. అటవీ భూముల్ని ఆక్రమిస్తుంటే, స్థానిక రాష్ట్ర ప్రభుత్వం మూగ ప్రేక్షకుడిలా కూర్చున్నదని సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది. అటవీ భూముల ఆక్రమణ కేసును సుమోటోగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌ను విచారించింది. ఎంక్వైరీ కమిటీ వేసి, ఆ రిపోర్టును సమర్పించాలని ఉత్తరాఖండ చీఫ్ సెక్రటరీని ధర్మాసనం ఆదేశించింది. కండ్ల ముందే అటవీ భూమిని లాగేసుకుంటుంటే, ఉత్తరాఖండ్ అధికారులు మూగ ప్రేక్షకుల్లా ఉండడం షాక్‌కు గురి చేస్తున్నదని, అందుకే దీన్ని సుమోటో కేసుగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ కన్జర్వేషన్ సెక్రటరీ నివేదిక ఇచ్చే వరకు థార్డ్ పార్టీ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దు అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. నివాసిత ఇండ్ల మినహా ఖాళీ భూములను అటవీశాఖ తమ ఆధీనంలోకి తీసుకోవాలని కోర్టు తన ఆదేశాల్లో వెల్లడించింది. అనితా ఖండ్వాల్ దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు వాదనలు చేపట్టింది.

## ఉగ్రవాదులను గుర్తించేందుకు పరిశోధన

**జమ్ము:** జమ్ముకశ్మీర్ ఉదంపూర్ జిల్లాలో అడవి ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదులను గుర్తించేందుకు భద్రతా దళాలు ఆపరేషన్ పరిధిని విస్తరించాయి.పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్ర కారం ఇద్దరు ఉగ్రవాదులు ఒక ఇంటినుండి ఆహా రం తీసుకుని సమీప అడవి ప్రాంతంలోకి పారిపపోయినట్టు సమాచారం ఆధారంగా అధికారులు మజల్టా అడవుల్లో కార్డన్,శోధ ఆపరేషన్‌ను ఆదివారం ప్రారంభించారు. మజల్టా అడవి ప్రాం తంలో దాక్కున్న ఇద్దరు ఉగ్రవాదులను పట్టుకోడానికి సోమవారం ఉదయం స్నిఫర్ కుక్కలు , వై మానిక నిఘాలతోసహా కార్డన్ , శోధ ఆపరేషన్ మొదలు పెట్టారు.గత కొన్ని రోజులలో మూడోసా రి అడవి ప్రాంతంలో ఉగ్రవాదులను చూసిన స మాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ అవసరమైనది. ఆదివారం రాత్రికూడా ఆ ఇద్దరి కదలికలు గుర్తించారు. పోలీస్‌లు పారామిలిటరీ బలగాలు మజల్టా ప్రాంతంలో చోరే మోటు దాని సమీప అ డవి ప్రాంతంలో జరుగుతున్నదని , ఇది మునుపటి ఎన్‌కౌంటర్ ప్రాంతానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉందని అధికారులు తెలిపారు.

## మూకదాడిపై కేరళ ప్రభుత్వం సీరియస్

❑ నిందితులపై కఠినచర్యలు తీసుకుంటాం ❑ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం : కేరళ సిఎం హామీ



**తిరువనంతపురం:** దొంగగా పొరబడిన ఛత్తీస్‌గఢ్ వాసిపై కేరళలో మూకదాడి జరిగింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని వాగ్దానం చేసింది. పాలక్కాడ జిల్లా వలయార్ సమీపంలోని కిళకేఅట్టప్పాలం వద్ద దొంగతనానికి పాల్పడ్డాడనే అనుమానంతో రామనారాయణ్ (31)ను బుధవారం కొట్టి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించడంతో, ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ఈ ఘటనను అత్యంత కలవరపరిచేదిగా అభివర్ణించారు. రాష్ట్రానికి చేరుకున్న అతని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇస్తూ, ఇలాంటి చర్యలు కేరళ వంటి ప్రగతిశీల సమాజ ప్రతిష్టను దెబ్బతీస్తాయని, అవి ఏమాత్రం ఆ మోదయోగ్యం కాదని విజయన్ అన్నారు. బాధితుడిపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేశారని, దాడి చేసిన వారు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలని రాష్ట్ర మంత్రి ఎ ం.బి. రాజేష్ ఆరోపించారు. అధికార సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ కూడా ఈ నే రం వెనుక ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి కార్యకర్తలు ఉన్నారన్నారు. ఈ నేరానికి బాధ్యులైన వారిపై కఠిన చ ర్యలు తీసుకుంటామని విజయన్ హామీనిచ్చినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. జిల్లా పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృ ందం ఈ ఘటనపై విచారణ జరుపుతోందని, కేసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన అన్ని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశా లు జారీ చేసినట్లు సిఎం తెలిపారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సమీక్షించి, బాధితుడి కుటుంబానికి తగిన పరిహారం అందేలా చూస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి సామూహిక అప్రమత్త త అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ప్రతిపక్ష కాంగ్రెస్, బాధితుడి కుటుంబం పరిహారం, ఎస్‌సి /ఎస్‌టి (అత్యాచారాల నివారణ) చట్టంతో సహా క ఠినమైన చట్టాల కింద దర్యాప్తు చేయాలని డిమా ండ్ చేసిన మరుసటి రోజు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మృతుడి సోదరుడు ఆదివారం విలేకరుల తో మాట్లాడుతూ రూ. 25 లక్షల పరిహారంతో స హా తమ డిమాండ్లు నెరవేరే వరకు మృతదేహాన్ని స్వీకరించబోమన్నారు. కేరళ మంత్రులు కె. రా జన్, రాజేష్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించా రు. ఇది కేవలం మూకదాడి కేసు మాత్రమే కాద ని, ఇందులో జాతి వివక్ష కూడా ఉందని అన్నారు. నిందితులు మృతుడిని 'బంగ్లాదేశీ' అని పిలుస్తూ దాడి చేసి కొట్టి చంపారని మంత్రులు తెలిపారు. 'ప్రభుత్వం ఈ సంఘటనపై పకడ్బందీగా దర్యాప్తు జరిగేలా చూస్తుంది. ఈ నేరంలో పాలుపంచుకున్న వారిలో ఎవరినీ వదిలిపెట్టదు' అని రెవెన్యూ మంత్రి రాజన్ త్రిస్సూర్‌లో విలేకరులతో అన్నారు. మృతుడి కుటుంబానికి ముఖ్యమంత్రి విపత్తు సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) నుండి రూ. 10 లక్షల కంటే తక్కువ కాని మొత్తాన్ని మంజూరు చేస్తామని, ఈ విషయంలో మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. మృతుడి కుల ధృవీకరణ ప త్రాన్ని ధృవీకరించిన తర్వాత, ఎస్‌సి/ఎస్‌టి (అత్యాచారాల నివారణ) చట్టాన్ని కూడా వర్తింపజేస్తామని ఆయన పాలక్కాడ్‌లో విలేకరులతో అన్నా రు. మూకదాడి ఘటనపై విచారణ జరిపేందుకు డిఎస్‌పి (జిల్లా క్రైమ్ బ్రాంచ్) ఆధ్వర్యంలో 10 మ ంది సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక దర్యాప్తు బృం దం పాలక్కాడ ఎస్పీ ఆదేశాలు, పర్యవేక్షణలో పనిచేస్తుందని ఆయన తెలిపారు. నిందితుల రాజకీ య నేపథ్యం గురించి విలేకరులు అడిగినప్పుడు, ఆ విషయాన్ని ధృవీకరిస్తున్నామని ఆ అధికారి చెప్పారు. అరెస్టు అయిన వారిపై ఇప్పటికే పోలీసు కేసులు ఉన్నాయని ఆయన అన్నారు. దొంగతనం చేశాడనే అనుమానంతో రామనారాయణను కొట్టి చంపిన ఆరోపణలపై ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేశారు. గాయపడిన వ్యక్తిని పాలక్కాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ మరణించాడు.

## 'సర్' ప్రక్రియలో భారీ తప్పిదాలు

- ఈ ప్రక్రియ మొదటి నుండి చివరి వరకూ తప్పులతడక
- ఎన్నికల సంఘంపై బెంగాల్ సిఎం మమతా బెనర్జీ విమర్శల వర్షం



**కోల్‌కతా :** ఎన్నికల సంఘంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్రంలో ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల గణన తర్వాత ప్రచురించిన ముసాయిదా జాబితాలలో భారీ తప్పిదాలు ఉన్నాయని ఆరోపించారు. సోమవారం కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన టిఎంసి బూత్ స్థాయి ఏజెంట్ల (బిఎల్‌ఎ) సమావేశంలో మమత ప్రసంగించారు. ఈ ప్రక్రియ మొదటి నుండి చివరి వరకూ తప్పులతో కూడుకుందని ఆమె అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండానే ఎన్నికల సంఘం పరిశీలకులను నియమిస్తోందని, బిజెపి ప్రయోజనాలను ప్రోత్సహించడానికి పనిచేస్తోందని బెనర్జీ ఆరోపించారు. వేలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల నుండి తొలగించారన్నారు. ఇంత తక్కువ సమయంలో ఇంత మంది నిజమైన ఓటర్ల సమస్యలను ఎలా పరిష్కరించగలమో తమకు తెలియదని చెప్పారు. ఓటర్ల గణన తర్వాత ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 58,20,899 పేర్లను తొలగించడంతో, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల సంఖ్య 7.08 కోట్లకు తగ్గింది. ఎస్‌ఐఆర్ విచారణల కోసం మైక్రో అబ్జర్వర్లుగా నియమించబడిన కేంద్ర అధికారులకు స్థాని క భాషపై తక్కువ అవగాహన ఉందని, కొనసాగుతున్న సవరణ ప్రక్రియ రెండవ దశలో ధృవీకరణలను నిర్వహించడానికి వారు అనర్హులు టిఎంసి అధినేత్రి అన్నారు. బిఎల్‌ఒలను నియమించడంలో అనేక కేంద్ర ఏజెన్సీలు పాత్ర పోషించాయ ని, తమకు తెలియకుండానే వారు పరిశీలకులను కూడా నియమించారన్నారు. రాష్ట్రం వారికి అన్ని విధాలా సహకారం అందిస్తుంది, కానీ ఈ వ్యక్తుల ఒదరి వివరాలు, వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఏ విభాగాలలో పనిచేస్తున్నారు అనే విషయాలు తమ కు తెలియాలన్నారు. సాధారణంగా పూర్తి చేయడానికి రెండు సంవత్సరాలు పట్టే ఈ ప్రక్రియను అసెంబ్లీ ఎన్నికలకు ముందు రెండు నెలల్లోనే బలవంతంగా నిర్వహిస్తున్నారని, తద్వారా రాష్ట్రం ఆ రు నెలల పాటు తన అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టకుండా నిరోధించడానికే ఇలా చేస్తున్నారని ఆమె ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేశారు. గ తంలో ఇంత సిగ్గులేని కమిషన్‌ను ఎప్పుడూ చూ డలేదని, భవిష్యత్తులో కూడా ప్రస్తుత ఎన్నికల సం ఘం వంటిది మళ్లీ చూడాలనుకోవడం లేదన్నారు. కోల్‌కతా, దాని పరిసర ప్రాంతాల నుండి తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన దాదాపు 14,000 మంది బిఎల్‌ఎలు పాల్గొన్న ఆ సమావేశంలో, తప్పుగా పేర్లు తొలగించబడిన అన్ని ఓటర్లను సంప్రదించాలని, బయటి వ్యక్తులు తమ పేర్లను చేర్చడానికి ప్రయత్నిస్తున్నారనే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని బెనర్జీ పార్టీ కార్యకర్తలకు సూచించారు. మతువా కమ్యూనిటీ సభ్యులు, మైనారిటీ వర్గాలకు చెందిన వారు ఓటుహక్కు కోల్పోవడంపై ఆందోళన చెందవద్దని బెనర్జీ హామీ ఇచ్చారు. బెంగాల్‌లోని ముస్లింల మధ్య చీలిక తీసుకురావడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, సమాజాన్ని విభజించే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి కాషాయ శిబిరం మోసపూరిత వ్యూహాలను ప్రతిఘటించడానికి పార్టీ మద్దతుదారులు అన్ని విధాలా ప్రయత్నించాలని బెనర్జీ కోరారు. బిజెపి బారి నుండి బెంగాల్‌ను రక్షించిన తర్వాత ఢిల్లీని స్వాధీనం చేసుకుంటాము అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ప్రజాపక్షం
మంగళవారం, 23 డిసెంబరు

# మతోన్మాదుల మంటల్లో ఢాకా

బంగ్లాదేశ్‌లో గత 48 గంటల్లో మరోమారు పెద్ద ఎత్తున గుంపుల హింస ప్రజ్వరిల్లింది. 2026 ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయా అనే సందేహాలు పొడ చూపుతున్నాయి. తాజా హింసకు పచ్చి మతోన్మాద జమాతే ఇస్లామికి చెందిన సాయుధ గుంపులు కారణం. 'ఇస్లాంను అవమానించారంటూ' ఈ గుంపులు నిరాయుధులైన జనాలపై దాడి చేస్తున్నాయి. ముస్లిం సనాతన వాదాన్ని విమర్శించారని ఆరోపిస్తూ మీడియా సంస్థలపై దాడి చేశారు. ఈ హింసకాండలో ఢాకాలో, ఇతర జిల్లాల్లో 80 మంది వరకు ప్రాణాలు కోల్పోయారన్న వార్తలను తాత్కాలిక ప్రభుత్వ వర్గాలు అతిశయోక్తులుగా త్రోసిపుచ్చాయి. శుక్ర, శనివారాల్లో విస్తారంగా ప్రజ్వరిల్లిన హింసను చీఫ్ అడ్వైజర్ డాక్టర్ ఎం.యూనుస్ సహా తాత్కాలిక ప్రభుత్వ నాయకులు ప్రోత్సహించారని ప్రధాన ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పి) ఆరోపించింది. షెడ్యూలు ప్రకారం ఎన్నికలు జరగకుండా చూడటానికై హింసోన్మాదులపై చర్యలు తీసుకోలేదన్నారు. 2024జులైలో అవామీ లీగ్ నేత, ప్రధాని హసీనా వాజెద్‌ను దేశం నుంచి తరిమివేసిన విద్యార్థి ఉద్యమ (జన్–జెడ్) నాయకుల్లో ఒకరైన షరీఫ్ ఉస్మాన్ హది ఎన్నికల సభలో కాల్పులకు గురై మరణించిన ఘటన దేశవ్యాప్త భావోద్రేకాలు రేకెత్తించింది. ఆ విషాదం మరువకముందే తాజా కాల్పుల ఘటనలో మరో విద్యార్థి నాయకుడు మొతలబ్ షిగ్దర్ తీవ్రంగా గాయపడి మరణించాడు. ఈ మతోన్మాద గుంపులు మహాకవులు రవీంద్రనాథ్ ఠాగూర్, నజ్రుల్ ఇస్లాం చిత్రపటాలను ధ్వంసం చేశారు. గత సంవత్సరం జులైలో ప్రభుత్వ వ్యతిరేక అల్లర్లలో కూలగొట్టిన జాతిపిత ముజిబుర్ రెహ్మాన్, ప్రధాని హసీనా వాజెద్ నివాస గృహాల, ప్రసిద్ధ సాంస్కృతిక కేంద్రం ఛాయాంత ఆఫీసు శిథిలాలపై మళ్ళీ దాడి చేసి తమ కసి వెళ్ళగక్కారు. ఎన్నికల కోసం నామినేషన్లు వేస్తున్న తమ పార్టీ అభ్యర్థులపై జమాత్, నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి) (విద్యార్థి సంఘాల పార్టీ) గుంపులు దాడులు చేస్తున్నాయని బిఎన్‌పి నాయకులు సైన్యానికి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రధానాధికారి ఆదివారం రాత్రి త్రివిధ సైనిక దళాల అధికారులతో శాంతి–భద్రతల పరిస్థితిని, ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను చర్చించారు.

ఈ దాడుల్లో భారత్ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. ఢాకా, ఖుల్నా, మైమన్‌సింగ్ నగరాల్లో, ఈశాన్య బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఆందోళనకారులు భారత్ వ్యతిరేక నినాదాలు చేశారు. మైమన్‌సింగ్ నగరంలో దీపు చంద్రదాస్ (25) అనే హిందూ యువకుడ్ని కిరాతకంగా హత్య చేశారు. ఢాకాలో భారత హై కమిషన్ ఆఫీస్‌పై, జిల్లాలో మూసి వేయబడిన భారత వీసా కేంద్రాలపై దుండగులు రాళ్లు రువ్వారు. ఢిల్లీలోని భారత అధికారులు ఈ ఘటనలకు స్పందించి, బంగ్లాదేశ్ దౌత్యాధికారులను పిలిపించి అధికారికంగా నిరసన తెలియజేశారు.

ఎన్నికల్లో పోటీ చేయకుండా అవామీలీగ్‌ను నిషేధించిన దృష్ట్యా శ్రీమతి ఖలీదా జియా నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఫిబ్రవరి ఎన్నికల్లో అధికారి పార్టీగా ఆవిర్భవించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమంలో అది నిర్వహించిన సానుకూల పాత్ర మాజీ ప్రధాని శ్రీమతి ఖలీదా తీవ్ర అనారోగ్య పరిస్థితి సృష్టించే సానుభూతి బిఎన్‌పికి తోడ్పడతాయని భావించబడుతున్నది. ఇది జమాత్‌కు, ఎన్‌సిపికి ఇష్టం లేదు. మరోవైపున, డాక్టర్ యూనుస్ మరికొంత కాలం పరిపాలన సాగించాలనుకుంటున్నాడని, అందుకే గుంపు హింస పట్ల మెతకగా వ్యవహరిస్తున్నాడని బిఎన్‌పి నాయకులు ఫక్రుల్ ఇస్లాం మీర్జా తదితరులు అనుమానిస్తున్నారు.

మరోవైపున, డాక్టర్ యూనుస్ పాకిస్తాన్, చైనాలతో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నట్లు బంగ్లాదేశ్ టీవీ చానల్స్ చర్చల్లో పాల్గొనేవారు, అలాగే వార్తాపత్రికలు అభిప్రాయపడుతున్నాయి. డాక్టర్ యూనుస్ చైనా పర్యటనకు కూడా వెళ్లి వచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ యూనుస్ ప్రభుత్వం పట్ల బాహాటంగానే అయిష్టత వ్యక్తం చేసి ఉన్నారు. ఒకవైపు పాకిస్తాన్ తన పూర్వపు భూభాగంలో రాజకీయ పట్టుకోసం ప్రయత్నిస్తున్నది. రెండోవైపున, అంతర్గతంగా పచ్చి మతవాదశక్తులు పైచేయి కోసం యత్నిస్తున్నాయి. అరాచకం ప్రబలిన ఏ దేశంలో అయినా ప్రజాస్వామ్య పునరుద్ధరణ సులభం కాదు. బంగ్లాదేశ్ ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. ఇవి భారత్‌కు ఆందోళన కలిగించే పరిణామాలు.

# కొలువుదీరిన సర్పంచులు!

## సమస్యలతో స్వాగతం పలుకుతున్న గ్రామాలు!

రాష్ట్రంలో మూడు దఫాలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినవి. గ్రామీణ ఓటర్స్ ఎంతో చైతన్యంతో ఈ ఎన్నికల్లో 88.5 శాతంకు పైగా పాల్గొని గ్రామ ప్రథమ పౌరులను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కొంతకాలంగా బీసీల ఉద్యమం నడుస్తున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతంతోనే ఎన్నికలకు వెళ్లాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ హైకోర్టు, సుప్రీంకోర్టు డైరెక్షన్స్‌తో రిజర్వేషన్స్ 50 శాతానికి మించకూడదన్న నిబంధనలు ఉన్నందున.. ఇంకా ఆలస్యం చేస్తే గ్రామపంచాయతీలకు కేంద్రం నుండి వచ్చే నిధులు ఆగిపోవడంతో గత్యంతరం లేని పరిస్థితులలో పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలని నిర్ణయించి 20 రోజులలోనే పూర్తి చేయటం జరిగింది. ఈ ఎన్నికల్లో పోటీపడి పోటీచేసిన అభ్యర్థులు.. ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులు ఇస్తూ రూ.లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఏన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ఈనెల 22న ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 12,728 సర్పంచులు, 1,12,242 మంది వార్డు సభ్యులుగా పదవి బాధ్యతలు చేపట్టారు.

**ఎన్నికైన 50 శాతం మహిళలు:** 1992లో 73వ రాజ్యాంగ సవరణ ఆర్టికల్ 243డి ప్రకా రం స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్ కల్పించగా, దానిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని విభాగాల్లో మహిళా రిజర్వేషన్ 50 శాతానికి పెంచి అమలు చేస్తున్నారు. ఆ విధానంతోనే ఈ ఎన్నికల్లో సగం మంది మహిళలు గ్రామపంచాయతీలకు నాయకత్వం వహిస్తున్నారు. ఈ లెక్కన తెలంగాణలో ఎన్నికైన 6,364 మంది మహిళా సర్పంచులు 56,121 మంది మహిళా వార్డు సభ్యులు పరిపాలన పగ్గాలు చేపట్టారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో నేటి నుంచి నూతన సర్పంచులుగా పదవి బాధ్యతలు చేపట్టి, గ్రామపంచాయతీలో కొత్తపాలన ప్రారంభం కానుండగా.. ఎన్నికల్లో లక్షలు ఖర్చుపెట్టి అనేక వాగ్దానాలు చేసి ఎన్నికైన అభ్యర్థులకు పంచాయతీలలో నిధులు లేక గ్రామ సమస్యలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. ఐదేళ్ల పాటు గ్రామాల భవిష్యత్తును నిర్దేశించే బాధ్యతను స్వీకరించనున్న సర్పంచుల ముందున్న ప్రధాన సవాళ్లు గ్రామస్తుల దైనందిన జీవితానికి సంబంధించినవే కావడం గమనార్హం. ముఖ్యంగా గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెల నెలా జీతాలు చెల్లించలేని పరిస్థితులు, చెత్త తరలించే ట్రాక్టర్లకు అవసరమైన డీజిల్ కొరత, వీధిలైట్లు మంజూరులో జాప్యం, గ్రామ పారిశుద్ధ్యం, తాగునీటితో పాటు అనేక సమస్యలు వారి ముందున్నాయి. గత రెండు సంవత్సరాలుగా స్పెషల్ ఆఫీసర్స్ పాలనలో గ్రామ కార్యదర్శులు నిత్యం చూస్తున్నప్పటికి నిధులు లేవని పేరుతో కాలం గడుపుతూ వచ్చారు. నేడు నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, సభ్యులు కొలువు దీరిన వెంటనే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గ్రామాభివృద్ధికి సంబంధించి కీలకమైన 29 అంశాలను రాజ్యాంగంలోని 12 షెడ్యూల్లో చేర్చడం ద్వారా స్థానిక సంస్థలకు ఘనీయమైన బాధ్యతలు అధికారాలు దాఖలు పడ్డాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు పూర్తిగా అధికారాలు ఇవ్వకుండా, వాటి నిర్వహించుటకు నిధులు కూడా ఇవ్వకుండా.. గ్రామపంచాయతీ సర్పంచులను చిన్నచూపు చూస్తున్నాయి. అధికారాలతో పాటు తగిన ఆర్థిక స్వాతంత్రం లేకపోతే ఈ వ్యవస్థ కాగితాల పైనే మిగిలిపోతుంది. ఈ స్థానిక సంస్థల ఆర్థిక మనుగడకు 15 ఆర్థిక సంఘం నిధులు ఆయువుపట్టు. ఈ నిధులు గ్రామ జనాభా బట్టి కేటాయింపులు జరుగుతాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన సుమారు రూ. 1,477 కోట్లు నిధుల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి సగటున ఏడాదికి దాదాపు రూ.10 లక్షలు అందుతున్నాయి. ఈ పరిమిత నిధులతోనే వీధి దీపాలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక సంవత్సరాలు తీర్చాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రెగ్యులర్‌గా విడుదల చేయాలి. గ్రామపంచాయతీలు స్వయం సమృద్ధికి తోడ్పడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులే కాకుండా గ్రామానికి నిధులు సమీకరణకు ప్లాన్ వేసుకోవాలి. ఇంటి పన్ను, మంచినీరు సరఫరాపై, నూతనంగా గృహ నిర్మాణాలపై, కమర్షియల్ వ్యాపారులు నిర్వహిస్తుంటే.. వాటి పర్మిషన్లకు తదితర వాటిపై ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. ఈ విధంగా వచ్చే వాటిపై నుండి గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు, విద్యుత్ శక్తి, తాగునీటితోపాటు అభివృద్ధి పనులు చేసుకోవాలి. ప్రస్తుతం ఎన్నికైన సర్పంచులలో 50 శాతానికి పైగా నూతనంగా బాధ్యతలు చేపట్టినారు. ఇందులో 50 శాతం మహిళా ప్రతినిధులు ఉన్నారు. వీరికి పంచాయతీ చట్టం, పరిపాలన పుస్తకం చదువుకొని నిధులు, విధులు అధ్యయనం చేసి స్వతంత్రంగా వ్యవహరించాలి. అప్పుడే రాజ్యాంగం ద్వారా అందించిన హక్కులను నిర్వర్తించిన వాళ్ళు అవుతారు. ప్రతి మూడు మాసాలకు గ్రామసభలు నిర్వర్తించే విధంగా గ్రామ అభివృద్ధికి చేపట్టవలసిన పథకాలను రూపొందించుకునే విధంగా వివరించాలి.

– ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

### వెంటిలేటర్‌పై రూపాయి

# బిజెపి నేతలు, సమర్థకులు ఏమంటారు?


ఎం.కోటేశ్వరరావు

*గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంతో అనుభవం ఉందటూ ప్రధానిగా మోడీ పేరును ముందుకు తెచ్చిపుడు చెప్పారు. సదరు అనుభవం రూపాయి పతనాన్ని ఆపలేకపోయింది. ఇక మౌలిక సదుపాయాల గురించి అతిశయోక్తులు ఎలా ఉన్నాయో చూద్దాం. ఎనిమిది సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం పెద్ద ప్రకటనలు ఇచ్చి విజయాల గురించి చెప్పుకుంది. తమ ఏలుబడిలో విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 140కి పెరిగిందన్నది వాటిలో ఒకటి. నిజానికి 2014లో దేశంలో 94 పని చేస్తున్నవి, 31పని చేయనివి ఉన్నట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ వార్షిక నివేదికలో ఉందని ఫ్యాక్ట్‌చెకర్ అనే వెబ్ పోర్టల్ పేర్కొన్నది. యుపిఏ పాలనలో రోజుకు 12కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మించగా తాము 37 కిలోమీటర్లు నిర్మించినట్లు చెప్పుకుంది. నిజానికి తొమ్మిది సంవత్సరాల సగటు 19.17 కిలోమీటర్లు మాత్రమే, 2021లో 36.5 కిలోమీటర్లు నిర్మించారని లోక్‌సభకు అందచేసిన సమాచారంలో పేర్కొన్నారు. అందువలన అసత్యాలు, అర్ధసత్యాలకు మోడీ సర్కార్ పేరు మోసిందన్నది సత్యం. రూపాయి పతనం గురించి ఒక్క బిజెపి నేతలే కాదు, వారిని సమర్థించే సినీనటీనటులు, ఆధ్యాత్మికులం అని చెప్పుకొనే బాబాలు కూడా యుపిఏ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వారు తలలు ఎక్కడ పెట్టుకున్నారో తెలియదు.*

ఎవారికి కేవలం చెవులే ఉండి మెదడులో పదార్థం లేకపోతే చెప్పేవారు ఎన్నికతలైనా వినిపిస్తారు. రూపాయి పతనం గురించి ఇప్పుడు అదే నడుస్తున్నది. డాలరు విలువ పెరిగింది తప్ప మన రూపాయి పడిపోలేదని ఒక పాట, మిగతా కరెన్సీలతో పోలిస్తే మన పతనం తక్కువ, ఇతర కరెన్సీలన్నీ ఇలాగే ఉన్నాయంటూ మరోము క్తాయింపు. గతంలో వీరే ఏం చెప్పారంటే తాము చేస్తే సంసారం, ఇతరులు చేస్తే... అన్నట్లుగా ఉంది. అవునులే నడిచినంత కాలం దేశం కోసం ధర్మం కోసం అంటూ ఏమైనా చెప్పవచ్చు, చేయవచ్చు. డాలరుతో పోటీ పడి మన రూపాయి విలువను ఎందుకు పెంచలేదని ఎవరైనా ప్రశ్నిస్తే దేశద్రోహం నేరం కింద జైల్లో వేస్తారు. రూపాయి పతనమైతే వచ్చే నష్టం ఏమిటి ? ఉదాహరణకు నరేంద్రమోడీకి అమెరికాలో ఉన్న పలుకుబడి కారణంగా గత పదకొండేళ్లుగా మనం కేవలం పదిడాలర్లకే విమానంలో అమెరికా వెళుతున్నాం, రాయితీ టిక్కెట్ల ధరలు పెంచలేదు అనుకుందాం. గత ఏడాది కాలంలో రూపాయి విలువ 85 నుంచి 91కి దిగజారింది. టికెట్ కొనుక్కోవాలంటే రు.850 బదులు రు.910 చెల్లించాలి. ఇంకో ఉదాహరణ చెప్పాలంటే రూపాయి పాపాయికి రక్షణ లేకుండా పోయిందని నరేంద్రమోడీ, బిజెపి నేతలు ఊరూ వాడా నానా యాగీచేసి అధికారానికి వచ్చినపుడు కేవలం రు.600లకే ఆ టికెట్ దొరికేది. బిజెపి నేత సుబ్రమణ్య స్వామి చెప్పినట్లు మోడీ వస్తే విలువను 35కు పెంచుతామని చెప్పారు. ఆ పుణ్యం కట్టుకొని ఉంటే రు.350కే దొరికేది. ఇది అత్యాశ అనుకున్నా కనీసం "56"కు పెంచినారు. 560కి దొరికేది. మోడీకి అంత బలమైన ఛాతీ ఉందని జనం నమ్మేవారు. బిజెపి ప్రభుత్వ నిర్వాకం గురించి ఇంత కంటే వివరణ అవసరం లేదేమో ?

ప్రధాన మంత్రికి రోజూ సలహాలిస్తున్న ఆర్థిక సలహామండలి సభ్యుల్లో ఒకరైన సంజీవ్ సన్యాల్ పుండు మీద కారం చల్లుతున్నారు. రూపాయి పతనంపై తనకెలాంటి ఆందోళన లేదని చెప్పారు. ఆర్థిక స్థితికి రూపాయికి సంబంధం లేదని, దేశాల ఆర్థిక వ్యవస్థలలో ఉన్నత వృద్ధి రేటు ఉన్నపుడు తరచుగా కరెన్సీ మారకపు విలువలు తక్కువగా ఉంటాయన్నారు. రూపాయి పతనం 91 నుంచి వందకు చేరి నరేంద్రమోడీ కళ్లలో ఆనందం చూసే సమయం దగ్గరపడుతున్నదని నెటిజన్లు స్పందిస్తున్న తరుణమిది. టైమ్స్ నెట్‌వర్క్ 2025 సమావేశంలో సన్యాల్ మాట్లాడారు.దేశీయంగా ద్రవ్యోల్బణానికి కారణం కానంత వరకు రూపాయి పతనమైనా ఇబ్బంది లేదని, వెనక్కు తిరిగి చూస్తే జపాన్ ఆర్థిక వ్యవస్థ చాలా చాలా వేగంగా పురోగమిస్తున్నపుడు దాని కరెన్సీ చాలా బలహీనంగా ఉంది. చైనా తన కరెన్సీ విలువను పెరగనిచ్చేంతవరకు 1990, 2000 దశకాల్లో అలాగే ఉందంటూ సన్యాల్ చెప్పారు. ఒక దేశ కరెన్సీ డాలరుతో మారకపు విలువ తక్కువగా ఉన్నపుడు ఆయాదేశాల వస్తువుల ధరలు ప్రపంచ మార్కెట్లో చౌకగా ఉండి ఎగుమతులు పెరిగేందుకు అవకాశం ఉండే మాట నిజం. కానీ మన కరెన్సీ పతనమైనా ఎగుమతులు దానికి అనుగుణంగా ఎందుకు పెరగలేదో పెద్దలు చెప్పాలి. చైనానే తీసుకుంటే జిడిపిలో దాని ఎగుమతులు 2013లో 24.6శాతం కాగా 2024లో 20 శాతానికి తగ్గాయి. దాని యువాన్ విలువ పెరిగిందని సరిపెట్టుకుందాం. సన్యాల్ వాదన ప్రకారం దాని కరెన్సీ విలువ పెరిగింది కనుక తగ్గినట్లు అంగీకరిద్దాం. భారత్ పరిస్థితి ఏమిటి ? 2013లో జిడిపిలో మన ఎగుమతులు 25.43 శాతం కాగా 2024లో 21.2శాతానికి తగ్గాయి. ఈ కాలంలోనే కదా మన రూపాయి విలువ 60 నుంచి ఇప్పుడు 91కి పడిపోయినా ఎగుమతులు ఎందుకు తగ్గినట్లు ? జపాన్ ఎన్ విలువ డాలరుకు 2014లో 106కాగా ఇప్పుడు 157కు తగ్గింది. ఇదే కాలంలో దాని జిడిపిలో ఎగుమతులు 15.8 నుంచి 22.8శాతానికి పెరిగాయి. మన కరెన్సీ విలువపతనమైనా ఎగుమతులు ఎందుకు పెరగలేదు ? అందుకని రూపాయి పతనం గురించి ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకుంటున్నారు. వారి ధైర్యం ఏమంటే దీని గురించి సామాన్యులకు నిజానిజాలు తెలుసుకొనే తీరిక, ఆసక్తి లేదా తెలివితేటలు ఉండవనే గట్టి నమ్మకం. అభివృద్ధి చెందుతున్నపుడు కరెన్సీ విలువను తగ్గించి ఉంచుతారని చెప్పటమంటే కావాలనే పతనాన్ని ప్రోత్సహిస్తున్నారు లేదా పతనమౌతుంటే కాగల కార్యం గంధర్వులు తీర్చుతున్నారన్నట్లుగా చూస్తూ ఊరుకున్నట్లు కనిపిస్తున్నది. ప్రధాన ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ ఇంకా తీవ్రమైన వ్యాఖ్య చేశారు. రూపాయి పతనం అవుతుంటే ప్రభుత్వం "నిద్ర చెడగొట్టుకోవటం" లేదన్నారు. అంటే తాపీగా తడి బట్ట వేసుకొని ఉందని వేరే చెప్పనవసరం లేదు.



బిజెపి పెద్దలు ప్రతిపక్షంలో ఉన్నపుడేం చెప్పారో చూద్దాం. రాజ్యసభలో బిజెపి ఉపనేతగా ఉన్న రవి శంకర్ (2013 జులై 10) రూపాయి విలువ 60.15కు పడిపోయినపుడు " జాతీయ స్వాభిమానాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నది,ప్రభుత్వం ఏమి చెప్పినప్పటికీ ఆర్థిక మూలాలు విపరీతంగా దిగజారుతున్నయనేందుకు ఇది నిదర్శనం. విదేశీ పెట్టుబడులపై ఆధారపడటం దుర్బల నమూనా, ఎక్కువగా వాటిపై ఆధారపడితే అవెంత వేగంగా వస్తాయో అదే విధంగా వెనక్కు వెళతాయి." ఇలాంటి పెద్ద మనుషులందరూ 2014లో అధికారానికి వచ్చినకొత్తలో మోడీ పదే పదే విదేశాలకు ఎందుకు వెళుతున్నారంటే దేశప్రతిష్ట పునరుద్ధరణ, విదేశీ పెట్టుబడుల కోసం అని సమర్థించిన అంశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. యుపిఏ ప్రభుత్వ హయాంతో పోల్చితే ఎక్కువగా రూపాయి పతనమైంది. ఇప్పుడు స్వాభిమానం పెరిగినట్లా దిగజారినట్లా ? ఆడవారి మాటలకు అర్థాలే వేరులే అని మహిళలను రచయిత పింగళి నాగేంద్రరావు మిస్సమ్మ సినిమాలో తూలనాడారు గానీ బిజెపి నేతల మాటలకు అది వర్తిస్తుంది.


చిట్కాలు చెప్పటంలో మన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పెట్టింది పేరు. రూపాయి పతనం చెందినందుకు అసలు ప్రభుత్వాన్ని రద్దు చేస్తే పోతుంది అన్నారు.(2013సెప్టెంబరు ఒకటి) చెన్నయ్‌లో మాట్లాడుతూ పక్షవాతం వచ్చిన ప్రభుత్వాన్ని దేశం భరించలేదు, ఈ అనిశ్చితిని తొలగించటం మంచిది, సాధ్యమైనంత మేరకు త్వరగా ఎన్నికలు పెట్టాలి. మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక బాధల కంటే తన పేరు ప్రతిష్టలను పెంచుకోవటం గురించి ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారు. ప్రభుత్వ పెద్దగా దీనికి బాధ్యత ఎవరిదో నిర్ణయించాలి. సదరు వ్యక్తిని తొలగించాలి లేదా తానే బాధ్యత తీసుకోవాలి" ఎంత బాగా అన్నావు ఎవ్వరు నేర్పిన మాటరా వేదంలా విలువైన దంటూ ఒక పాట గుర్తుకు వచ్చింది. ఇప్పుడు నరేంద్రమోడీని లేదా కనీసం నిర్మలాసీతారామన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలి మరి, చేస్తారా? బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ గడ్కరీ (ఇప్పుడు జాతీయ రహదారుల కేంద్ర మంత్రి) ఉన్న సమయంలో(2012 మే 24) రూపాయి పతనానికి ప్రపంచ కారణాలు కానేకాదంటూ "సమస్య యూరో జోన్‌లో కాదు, యుపిఏ జోన్‌లో ఉంది. ఆర్థికవేత్త అయిన మన ప్రధాని నాయకత్వంలో రూపాయి స్వేచ్ఛగా పతనమౌతున్నది." బిజెపి మరోనేత పియూష్ గోయల్, ఇప్పుడు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి 2013 జూన్ 26న ఒక ట్వీట్ చేశారు (ఇప్పుడు ఎక్స్) పతనం అవుతున్న రూపాయిని చూస్తుంటే చాలా వేదనా భరితంగా ఉంది " రూపాయి పతనం కాకుండా మోడీ ప్రభుత్వం ఏమైనా పడకుండా కాపాడుతున్నదా ? గోయల్ ఆనందంతో గంతులు వేస్తున్నారా ? నిర్మలా సీతారామన్ ప్రతిపక్షంలో ఉండగా ఏం చెప్పారో చూద్దాం "రూపాయి పతనం చెందుతున్నపుడు మీరు ఊహించుకోవచ్చు, భారత ఎగుమతులు పెరుగుతాయి, ఎందుకంటే మీ వస్తువులు చౌకగా మారతాయి. మీ వస్తువులను కొనేందుకు విదేశాల వారు ఆకర్షణకు లోనౌతారు. కానీ అలా జరగటం లేదు, మీ వస్తువులను కొనాలని జనాలు అనుకోవటం లేదు. మీ పెట్టుబడులు పెరుగుతున్నాయి, రూపాయి పతనం అవుతున్నా మీ ఎగుమతులు పెరగటం లేదు, ఇది తీవ్రమైన పరిస్థితి. ఆందోళన పడాల్సిన అవసరం లేదని మనకు ప్రతిసారీ ప్రభుత్వం చెబుతున్నది. నేను ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చాను. నాకు తెలుసు అనేక మంది తమకున్న కొద్దిపాటి పొలాలను కూడా అమ్ముకొని విదేశాల్లో చదువుకుంటున్న తమ పిల్లల కోసం డబ్బు చెల్లించారు. రూపాయి విలువ పతనం కారణంగా బయట ఉన్న విద్యార్థులు చదువులను మధ్యలో ఆపివేసి తిరిగి రాకతప్పటం లేదు.

పైన చెప్పుకున్నవారందరికీ తిరుగులేని నేత నరేంద్రమోడీ ఏం సెలవిచ్చారో చెప్పుకోకపోతే ప్రహసనం సంపూర్ణం కాదు. ప్రధానమంత్రి పదవి స్వీకరించిన తరువాత రూపాయి పతనం గురించి నోరెత్తితే భారతమాత మీద ఒట్టు. అఫ్‌కోర్స్ మహానుభావులుగా మారిన తరువాత వారి మౌనానికి ఎన్నో అర్థాలు ఉంటాయనుకోండి. కర్ణాటకలోని హుబ్లీలో 2014 ఫిబ్రవరి 28న జరిగిన సభలో మాట్లాడుతూ ఇలా అన్నారు." మన రూపాయి నిలకడ లేకుండా ఉంది. విలువ పడిపోతూనే ఉంది. అతల్ జీ ప్రభుత్వంలో రూపాయి 40–45 మధ్య ఉంది, ఈ ప్రభుత్వ హయాంలో 62, 65, 70...గా పడిపోతూనే ఉంది. దిగుమతులు పెరుగుతున్నాయి, ఎగుమతులు తగ్గుతున్నాయి. స్పృహ ఉన్న ప్రభుత్వం చేయాల్సినపని ఎగుమతులను పెంచాలి, దిగుమతులను తగ్గించాలి" పదకొండు సంవత్సరాల పాలనలో మోడీ ప్రభుత్వం చేసిందేమిటి? తాజాగా వెలువడిన సమాచారం ప్రకారం 2025లో చైనా కస్టమ్స్‌శాఖ చెబుతున్నదాని ప్రకారం బీజింగ్‌తో మన వాణిజ్య లోటు 115 బిలియన్ డాలర్లు, మన దేశం 106 బిలియన్ డాలర్లు అంటున్నది, ఏ సంఖ్యను చూసినా మోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టుకున్నారు. పదకొండు సంవత్సరాల మోడీ ప్రభుత్వ నిర్వాకాన్ని చూసినపుడు 2014 తరువాత ఒక్క ఏడాది కూడా ఎగుమతులు పెరిగి దిగుమతులు తగ్గలేదు. పదకొండు సంవత్సరాలలో మన వాణిజ్య లోటు 80వేల కోట్ల డాలర్లు. తొలి ఏడాది 607 కోట్ల డాలర్లు లోటు ఉంటే 2024–25లో అది 950 కోట్ల డాలర్లకు చేరింది. అయినా సరే సమర్థవంతమైన పాలన అందిస్తున్నామని చెబుతుంటే మనమంతా నిజమేకదా అని నమ్ముతున్నాం, విశ్వాసం అలాంటిది మరి.

నిజంగా బిజెపి నేతలకు, వారిని సమర్థించేవారికి భారతీయ ఆత్మ, విలువలు, వలువలు ఉండి వారి గతాన్ని నెమరువేసుకుంటే వారి ముఖాలు ఇప్పుడు ఎక్కడ పెట్టుకుంటారు ?

# రాజకీయ దురంధరుడు మన పివి

బహుముఖ ప్రజ్ఞాశాలి, సంస్కరణాభిలాషి, బహుభాషా కోవిదుడు, అపర చాణిక్యుడుగా పేరుగాంచిన రాజకీయ దురంధరుడు, సాహితీవేత్త, దక్షిణ భారతం నుండి మొట్టమొదటిగా ప్రధానిపీఠం అధిష్ఠించిన తెలుగుతనపు ఠీవి మన పివి. పివి పూర్తిపేరు పాములపర్తి వేంకట నరసింహారావు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం 'వంగర' పివి స్వగ్రామం. ఆయన పుట్టింది వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామం. 1921 జూన్ 28న పివి జన్మించాడు. విద్యార్థి దశలోనే నిజాం నిరంకుశ విధానాలపై వ్యతిరేకత కలిగిన పివి. నిజాం ఆజ్ఞను ధిక్కరిస్తూ వందేమాతర గీతాలాపన చేస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. తత్ఫలితంగా నిజాం ప్రభుత్వం పివిని రాష్ట్రంలో ఎక్కడా చదువడానికి వీలు లేదని ఆజ్ఞాపించింది. పివి నాగపూర్ వెళ్ళి ఇంటర్‌ను, పూనేలో బిఎస్‌సి డిగ్రీని, నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బి అభ్యసించి అన్నింటా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. ఆ తరువాత హైదరాబాద్‌కు తిరిగివచ్చి బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ లాయర్‌గా న్యాయవాద వృత్తిని చేపట్టాడు. స్వామి రామానందతీర్థ పిలుపుతో కాంగ్రెస్‌లో చేరి నిజాం వ్యతిరేకోద్యమంలోను, స్వాతంత్ర్యోద్యమంలోను చురుకుగా పాల్గొన్నాడు. స్వామి రామానంద తీర్థను తన రాజకీయ గురువుగా పివి భావించాడు. 1948లో జరిగిన పోలీసు యాక్షన్ వల్ల హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తరువాత పివి 'కాకతీయ పత్రిక'ను స్థాపించాడు. ఆ పత్రికలో 'జయ' అనే మారుపేరుతో రచనలు చేశాడు. అలాగే ఆ పత్రికలో 'విజయ' అనే కలం పేరుతో తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో 'గొల్ల రామవ్వ' కథను రాశాడు. ఆవిధంగా పాత్రికేయుడుగా, పత్రికా రచయితగా గుర్తింపు పొందా డు. హైదరాబాదు రాష్ట్రంలో 1952లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికలతో పివి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైనది. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన పివి తన ప్రత్యర్థి తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన బద్దం ఎల్లారెడ్డి చేతిలో ఓటమి చెందాడు. ఆ ఓటమే భవిష్యత్తులో పివి ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి తొలిమెట్టు వేసిందని చెప్పుకోవచ్చు. ఆ తరువాత వరుసగా 1957, 1962, 1967, 1972లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పివి నేటి పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం నుండి వరుసగా నాలుగుసార్లు శాసనసభ్యుడుగా గెలుపొందాడు. 1962లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో న్యాయ శాఖ, జైళ్ళశాఖ, సమాచార శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆయా శాఖల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టాడు. ముఖ్యంగా జైళ్ళ శాఖలో ఓపెన్ జైలును ప్రతిపాదించి దానిని ఏర్పాటు చేశాడు. అట్లాగే 1964–67 మధ్యకాలంలో దేవాదాయ శాఖ మంత్రిగా, 1967లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా, 1968లో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యా రంగంలో సంస్కరణలు తీసుకువచ్చాడు. పివి సమర్థతను గుర్తించిన భారతీ జాతీయ కాంగ్రెసు పార్టీ అధిష్ఠానం ఆయనను 1971లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నియమించింది. ముఖ్యమంత్రిగా పివి భూ గరిష్టపరిమితి చట్టం తీసుకువచ్చాడు. అది కొంతమంది భూస్వాములకు నచ్చలేదు. వారంతా ఆయనకు వ్యతిరేక వర్గంగా కూటమి కట్టారు. ఆ భూస్వామిక కుట్రదారుల వల్ల ప్రజాస్వామిక దృక్పథం గల పివి ముఖ్యమంత్రి పదవిలో ఉండలేకపోయాడు. అధిష్ఠానం ఆయనను ముఖ్యమంత్రి పదవి నుండి తప్పించింది. పివి సేవలు రాష్ట్రానికంటే దేశానికి అవసరమని భావించిన ఇందిరాగాంధీ ఆయనను అఖిల భారత కాంగ్రెసు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా నియమించింది. 1977లో అప్పటి పరిస్థితుల బట్టి దేశవ్యాప్తంగా కాంగ్రెసు పార్టీ పరాజయం పాలైనా పివి మాత్రం హన్మకొండ నుండి పార్లమెంటుకు ఎన్నికైనాడు. 1980లో కాంగ్రెసు తిరిగి అధికారంలోకి వచ్చింది. అప్పుడు కూడా పివి హనుమకొండ నుండే గెలిచాడు. ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా పనిచేశాడు. పివికి 18 భాషలు వచ్చు. తన బహుభాషా నైపుణ్యంతో, చతురతతో భారత విదేశాంగమంత్రిగా ఐక్యరాజ్య సమితిలో, ఇతర దేశాలలో భారతదేశ ఔన్నత్యాన్ని చాటుతూ దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశాడు. ఇందిరా గాంధీ మరణం తరువాత రాజీవ్‌గాంధీ మంత్రివర్గంలో మానవ వనరుల శాఖ, హోంశాఖలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు.



1991లో రాజీవ్ గాంధీ హత్య తరువాత దేశపాలన సంక్షోభంలో పడింది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పివి దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలను స్వీకరించాడు. మైనారిటీలో ఉన్న ప్రభుత్వాన్ని పూర్తి కాలం 5 సం.లు నడిపిన ఘనత పివికే చెల్లుతుంది. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక పరిస్థితిని పటిష్ట పరిచే ప్రయత్నం చేశాడు. రాజకీయ నాయకులలో సాహితీ స్పర్శ కలిగినవారు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో పివి ఒకడు. పివి ఎన్నో సాహితీ చర్చల్లో పాల్గొనేవాడు. సాహిత్య ప్రసంగాలు చేసేవాడు. కాళోజి సోదరులతో సాహిత్య వేదికలను పంచుకొనేవాడు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన వేయిపడగలు నవలను 'సహస్ర ఫణ్' పేరుతో హిందీలోకి అనువదించాడు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. పివి తన రాజకీయ, సాహిత్య అనుభవాలతో ఇంగ్లీషులో 'ది ఇన్సైడర్' అనే పుస్తకం రాశాడు. అది తెలుగులో 'లోపలి మనిషి' పేరుతో అనువదించబడింది. దేశాభ్యుదయం కొరకు కృషిచేసిన మహ ర్షి పివి ప్రపంచంలో ఏ తెలుగువాడైనా 'మనవాడు' అని గర్వంగా చెప్పుకొనే తెలుగు తేజం, తెలంగాణ జాతిరత్నం పివి నరసింహారావు. ఆయన 2004 డిసెంబరు 23న గుండెపోటుతో మరణించాడు. తెలుగుజాతి ఉన్నంత వరకు పివి కీర్తి జ్యోతి ప్రకాశిస్తూనే ఉంటుంది.

**(నేడు పివి.నరసింహారావు వర్ధంతి)**

**– సుధాకర్.ఏ.వి, 9000674747**

# కర్షకుడి కన్నీళ్లు తుడిచేదెవరు!

మట్టిని ఆహారంగా మార్చగల నైపుణ్యం రైతులకు మాత్రమే స్వంతమని మనకు తెలుసు. రైతు తన చెమటను అన్నంగా మార్చగల నేర్పరి. అన్నదాతగా పేరొంది, తను ఆకలితో ఉన్నా లోక ఆకలి తీర్చగల త్యాగశీలి కర్షకుడు. కర్షకుడి కడుపు మాడితే దేశానికదే శాపం. రైతుకు విశ్రాంతి లేదు. సాగుబడి కొనసాగుతేనే పల్లెంలోకి పలు రుచుల ఆహార పదార్థాలు చేరుతాయి. దేశానికి వెన్నెముక తానే అయినా తన వెన్నెముక అప్పుల కుప్పలు మోయలేక బక్కచిక్కి వంగి పోతుంది. దేశ ఆర్థికాభివృద్ధి హలధారి చేతలతో రచించబడుతున్నది. రైతు ఆనందమే దేశ సౌభాగ్యం. రైతుకు చేయూతనివ్వని ప్రభుత్వం నిరాదరణకు గురవుతుందని చరిత్ర రుజువు చేస్తున్నది. నాగలికి విశ్రాంతి ఇస్తే దేశం అన్నం కోసం అలమటిస్తుంది. అతివృష్టి, అనావృష్టి విపత్తుల్లో నసిగిపోయే ఏకైక జీవి రైతు మాత్రమే. దేశవ్యాప్తంగా దాదాపు 150 మిలియన్ల రైతులు ఉన్నారని, 55 శాతం ప్రజలు వ్యావసాయ రంగం కేంద్రంగా జీవితాలను గడుపుతున్నారని తెలుస్తున్నది. భారతంలోకి యూపీలో రైతాంగం అత్యధికంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రైతుల్లో దాదాపు 80 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నప్పటికీ, వారి అధీనంలో 47 శాతం సాగు నేల మాత్రమే ఉందని తెలుస్తున్నది. గత మూడు దశాబ్దాల్లో భారతదేశం ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి ఏకైక కారణం మన రైతన్నల శ్రమస్వేదమే అని మరిచి పోరాదు. దేశవ్యాప్తంగా దాదాపు 51.09 శాతం వరకు (394 మిలియన్ ఎకరాలు) నేల వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నది. దేశంలోని మొత్తంలో వ్యవసాయ రంగంలో 46 శాతం శ్రమ జీవులు లేదా వర్క్ ఫోర్స్ పని చేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ హలధారి శ్రేయస్సును కోరుతూ పలు రైతుల హిత పాలసీలను తీసుకువచ్చిన భారత 5వ మాజీ ప్రధాన మంత్రి (1979–80) చౌదరీ చరణ్‌సింగ్ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా రైతు లేదా కిసాన్ లేదా ఫార్మర్స్ దినోత్సవం పాటించుట ఆనవాయితీగా మారింది. రైతు దినం 2025 ఇతివృత్తంగా దేశ సుస్థిరాభివృద్ధికి రైతులను బలోపేతం చేద్దాం అనబడే అంశాన్ని తీసుకున్నారు. వ్యవసాయ రంగంతో సాంకేతికలను అనుసంధానం చేస్తూ, రైతు సమస్యలకు పరిష్కారాలు చూపుతూ, రైతు హిత పాలసీలకు పదును పెడుతూ, కర్షకుడి వెతలకు వీలయినంత విరామమిస్తూ హలధారి కుటుంబంలో సంతోష హరివిల్లులు విరిసే విధంగా మన పథకాల రచన జరగాలి. ప్రతి ఒక్కరు రైతుకు మన మనసుల్లో కృతజ్ఞతాభావాన్ని నింపుకోవాలి.

## ప్రజాసేవే పరమావధిగా పని చేయాలి

ప్రజాపక్షం/ పాలకుర్తి: నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి ప్రజాసేవే పరమావధిగా పని చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని తీగారం గ్రామ నూతన సర్పంచ్‌గా బేతి కుమారస్వామి, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరు ఐక్యంగా, సమన్వయంతో పని చేస్తే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గ్రామాలలో తాగునీటి, అంతర్గత సీసీ రహదారుల అభివృద్ధి,డ్రైనేజీ వ్యవస్థ పటిష్టత, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటు వంటి పలు అంశాలకు అధిక ప్రాదాన్యత ఇవ్వాలన్నారు.పేదలు, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు గ్రామ స్వరాజ్యం, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

## నిర్దేశించిన గడువులోపు సమగ్ర ఓటరు జాబితా సవరణ పూర్తి: కలెక్టర్

ప్రజాపక్షం/భూపాలపల్లి : నిర్దేశిత గడువులోగా ఓటర్ జాబితాలో అన్ని దశల సవరణను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసిల్దారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలు, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై అన్ని ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని రెండు నియోజకవర్గాల పురోగతిని గణాంకాల ఆధారంగా సమీక్షించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సూపర్ వైజర్లు, బూతు స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఓటరు జాబితా రూపొందించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసిల్దార్లు, అబ్బాస్ పాల్గొన్నారు.


# గ్రామ పాలనకు కాంగ్రెస్ అధిక ప్రాధాన్యం

ఎంపి కడియం కావ్య



ప్రజాపక్షం/ధర్మసాగర్: గ్రామాలలో సుపరిపాలనకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామసర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన తోట నాగరాజు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజల నమ్మకంతో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన తోట నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా తోట నాగరాజు పనిచేస్తున్నారని అన్నారు. తోట నాగరాజుకు గ్రామ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేను, తనను ఎప్పుడు కలిసి నిధులు మంజూరు కోరుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పాలనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పంచాయితీ వ్యవస్థను బలోపేతం చేస్తోందని, గ్రామాలకు నేరుగా నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పెద్ద పెండ్యాల గ్రామ అభివృద్ధికి అవసరమైన సెంట్రల్ లైటింగ్, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, సంక్షేమ పథకాల అమలులో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో ముందుకు తీసుకువెళ్లాలని ఎంపీ సూచించారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో ఇంతే ఉత్సాహంతో ప్రతి ఒక్కరు పని చేసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యర్యంలో నూతనంగా ఎన్నికైన గ్రామసర్పంచ్ తోట నాగరాజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఘనంగా సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/లింగాలఘణపురం: నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, అవినీతి అక్రమాలకు దూరంగా ఉండి, నీతి నిజాయితీతో పని చేసినప్పుడే, ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని, స్టేషన్ఘన్పూర్ శాసనసభ్యులు, కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని, నెల్లుట్ల, బండ్లగూడ, గ్రామాలలో, నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యుల, ప్రమాణ స్వీకారమహోత్సవానికి, స్టేషన్ఘన్పూర్ శాసనసభ్యులు, కడియం శ్రీహరి, హాజరయ్యారు. పదవిబాధ్యతలు స్వీకరించిన, సర్పంచులు, వార్డు సభ్యులకు, వారు పుష్పగుచ్ఛ మందు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన , సర్పంచులకు, ఎమ్మెల్యేగా నేను, ఎంపీగా కడియం కావ్యతో పాటు, ప్రభుత్వం అండగా ఉంటుందని, గ్రామాలలో అభివృద్ధి చేసేందుకు, ఇది మంచి అవకాశం అని వారు సూచించారు. ఎన్నికల సమయంలో, చెప్పినట్లుగా, ప్రతి గ్రామానికి, అభివృద్ధి నిధులు మంజూరు చేస్తానని వారు హామీ ఇచ్చారు. గ్రామంలో, ప్రతి ఒక్కరితో, స్నేహపూర్వకంగా ఉండి, కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని అన్నారు. ప్రతి గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, సర్పంచులు, నర్సింగ రామకృష్ణ, పో రెడ్డి సంతోషి, మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కొల్లూరి శివకుమార్, మాజీ జెడ్పిటిసి, గుడి వంశీధర్ రెడ్డి, ఉప సర్పంచ్, గట్ట గల్ల నవీన్ కుమార్,, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి సంతకంతోనే రూ.5లక్షల సిసి రోడ్లు మంజూరు



ప్రజాపక్షం/గూడూరు: గూడూరుమండల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా వాంకుడోత్ సునీత కోమ్మాలునాయక్ ఉపసర్పంచ్ చంటి స్వామి వారితోపాటు 14 మంది వార్డు సభ్యలతో సోమవారం అరంగంగ వైభవంగా ప్రమాణ స్వీకారం చేశారు. గూడూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీలో స్పెషల్ ఆఫీసర్ తాహాశీల్దార్ నాగభవాని కార్యదర్శి అశోక్ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈసందర్బంగా సర్పంచ్ పదవి బాధ్యతలను చేపట్టి మొదటి సంతకం జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఐదు లక్షలతో సిసిరోడ్డు పనులను ప్రారంభించే ఫైల్‌పై పెట్టడం జరిగింది. ఈసందర్బంగా సర్పంచ్ సనీత కోమ్మాలునాయక్ మాట్లాడుతూ మానుకోట ఎమ్మెల్యే మురళినాయక్ సహకారంతో గూడూరు మేజర్ గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు.ప్రాముఖ్యంగా గూడూరులో కోతుల బెడద ఎక్కువగా ఉండేదని నేను సర్పంచ్ కాకమునుపే తన భర్త కోమ్మాలునాయక్ గూడూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో కోతులను పలుమార్లు పట్టుకొని దూరంగా అడవిలో వదిలి పెట్టి కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఆమే గుర్తుచేశారు. ఇప్పటినుండి గూడూరు గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు తమ ఉపసర్పంచ్ 14 మంది వార్డు సభ్యలు అహర్నిశలు కృషిచేసి ముందుకు తీసుకెళ్లామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గోన్నారు

## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి: గోపాల్‌రావు



ప్రజాపక్షం/ములుగు: విద్యార్థులకు శారీరక శ్రమతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. కమిషనర్ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం హైదరాబాద్ ఆదేశానుసారం తాడ్వాయి మండల గ్రామంలో బాలికల ఆశ్రమ పాఠశాల నందు మూడవ విడత పాఠశాల విద్యార్థినులకు కంటి పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు ప్రారంభించి విద్యార్థినిలతో మాట్లాడుతూ పోషకాహారం గలిగిన ఆహార పదార్థాలైన ఆకుకూరలు, గుడ్డు, పాలు, పండ్లు లాంటివి ఎక్కువగా తీసుకున్నప్పుడే కంటి సమస్యలకు దూరం చేయవచ్చునని దానితో పాటు రెగ్యులర్‌గా టివిలు చూడడమే మొబైల్ వాడుకోవడం లాంటి వాటిని తగ్గించాలని విద్యార్థినిలకు సూచించారు. ఆర్‌బిఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణధీర్ మాట్లాడుతూ రెండవ విడత కార్యక్రమంలో జిల్లా మొత్తంలో 19090 విద్యార్థిని, విద్యార్థులు కంటి పరీక్షలు నిర్వహించామని దీనిలో 1222 విద్యార్థిని, విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశామని 24 విద్యార్థిని, విద్యార్థులకు కంటి సమస్యలపై ఉన్నత శ్రేణి ఆసుపత్రులకు రిఫర్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎం అండ్‌హెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్, డెమో సంపత్, ఆర్‌బిఎస్‌కే వైద్యాధికారుడు డాక్టర్ వెంకటేష్, ఆప్తాలమిక్ ఆఫీసర్ తిరుపతి, ఆశ్రమ స్కూల్ ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు మంగ జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవ, క్రమశిక్షణ, నైతికతకు వెంకటస్వామి జీవితం నిదర్శనం: డిఎస్‌పి



ప్రజాపక్షం/మహబూబాబాద్: కాక జి వెంకటస్వామి వర్ధంతి వేడుకలను సోమవారం మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఏ.అర్. డిఎస్పీ శ్రీనివాస్, పోలీస్ అధికారులు గాంధీ చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూసేవ, క్రమశిక్షణ, నైతికతకు జి. వెంకటస్వామి జీవితం నిదర్శనం అన్నారు. సుదీర్ఘకాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిథ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని, ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ గంధ్రతి మోహన్, ఎస్.బి ఇన్స్పెక్టర్ నరేందర్, సోములు, అనిల్, నాగేశ్వర్రావు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం



ప్రజాపక్షం/ములుగు: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ఆర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 35 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 08, గృహ నిర్మాణ శాఖకు 04, పెన్షన్ 06, ఇతర శాఖలకు సంబంధించినవి 17 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి


సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



ప్రజాపక్షం/కాజీపేట: తెలంగాణ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు స్థాపించాలని,రైల్వే కూడలి కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు మడత కాళిదాస్, బిఆర్ భగవాన్ దాస్ నేతృత్వంలో దశాబ్దాల సుదీర్ఘ పోరాటం అనంతరం కాజీపేట అయోధ్య పురంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించడం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. సోమవారం మడికొండ గ్రామంలో మాలోతు శంకర్ అధ్యక్షతన సీపీఐ కాజీపేట మండల సర్వ సభ్య సమావేశం జరగగా నేదునూరి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అయోధ్య గ్రామంలో 114 మంది రైతులు నూట అరవై ఎకరాలను రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి భూములు ఇవ్వడం జరిగిందని తెలిపారు. భూ నిర్వాసితులకు స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని అధికారులు, పాలకులు చెప్పి ఇవ్వకపోవడాన్ని నేదునూరి జ్యోతి తీవ్రంగా ఆక్షేపించారు. ఎకరానికి 33 లక్షలు లెక్క కట్టి ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే రైతాంగానికి చెల్లించి 25 లక్షల రూపాయలు చెల్లించకపోవడం అన్యాయమని, భూములు ఇచ్చినటువంటి రైతులకే 25 లక్షలు ఇచ్చి ఉద్యోగాలు కేటాయించాలని పాలకవర్గాలను డిమాండ్ చేశారు. ఇప్పటికీ 9ఎకరాల మూడు గుంటలకు ఎనిమిది మంది రైతులకు డబ్బులు ఇవ్వలేదని తీవ్రంగా విమర్శించారు. అభివృద్ధి పేరుతో పేదల భూములు గుంజుకొని రైతుల్ని కూలీలుగా మార్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని, దేవుని మాన్యాల భూమి పేరుతో, సీలింగు భూమి పేరుతో పేద రైతుల్ని దగా చేయడం సరైనది కాదని తెలిపారు. స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని వెంటనే భూనిర్వాసితులకు న్యాయం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బికేఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, హనుమకొండ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మునిగాల బిక్షపతి, నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్, దుస్సా వెంకటేశ్వర్లు, బిక్షపతి, మామిండ్ల శ్రీకాంత్, మల్లయ్య, రాజు, ఎల్లమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి : సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా గ్రామ సర్పంచులు పాలకవర్గం కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు.భూపాలపల్లి మండలం మోరంచపల్లి రేగొండ మండల కేంద్రం, కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట, గణపురం మండలం బుద్దారం, గణపురం, చెల్పూర్ గ్రామాలల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి పాల్గొన్నారు. గ్రామాలల్లో కొత్త సర్పంచ్, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా కొత్త సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు మెంబర్లు నిత్యం పని చేయాలన్నారు.ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలకవర్గం నిత్యం పని చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధం, విద్య , ఆరోగ్య రంగాల్లో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పారదర్శకతతో పాలన సాగించాలని నూతన సర్పంచ్‌కు, పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లు నాయకులు పాల్గొన్నారు.

## సదరమ్ క్యాంప్ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ: జనగామ పట్టణంలోని ప్రభుత్వ హాస్పటల్‌లో అమలవుతున్న సదరన్ కార్డుల విభాగం పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు. సోమవారం యుడిఐడి కార్డుల జారీకి సంబందించిన దివ్యాంగుల నమోదు విధానం, సదరన్ అంచనా పరీక్షలు, వైద్యుల ధృవీకరణ, డాక్యుమెంట్ల పరిశీలన, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, జనరేషన్, కార్డుల ముద్రణ మరియు పంపిణీ ప్రక్రియను అదనపు కలెక్టర్ సమీక్షించారు. దివ్యాంగులకు అందుతున్న సౌకర్యాలు, వేచిచూసే సమయం, కౌంటర్ల నిర్వాహణ, సహాయక సిబ్బంది అందుబాటులో ఉండడం, లది తర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరిండెంట్, డిఆర్‌డిఓ, డిపిఎం, తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల ఆకలి తీరుస్తున్న అక్షయ పాత్ర సేవలు అనిర్వచనీయం



ప్రజాపక్షం/ వరంగల్ : పేద విద్యార్థుల ఆకలి తీరుస్తున్న అక్షయ పాత్ర సేవలు అనిర్వచనీయం అని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగర పరిధి 14 వ డివిజన్ ఎనుమాముల ప్రాంతం లో ఇస్కాన్ అక్షయ పాత్ర ఆధ్వర్యం లో సామాజిక సేవా కార్యక్రమం (సిఎస్ఆర్) లో భాగం గా హెచ్‌డిబిసి సహకారం తో అధునాతనంగా ఏర్పాటు చేసిన వంటశాల యంత్రాలను సోమవారం మంత్రి కొండా సురేఖ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇస్కాన్ సేవా సంస్థ వారు ఎనుమాముల ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిచెన్ యంత్రాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించడం జరిగిందని, ప్రపంచ వ్యాప్తం గా ఇస్కాన్ అంటే తెలియని వారు ఉండరని అంతర్జాతీయ స్థాయి లో పేరు ప్రతిష్ఠలు పొందిన ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ అని కృష్ణ చైతన్యాన్ని విశ్వ వ్యాప్తం చేయడానికి ఏర్పడిందని అనేక విద్యా సంస్థలను సంస్థ నడుపుతుందని, హరే కృష్ణ సంకీర్తన ఉచిత ప్రసాద వితరణ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వీరు నిర్మించిన ఆలయాలు ఎంతో ప్రతిష్ట పొందాయని అక్షయ పాత్ర ఫౌండేషన్ అనునది ఇస్కాన్ కు అనుబంధం గా పని చేస్తుందని, ఈ సంస్థ బెంగుళూరు కేంద్రం గా ప్రారంభించబడి, ఆకలి కారణం గా ఏ బిడ్డ చదువుకు దూరం కాకూడదు అనే ఉన్నత లక్ష్యం తో ప్రారంభించారని, నగరంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకం (ఎండిఎం)లో భాగంగా నాణ్యమైన రుచికరమైన వేడి ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని నడుపుతున్న అతిపెద్ద సంస్థ ఇదేనని అన్నారు. కేంద్రీకృతంగా ఏర్పాటు చేయబడిన వంటశాలలో వండడం ద్వారా లక్షలాదిమంది పిల్లలకు భోజనాన్ని అందిస్తున్నారని, గంటలో 40 వేల చపాతీ లను తయారు చేసే యంత్ర సామాగ్రి వీరి వద్ద ఉందన్నారు. భారతదేశంలో 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉన్న 22 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు ప్రతి రోజు 20 లక్షల పైచిలుకు విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధికి బాటలు

రూ.కోటితో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని



ప్రజాపక్షం/హనుమకొండ: రాజకీయాలకు తావులేకుండా అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున 7వ డివిజన్ లో రూ.100 లక్షలతో సైడ్ డ్రైనేజీ నిర్మాణం, కల్వర్ట్ నిర్మాణం, పబ్లిక్ గార్డెన్‌లో చిన్న పిల్లలకు ఆట వసతుల కల్పన లకు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ క్రమంలో కాకాజీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పరిశీలించారు. వర్షాకాలంలో ప్రధానంగా డ్రైన్ ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరంలో అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా కృషి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ పరిధిలో గతంలో కాంగ్రెస్ కార్పొరేటర్స్ ఉన్న ఒక్కో వార్డుకు కనీసం 50లక్షలు పెట్టిన దాఖలాలు లేవని నేడు ప్రతీ వార్డుకు 5 కోట్ల పై మేర నిధులను కేటాయించి, పనులను పూర్తి చేస్తున్నమన్నారు. కార్పొరేషన్ నిధులు, ఎమ్మెల్యే నిధులు, ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులను నిధులను సద్వినియోగం చేసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అజీజ్ ఖాన్, వేముల శ్రీనివాస్, పవన్, మాజీ కార్పొరేటర్ శేఖర్, సోమ నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్ వాకర్ అసోక్యుయేషన్ గాంధీ పాల్గొన్నారు.

## రైల్వే డిపో తరలిపోకుండా ఎంపి ప్రయత్నించాలి



ప్రజాపక్షం/మహబూబాబాద్: రైల్వే డిపో ఎక్కడికి తరలకుండా మహబూబాబాద్ లోనే ఏర్పాటు అయ్యేలా ఎంపి బలరాం నాయక్ ముందుండి ముమ్మర ప్రయత్నం చేయాలని కోరిన అఖిలపక్ష నేతలు నేడు మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌ని క్యాంపు కార్యాలయంలో రైల్వే డిపో సాధనకై అఖిలపక్షం మరియు ప్రజా సంఘాల నేతలు కలవడం జరిగింది ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు బి విజయ సారధి, సాధుల శ్రీనివాస్ ,డోలి సత్యనారాయణ, మైస శ్రీనివాస్, మండల వెంకన్న, కొండపల్లి రామచంద్రరావు, దార్ల శివరాజ్, పిల్లి సుధాకర్ ,గుగ్గిళ్ళ వీరయ్య లు ఎంపీతో మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే డిపో ఉండేలా చూడాలని మానుకోట నుండి ఎక్కడికి పోకుండా ఎంపీ ముమ్మర ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా ఢిల్లీలో మరియు హైదరాబాద్లో పెద్దలతో సంప్రదింపులు జరిపి మానుకోట లోనే ఉండే విధంగా చూడాలని అన్నారు జిల్లా కేంద్రం మరియు పార్లమెంట్ కేంద్రం అయిన మానుకోట జిల్లా కేంద్రంలో ఏ పరిశ్రమ లేదని బయ్యారం ఉక్కు పరిశ్రమ రాలేదని మరియు ఇతర పరిశ్రమలు కూడా రాలేదని రైల్వే డిపో తప్పనిసరిగా ఈ ప్రాంతంలోనే వచ్చే విధంగా కృషి చేయాలని ఎంపీ బలరాంనాయక్‌ని కోరారు. ఈ సందర్భంగా గట్టి ప్రయత్నం ఎంపీ చేయాలని అఖిల పక్ష నేతలు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం మానుకోట లోనే రైల్వే డిపో వచ్చే విధంగా అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి, రైల్వే మంత్రి ల దృష్టికి తీసుకువెళ్లి ఇక్కడే ఉండే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు . ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు బి అజయ్ సారధి రెడ్డి, గుణగంటి రాజన్న, ఆకుల రాజు, పెరుగు కుమార్ ,రేశపల్లి నవీన్ ,చింతకుంట్ల వెంకన్న, ఎండి ఇక్బాల్ , భీమా నాయక్, ఎండి ఫరీద్, హరి నాయక్, గోపాల్, ప్రేమ్ చంద్ వ్యాస్, శ్రీను పాల్గొన్నారు.

## సంక్రాంతి నాటికి వెయ్యి ఇందిరమ్మ ఇండ్లు పూర్తి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పంచాయతీ ఎన్నికలు ముగిసినందున పాలన వ్యవహారాలపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికలను నిబద్ధతతో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో మండల ప్రత్యేకాధికారులుగా కీలక పాత్ర పోషించిన జిల్లా అధికారులకు కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలను రెగ్యులర్‌గా జిల్లా అధికారులు తనిఖీ చేయాలని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

## నేడు బ్లూమింగ్ మైండ్స్ 15వ వార్షికోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి, యంగెస్ట్ పిహెచ్‌డి హోల్డర్ నైనా జైస్వాల్ లు హాజరుకానున్నారు. అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని, 11వ బెటాలియన్ ఎన్‌సిసి కల్నల్ ఎస్‌కె భద్ర, ఏవో కల్నల్ నవీన్ యాదవ్, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ వైద్యులు రాధిక రాణి కందుల, గొల్లపూడి యాలమూడి, పాతకాల ఛైర్మన్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుండి వార్షికోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## గ్రామాభివృద్ధే ధ్యేయంగా...

సమస్యల పరిష్కారానికి తక్షణమే కృషి
ప్రజాస్వామ్య విలువులు నిలబెట్టాలి
పాలన ఆదర్శంగా ఉండాలి
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/పాల్వంచ :** గ్రామాభివృద్ధే ధ్యేయంగా నూతన పాలకవర్గాలు పనిచేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 36 పంచాయతీలకు గాను పాండురంగాపురంలో రిజర్వేషన్‌ల లోపాలతో ఎన్నికలు నిర్వహించలేదు. మొత్తం 282 వార్డులకు పాండురంగాపురం 8, సంగం 2, సోములగూడెం లలో 2 వార్డులకు నామినేషన్‌లు రాలేదు. వివిధ కారణాలతో ఏడుగురు వార్డు సబ్యులు ప్రమాణ స్వీకారం చేయలేదని తెలుస్తోంది. కాగా 35 సర్పంచ్‌లు, 35 ఉప సర్పంచ్‌లు, 263 మంది వార్డు సబ్యులచే ఎంపిడిఓ కుదుముల విజయ భాస్కర్ రెడ్డి, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. కోడిపుంజులవాగు, సంగం, దంతెలబోర ఎస్‌సి కాలని, బిక్కుతండాలలో జరిగిన కార్యక్రమానికి ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నూతనంగా కొలువు దీరిన గ్రామపంచాయతీ పాలక వర్గాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు రెండు సంవత్సరాలుగా పాలకవర్గాలు లేకపోవటంతో గ్రామాలలో పలు సమస్యలు నెలకొన్నాయని అన్నారు. ఆ యా సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. గ్రామాలలో బాధ్యతాయుతమైన, నీతివంతమైన పాలన అందించి ఆదర్శంగా ఉండాలని, ప్రజాస్వామ్య విలువలు పెంచాలని ఆకాంక్షించారు.ప్రతీ ఒక్కరు తమ మార్క్ పాలనను అందించాలని సూచించారు.గ్రామ పంచాయతీలలో నిరంతరం అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండాగా ఉండాలన్నారు.పంచాయతీల అభివృద్ధికి ఎంఎల్ఏగా పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ స భ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ స భ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రా హుల్, నాయకులు గుండాల నాగరాజు, ఇట్టి వెంకటరావు,నాగేశ్వరరావు,మన్నెంవెంకన్న, వైఎ స్ గిరి, బానోత్ రంజిత్, భూక్యా వి జయ్, తెజావత్ వినోద్, మాలోత్ హరి, శ్రీను, క్రి ష్ణ, ఆవుల సతీష్, జకరయ్య, కొంగర అప్పారా వు, పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్, వార్డు సభ్యులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/బుర్గంపాడు:** ఉప్పుసాక కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఉప్పుసాక గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నిఖిల్ సంతోష్, సెక్రటరీ రమేష్ ఉప్పుసాక పంచాయతీ కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం పాల్గొన్నారు. ఈసందర్భం గా నూతన సర్పంచ్ వర్స మంగమ్మ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన బాధ్యతను గుర్తించి గ్రామాల సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు నిబద్ధతతో పని చేసి కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి దిశగా ముందుకు సాగే విధంగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం





**ప్రజాపక్షం/కూసుమంచి:** గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచ్‌లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా పని చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలని సూచించారు. సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. కూసుమంచి మండలంలోని కూసుమంచి, జీళ్లచెరువు, ధర్మతండా, గొరీలపాడు తండా, గంగబండ తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పచులు, వార్డు సభ్యులను అభినందించి, శాలువాలు కప్పి సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలతో ఎల్లప్పుడూ నిబద్ధతగా ఉంటుందని, గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన సామినేని పార్వతమ్మకు రూ.37,500/,ఆడపు నాగమణికి రూ.28,000/,మడిపల్లి సంధ్యారాణికి రూ.23,500/ విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గ్రామ సర్పంచ్ మడిపల్లి అంబిక లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అంబిక మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందిని అన్నారు.తమకు చెక్కులు మంజూరీకి కృషిచేసిన ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క కు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు రాంప్రసాద్, ఉపసర్పంచ్ బందం కృష్ణప్రసాద్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాల నందు గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గణితశాస్త్ర దినోత్సవ సందర్భంగా శ్రీనివాసరామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల మేధాస్సుకు పదునుపెట్టే అనేక గణిత సమస్యల గురించి వివరించారు. మ్యాథ్స్ ఎక్స్‌పో, ప్రత్యేక మ్యాథ్స్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లుగా ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండలంలోని 27 గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్‌లు సోమవారం ప్రమాణస్వీకారం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఐ అభ్యర్థిని గా పోటీచేసి మెజారిటీతో గెలిచిన సర్పంచ్ అభ్యర్థిని గడల కళావతి ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఆమెతోపాటు 14 వార్డుల్లో గెలుపొందిన వార్డుమెంబర్లు ఉపసర్పంచ్‌కూడా ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటంలో తుపాకి చేతబట్టి దళంలో పనిచేసిన గడల సీతారామయ్య వారసురాలిగా కోడలు తనికెళ్ల సర్పంచ్‌గా గెలుపొందడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. మాజీ సర్పంచ్‌లు గడల సీతారామయ్య, చల్లా మోహన్ రావు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సిపిఐ, సిపిఎం, బిఆర్‌ఎస్, టిడిపి, బిజెపి, జనసేన పార్టీలకు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డబ్బుతో కమ్యూనిస్టులను కొనలేరు

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

బిఆర్‌ఎస్ నుంచి నాలుగు కుటుంబాలు సిపిఐలో చేరిక



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** డబ్బుతో కమ్యూనిస్టులను కొనలేరని, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామంలో సర్పంచ్ గెలుపు విజయోత్సవసభను బండి మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా పుచ్చకాయల శ్రీదేవికమలాకర్ బాధ్యతలు స్వీకరించారు.కానీ రాజకీయ ఊసరవెల్లులు డబ్బు రాజకీయాలు చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవి కమలాకర్ ఆధ్వర్యంలో నాలుగు కుటుంబాలు బిఆర్‌ఎస్‌ను వీడి సిపిఐలో చేరాయి. వీరికి దండి సురేష్ జెండాను కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఇదిలా ఉండగా ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు ఖమ్మం రూరల్ మండల సిపిఐ శ్రేణులు, శ్రేయోభిలాషులు హాజరై సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవికమలాకర్‌కు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యుడు దండి రంగారావు, మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, మాజీ ఉప సర్పంచ్ చందనబోయిన రామారావు, సిపిఐ గ్రామ నాయకులు కుర్రి అచ్చయ్య, బండి నరేష్, మారుతి నరేష్, దాసరి పున్నయ్య, బండి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/ తల్లాడ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బస్వాపురం గ్రామాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని నూతన సర్పంచ్ పాశం హై మావతి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నూతన సర్పంచ్‌ల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్స్‌తో ప్రమాణస్వీకారంచేయించారు.నూతన పా లకవర్గాన్ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బస్వాపురం గ్రామ సర్పంచ్‌గా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.ఉప సర్పంచ్ పేటూరి నర్సింహారావు, వార్డు మెంబర్లు జంగా నారాయణమ్మ, బొగ్గుల వినోదారాణి, నాయుడు తులసమ్మ, మోదుగు నాగమణి, అన్నమ్మ, షేక్.మస్తాన్, చాగర్లమూడి లక్ష్మీ, పాశం వెంకటేశ్వరరావు, దొబ్బల సురేష్, శీలం కృష్ణారెడ్డి, కర్నాటి సైదిరెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ ధ్రువపత్రాలపై సమగ్ర విచారణ

ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం ప్రధాన ఆసుపత్రి కేంద్రంగా వెలువడిన నకిలీ ధృవపత్రాలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో అనర్హులైన అనేక మందికి నకిలీ ధృవపత్రాలను జారీ చేశారని లక్షలాది రూపాయలు అక్రమంగా వసూలు చేశారని ఆయన ఆరోపించారు. అఖిల భారత యువజన సమాఖ్య నగర సమితి సమావేశం సోమవారం సిపిఐ కార్యాలయంలో మద్దోజు శ్రవణ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఓ ముఠా అనేక మంది నుంచి భారీగా వసూళ్లు చేసిందని ఖమ్మం ప్రధాన ఆసుపత్రిలోని కొంత మంది ఉద్యోగులతో కుమ్మకై నకిలీ ధృవపత్రాలను జారీ చేశారని రామకృష్ణ తెలిపారు. ఒక ఖమ్మం జిల్లాలోనే రెండువేల మంది అనర్హులు పింఛన్ పొందుతున్నారని ఆయన తెలిపారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి అన్ని పనులు చేస్తున్న వారికి 50 నుంచి 80 శాతం వరకు అంగవైకల్యం ఉన్నట్లు ఎలా ధృవీకరించారని రామకృష్ణ ప్రశ్నించారు. ఉన్నతాధికారులు జిల్లాకు చెందిన మంత్రులు ఈ విషయంపై స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక ఏళ్లుగా పింఛన్ పొందుతున్న వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రామకృష్ణ సూచించారు.యం త్రాంగం సరైన రీతిలో స్పందించకపోతే అఖిల భా రత యువజన సమాఖ్య, అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తెలిపారు.

## విజయవంతంగా మాక్‌డ్రిల్‌పై అవగాహన

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం బొక్కలగడ్డ వద్ద జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన వరద ప్రమాదాల మాక్‌డ్రిల్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఖమ్మంలో మున్నేరు నదికి భారీ వరదలు గత రెండేళ్లుగా వస్తున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్‌డిఎంఏ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విపత్తుల నిర్వహణపై మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. విపత్తు సంభవించినప్పుడు వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఎటువంటి చర్యలు తీసుకోవాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, ఎటువంటి సామగ్రి సమకూర్చుకోవాలి వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని మాక్‌డ్రిల్ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మున్నేరుకు వరదలు వచ్చినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు చేపట్టామని, 2026 జూన్ లోపు మున్నేరు నదికి రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూము, సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అలర్ట్ చేస్తూ స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్లను అప్రమత్తం చేసి స్థానిక ప్రజలను రాంలీల ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అడిషనల్ డిసిపి ప్రసాదరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారం


అదనపు కలెక్టర్
శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు పండ్లు సరఫరా చేసే సరఫరాదారులు పాత రేట్లు తమపై బాగా భారం పడుతుందని ధరలు పెంచి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సత్తుపల్లి మండలం కొమ్మేపల్లికి చెందిన గుర్రాల తేజోరమ్మ తనకు పునరావాసం చట్టం క్రింద సర్వే నెం. 175 నందు ప్లాట్ నెం. 191 కేటాయించారని అక్కడ ఒక్క దానినే ఉండటానికి భయమేస్తుందని సమీపంలో మద్యం షాపు ఉండటం వల్ల రాత్రి బాగా ఇబ్బంది అవుతుందని తనకు మరో ప్లాట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వర చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

## భద్రాచలంలో కొలువు తీరిన పంచాయతీ పాలకమండలి


ప్రమాణ స్వీకారం చేయించిన ఐటిడిఏ పిఓ
హాజరైన ఎమ్మెల్యే, అటవి అభివృద్ధి సంస్థ చైర్మన్



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక గ్రామ పంచాయతీ పాలక మండలి సోమవారం ప్రమాణస్వీకారం చేసింది. ఈ కార్యక్రమం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా జరగగా, స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణతో తొలూత ఐటిడిఏ పిఓ రాహుల్ ప్రమాణ స్వీకారం చేయించగా, అనంతరం ఉపసర్పంచ్, వార్డు సభ్యులు చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్ష్యంలో బాధ్యతలు స్వీకరించారు.

## గ్రామాల్లో కొత్తపాలన ప్రారంభం

సర్పంచ్‌లు బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీల్లో నూతన పాలక వర్గాలు కొలువు దీరాయి. గ్రామ స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు నూతన పాలక వర్గ సభ్యులచే సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలో ఈ నెల 11న గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ తరుపున సర్పంచ్‌గా పోటీ చేసిన 26 మంది అభ్యర్థులు విజయం సాధించగా 11 మంది బిఆర్‌ఎస్ తరుపున పోటీ చేసిన అభ్యర్థులు గెలుపొందారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకార అనంతరం బాధ్యతలు స్వీకరించారు. రఘునాథపాలెం సర్పంచ్‌గా గాజుల కృష్ణారావు, రేగులచలక సర్పంచ్‌గా యండపల్లి రమాదేవి, వి.వెంకటాయపాలెం సర్పంచ్‌గా కాపా ఆదినారాయణ,వేపకుంట్ల సర్పంచ్‌గా రమాదేవి రాజా, చింతగుర్తి సర్పంచ్‌గా తమ్మిని ప్రియాంక, గణేశ్వరం సర్పంచ్‌గా భూక్యా నాగేశ్వరరావు, పంగిడి సర్పంచ్‌గా భూక్యా స్వాతి, జింకలతండా సర్పంచ్‌గా దరావత్ సుగుణ, పరికలబోడు సర్ప ంచ్‌గా తేజావత్ శిరీష, బావోజీతండా సర్పంచ్‌గా దరావత్ మంగ్లీ, హర్యాతండా సర్పంచ్‌గా బానోత్ స్వాతి, పుఠానితండా సర్పంచ్‌గా మూడు చిన్న, సూర్యతండా సర్పంచ్‌గా బానోత్ సక్రియ, రజబ్‌అలీనగర్ సర్పంచ్‌గా బానోత్ ధర్మి, దొనబండ స ర్పంచ్ తేజావత్ నవీన్, కొర్లబోడు తండా సర్పంచ్ భూక్యా చిన్నయ్య, చిమ్మపుడి సర్పంచ్‌గా కోటేరు నర్సిరెడ్డి, విఆర్ బంజర సర్పంచ్‌గా భూక్యా రమణ, పాపటపల్లి సర్పంచ్‌గా ఉయ్యూరు ద్రాక్షవతి, కోయచలక సర్పంచ్‌గా బలుసుపాటి శేష య్య, ఈర్లపుడి సర్పంచ్‌గా కేలోత్ గీత, చెరువుకొమ్ము తండా సర్పంచ్‌గా భూక్యా బాషా, పువ్వాడ నగర్ సర్పంచ్‌గా సిద్దిఖ్, బూడిదంపాడు సర్పంచ్‌గా కూరపాటి విజయకుమారి, బద్యాతండా సర్పంచ్ గా నునావత్ పెంట్యా, రాంక్యాతండా సర్పంచ్ గా తేజావత్ మూర్తి, కెవి బంజర సర్పంచ్‌గా భూక్యా సరిత, ఎన్‌వి బంజర సర్పంచ్‌గా జర్పుల సౌందర్య, లచ్చిరాంతండా సర్పంచ్‌గా మాలోత్ సుశీల, జికె బం జర సర్పంచ్‌గా మాలోత్ జ్యోతి, శివాయిగూడెం సర్పంచ్‌గా బానోత్ సునీత, మంచుకొండ సర్పంచ్‌గా తేజావత్ శంకర్, కోటపాడు సర్పంచ్‌గా నాగేశ్వరరావు, మంగ్యాతండా సర్పంచ్‌గా మాలోత్ భార్గవి,జిల్లా నాయకులు యుగంధర్, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్‌లను, పాలక వర్గాలను అభినందించారు.

## ఎఎస్‌ఐలుగా పదోన్నతులు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో హెడ్‌కానిస్టేబుల్స్ గా పనిచేస్తున్న పది మందికి ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తు సోమవారం ఆశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుకమిషనరేట్‌లో పదోన్నతి పొందిన వారికి పోలీసు కమిషనర్ సునిల్‌దత్ చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి మరింత బాధ్యతలను పెంచుతుందన్నారు. విధినిర్వహణలో అకింతబావంతో పనిచేసి ప్రజలు, అధికారుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఏడుగురు, ఖమ్మం జిల్లాకు ఒకరు, మహబూబాబాద్ జిల్లాకు ఇద్దరు బదిలీపై వెళ్లనున్నట్లు సిపి తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో డి. వెంకటసుబ్బారావు, ఎన్ అప్పారావు, జె పాపారావు, ఎంఎస్ వెంకటసుబ్బారావు, బి వెంకన్న, కె అంజంరాజు, బి వెంకటేశ్వరరావు, ఎండి హానీఫ్, టివిస్ రామానుజాచారి, డి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిశీలన




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** అడిషనల్ డిసిపి లా అండ్ఆడర్ ప్రసాద్‌రావు సోమవారం ఖమ్మం త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరు, స్టేషన్ నిర్వాహణ, సెక్టార్ అధికారుల విచార ణ నివేదికలు, సిపిటివిఎస్ అప్లోడ్, జనరల్‌డైరీని పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్‌షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్‌స్టేషన్ నిర్వాహణ, సెక్టార్ అధికారుల బాధ్యత లు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రోకార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు, పాతనేరస్తుల కదలికలు, ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

# క్రీడ

## విజయ్ హజారే ట్రోఫీలో ఆడనున్న
# గిల్, అభిషేక్, అర్షదీప్



విజయ్ హజారే ట్రోఫీ డిసెంబరు 24 నుంచి మొదలుకానుంది. ఈ టోర్నీ కోసం పంజాబ్ 18 మందితో జట్టును ప్రకటించింది. టీమ్ఇండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, అర్షదీప్ సింగ్, అభిషేక్ శర్మలకు ఇందులో అవకాశం కల్పించారు. వికెట్ కీపర్, బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో పాటు ఆల్‌రౌండర్లు నమన్ ధీర్, అన్మోల్‌ప్రీత్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, సన్వీర్ సింగ్‌ను ఎంపిక చేశారు. అయితే, కెప్టెన్ ఎవరనేది మాత్రం వెల్లడించలేదు. పంజాబ్ తమ ఏడు లీగ్ దశ మ్యాచ్‌లను జైపూర్‌లో ఆడనుంది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, గోవా, ముంబయితో తలపడనుంది. ఈ మ్యాచ్‌లు జనవరి 8న ముగుస్తాయి. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో గిల్, అభిషేక్, అర్షదీప్ ఎంపికైతే.. విజయ్ హజారే ట్రోఫీకి వారు ఎన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారో చూడాలి.

**విజయ్ హజారే ట్రోఫీకి పంజాబ్ జట్టు:**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్‌కీపర్), హర్నూర్ పన్ను, అన్మోల్‌ప్రీత్ సింగ్, ఉదయ్ సహారాన్, నమన్ ధీర్, సలీల్ అరోరా, సన్వీర్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, జషన్‌ప్రీత్ సింగ్, గుర్నూర్ బ్రార్, హర్‌ప్రీత్ బ్రార్, రఘు శర్మ, క్రిష్ భగత్, గౌరవ్ చౌదరి, సుఖదీప్ బజ్వా.

## స్నికోమీటర్ చిరాకు తెప్పిస్తోంది..
### డిఆర్ఎస్ లోపాల్ని వెంటనే సరిచేయండి!

ఈమధ్య కాలంలో డిఆర్ఎస్ వ్యవస్థపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా యాషెస్ సిరీస్ మూడో టెస్టులోనూ డిఆర్ఎస్‌లోని స్నికోమీటర్ లోపాలు స్పష్టంగా కనిపించాయి. అడిలైడ్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ రెండు సందర్భాల్లో అంపైర్ నిర్ణయాన్ని సవాల్ చేయగా ఆతిథ్య జట్టుకే అనుకూలంగా నిర్ణయం వచ్చింది. దాంతో.. ఇంగ్లాండ్ ఆటగాళ్లు అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్




స్టార్క్ ఐసిసికి కీలక విజ్ఞప్తి చేశాడు. డిఆర్ఎస్ వ్యవస్థలోని లోపాలను సరి చేయాలని అంతర్జాతీయ క్రికెట్ మండలిని కోరాడు. 'డిసిషన్ రివ్యూ సిస్టమ్ అనేది లోపభూయిష్టంగా ఉంది. ప్రేక్షకులకు, అధికారులకు, బ్రాడ్‌కాస్టర్లకు ఈ నియమం చిరాకు తెప్పిస్తోంది. డీఆర్ఎస్‌పై నా అభిప్రాయం చెప్పదలచుకున్నాను. ఈ వ్యవస్థను మ్యాచ్ అధికారులు ఉపయోగిస్తారు. అలాంటప్పుడు ఐసిసి ఎందుకు డబ్బులు చెల్లించాలి. అన్ని బోర్డులకు ఒక్కరే ఈ సిస్టమ్‌ను ఎందుకు అందించడం లేదు. ఐసిసి టోర్నీలతో పాటు అన్ని సిరీస్‌లకు ఒకేరకమైన సాంకేతికతను ఎందుకు ఉపయోగించడం లేదు. ఒకవేళ అన్నింటా ఒకే టెక్నాలజీ ఉపయోగిస్తే గందరగోళం తగ్గుతుంది. అంతేకాదు ఎవరికీ చిరాకు పడరు అని ఐసిసికి స్టార్క్ విన్నవించాడు. ఏకీకృత వ్యవస్థను తీసుకురావాలని సూచించాడు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇకనైనా ఐసిసి ఉత్తమమైన డిఆర్ఎస్ వ్యవస్థను తీసుకురావాలి' అని వాన్ సూచించాడు.

## ఆస్ట్రేలియాలో అంత ఈజీ కాదు..
### ఇంగ్లాండ్‌పై రోహిత్ కామెంట్



ప్రస్తుతం జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ పేలవ ప్రదర్శన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లాండ్ ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లిష్ జట్టు వరుసగా నాలుగోసారి సిరీస్‌ను కోల్పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్ టీమ్‌పై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. గురుగ్రామ్‌లో జరిగిన మాస్టర్స్ యూనియన్ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన 'హిట్‌మ్యాన్' విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన క్రికెట్ కెరీర్‌లో మరపురాని విజయాలను గుర్తుచేసుకున్నాడు.

2021లో గబ్బా టెస్టులో భారత్ చారిత్రాత్మక విజయాన్ని ప్రస్తావిస్తూ.. 'ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలవడం అంత ఈజీ కాదు.. కావాలంటే ఇంగ్లాండ్ ఆటగాళ్లను అడగండి చెబుతారు' అంటూ రోహిత్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. 'ఆస్ట్రేలియాలో 2021లో గబ్బాలో జరిగిన మ్యాచ్‌లో మేం (భారత్) గెలిచాం. రిషభ్ పంత్ అద్భుతంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. మేం గెలుస్తామని ఎవరూ నమ్మలేదు. అలాంటి స్థితి నుంచి టీమ్ఇండియా పుంజుకుని గెలిచింది. ఆ మ్యాచ్‌లో మా ఫస్ట్ ఛాయిస్ ఆటగాళ్లందరూ గాయాలు, వివిధ కారణాల వల్ల అందుబాటులో లేరు. ఆ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పైన్ కొన్ని కామెంట్స్ చేయడం నాకు ఇంకా గుర్తుంది.

ఆ కామెంట్స్‌లో ఒకటి మమ్మల్ని ఆలోచనలో పడేసింది. మ్యాచ్ ప్రారంభమైనప్పుడు తుది జట్టులో ముగ్గురు అరంగేట్ర ఆటగాళ్లున్నారు. గబ్బా ఆస్ట్రేలియాకు కంచుకోట. అప్పటివరకు వారికి అక్కడ ఓటమి అనేదే తెలీదు. కానీ, గెలుపుపై ఆశలు లేని స్థితి నుంచి మేం గొప్పగా పుంజుకుని ఆ మ్యాచ్ గెలిపించాం. అయితే, టెస్ట్ క్రికెట్ ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఇందులో ఆడటం అంత సులభం కాదు. ఆస్ట్రేలియాలో ఆడటం కఠినమైన సవాలు. కావాలంటే మీరు ఇంగ్లాండ్ ఆటగాళ్లను అడగండి. గబ్బాలో విజయం సాధించి ఆ తర్వాత ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవడం మాకు గ్రేట్ అచీవ్‌మెంట్' అని రోహిత్ పేర్కొన్నాడు.

## ఫోకస్



ప్రజల్లో...
ప్రత్యేకించి యువతలో పుస్తక పఠనాశక్తి తగ్గిపోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. 'అన్నీ ఫోన్‌లోనే... అంతా ఫోన్‌తోనే' అనే ధోరణి వల్ల పుస్తక పఠనం తగ్గిపోతే, ప్రజాస్వామ్యానికి మేధస్సు కొరత ముప్పు పొంచి ఉంది. ప్రపంచ స్థితిని, గతిని మార్చింది ఆయుధం కాదు... అక్షరం. రాజ్యాలు పుట్టాయి, రాజ్యాలు కూలాయి. సమాజాలు రూపాంతరం చెందాయి. ఆ మార్పుల వెనుక నిలిచింది పుస్తకమే. అన్యాయాలు, అణిచివేతలు, దోపిడీ పీడనలు, అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు మనిషిని నడిపించిన మార్గదర్శి పుస్తకం.

## పుస్తక పఠనం తగ్గిపోతే..
# ప్రజాస్వామ్యానికి మేధస్సు కొరతే

అలాంటి పుస్తకం మరోసారి నగర లోగిళ్లలో సందడి చేయబోతోంది. మనల్ని ఆత్మీయంగా పలకరించి, చేతిలోకి వచ్చి హస్తభూషణంగా మారబోతోంది. సాహితీ ప్రియులు, పాఠకులు, విద్యార్థులు, ఆలోచనల్ని ప్రేమించే వారందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న క్షణం రానే వచ్చింది. ఈనెల 19వ తేదీన ప్రారంభమైన, దేశంలోనే అతిపెద్ద పుస్తక ప్రదర్శనగా పేరుగాంచిన హైదరాబాద్ 38 వ బుక్ ఫెయిర్, హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ గార్డెన్స్‌లో ఈ నెల29 వరకు జరుగుతుంది. ఎన్నో అంశాలపై, ఎన్నో రకాల పుస్తకాలు లభించే ఈ వేదికను యువత ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే, నేటి కాలంలో పుస్తకం వినోద సాధనగా మాత్రమే మిగిలిపోతోందన్న భావన పెరుగుతోంది. కానీ నిజానికి పుస్తకం మనిషికి దిక్సూచి. అది ప్రశ్నించే ధైర్యాన్ని నేర్పుతుంది. తర్కాన్ని పెంపొందిస్తుంది. సామాజిక స్పృహను మేల్కొలుపుతుంది. ఒక వ్యక్తి చదువుతే అతని ఆలోచన మారుతుంది. ఒక తరం చదువితే సమాజం మారుతుంది. చదవని సమాజం ఆలోచించలేని సమాజంగా మారుతుంది. ఆలోచించలేని సమాజం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇది నేటి సమాజంలో కనిపిస్తున్న పెద్ద విరోధాభాసం. విద్య ఉంది. డిగ్రీలు ఉన్నాయి. ర్యాంకులు ఉన్నాయి. కానీ పఠనం తగ్గిపోయింది. నేటి విద్యా వ్యవస్థ పరీక్షలకే పరిమితమైంది. పాఠ్యపుస్తకాలు చదవడం వేరు... స్వచ్ఛందంగా పుస్తకం తీసుకుని చదవడం వేరు. ఆ తేడాను మనం మరిచిపోతున్నాం. ఫలితంగా ఆలోచించే విద్యార్థి స్థానంలో కేవలం జ్ఞాపకశక్తి మీద ఆధారపడే విద్యార్థి తయారవుతున్నాడు. మొబైల్, సోషల్ మీడియా, రీల్స్, షార్ట్స్ మనిషి దృష్టిని క్షణికంగా మార్చేశాయి. పది సెకన్ల వీడియోలకు అలవాటు పడిన మనిషికి పది పేజీల పుస్తకం భారంగా అనిపిస్తోంది. కానీ డిజిటల్ యుగమే పుస్తకానికి శత్రువు అనుకోవడం తప్పు. అదే డిజిటల్ మాధ్యమాన్ని పఠనానికి అనుకూలంగా మలచుకోవడమే అసలు సవాల్. ఈపుస్తకాలు, ఆడి యో బుక్స్, డిజిటల్ లైబ్రరీలు సరైన దిశలో వాడితే పఠనానికి కొత్త ఊపిరి పోయవచ్చు.

### ఒక ప్రదర్శన కాదు, ఒక ఉద్యమం

హైదరాబాద్ బుక్ ఫెయిర్ కేవలం పుస్తకాల అమ్మకపు వేదిక కాదు. ఇది ఒక సాంస్కృతిక ఉద్యమం. రచయిత, పాఠకుల మధ్య సంభాషణకు వేదిక. తెలుగు భాష, సాహిత్యానికి పునరుజ్జీవనం. విభిన్న భావజాలాల కలయిక. అనేక భాషల పుస్తకాలు, అనేక ఆలోచనల రచనలు ఒకేచోట లభించే ఈ బుక్ ఫెయిర్, పాఠకుడిని ఆలోచనల ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇది పది రోజుల పండుగ మాత్రమే కాదు.. ఏడాది పొడవునా పఠనానికి ప్రేరణ కావాలి.



రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 10 కోట్ల జనాభా ఉన్నా, పుస్తక పఠనం తగ్గిపోతోంది. పుస్తక పండుగలు నగరాలకు పరిమితమైపోతున్నాయి. గ్రామాలకు పుస్తకం చేరడం లేదు. ఒకప్పుడు విజ్ఞాన కేంద్రాలుగా ఉన్న గ్రంథాలయాలు నేడు తాళాలు వేసుకున్న గదులుగా మారాయి. ఇది కేవలం ప్రభుత్వ వైఫల్యం కాదు.. సమాజ వైఫల్యం కూడా. ప్రతి గ్రామానికి గ్రంథాలయం.. ఇది విలాసం కాదు, మౌలిక అవసరం. గ్రంథాలయం అనేది భవనం కాదు... అది ఆలోచనల నిలయం. ప్రజాస్వామ్యానికి అవసరమైన మౌలిక వసతి. ప్రతి గ్రామంలో ఆధునిక గ్రంథాలయాలు, కొత్త పుస్తకాల సేకరణకు ప్రత్యేక నిధులు, పిల్లలు, యువత, రైతులు, మహిళల కోసం ప్రత్యేక విభాగాలు ఉండాలి. ఇవన్నీ అమలు చేస్తేనే పుస్తకం ప్రజల జీవితాల్లోకి తిరిగి వస్తుంది. పఠన సంస్కృతి పెంపొందించేందుకు పాఠశాలల్లో పుస్తక పఠన గంట తప్పనిసరి చేయాలి. గ్రామ, మండల స్థాయిలో పఠన సంఘాలు ఏర్పాటు చేయాలి. రచయితలను గ్రామాలకు తీసుకెళ్లే కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. పుస్తకం బహుమతిగా ఇచ్చే సంస్కృతిని ప్రోత్సహించాలి. పిల్లలు పుస్తకం చదవాలంటే ముందుగా తల్లిదండ్రులు చదవాలి. ఇంట్లో టీవీ ముందు కాదు.. పుస్తకం ముందు కూర్చునే వాతావరణం రావాలి. పుట్టినరోజుకు బొమ్మలతో పాటు పుస్తకం ఇవ్వడం అలవాటు కావాలి. అప్పుడు మాత్రమే పఠనం జీవనశైలిగా మారుతుంది.

హైదరాబాద్ 38వ బుక్ ఫెయిర్ ఒక గొప్ప అవకాశం. కానీ పుస్తకం ఒక తేదీకి పరిమితం కాకూడదు. ప్రతి గ్రామానికి గ్రంథాలయం, ప్రతి ఇంటికి పుస్తకం, ప్రతి మనిషికి ఆలోచన.. ఇదే నిజమైన అభివృద్ధి. ఇదే సమాజాన్ని మార్చే జ్ఞాన పండుగ.

— కాలగిరి శ్రీనివాసరెడ్డి

# సేవలు, అభివృద్ధి శాశ్వతం



### పంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అందించే సేవలు, అభివృద్ధి శాశ్వతం అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నూతన పాలకవర్గం పనిచేయాలన్నారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు, పారిశుధ్య, తాగునీటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాని కోరారు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చూడటం లో పాలకవర్గం క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సర్పంచ్ భూక్యా శాంతిశ్రీ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళీ, నూతన వార్డు సభ్యులు, ఎంపిడిఓ సుభాషిని, తహసీల్దార్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



### సిపిఐలో చేరిన మొండికట్ట సర్పంచ్

**పాల్వంచ :** పాల్వంచ మండల పరిధి సత్యనారాయణపురం(మొండికట్ట) గ్రామ పంచాయతీ సర్పంచ్ జర్పుల సంధ్య సిపిఐలో చేరారు. వీరితో పాటుగా పలువురు యువకులు పార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గండికోట దేవేందర్, దండుగుల సురేష్, పసుల భాస్కర్, ఓర్సు సారయ్య, చిల్ల క్రిష్ణ, వెంకటముత్యం, రాపోలూ చిన రాములు, దండుగుల సమ్మయ్య, సంపంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంతో గుర్తింపు

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని నూతనంగా ఎన్నికైన సిపిఐ సర్పంచ్‌లు కురిమిద్దె వినోద శ్రీనివాస్, ముత్యాల అంజయ్యలను ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, రావుల ప్రశాంత్‌లను సిపిఐ జాతీయకార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అభినందనలు తెలిపారు. వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజల విశ్వాసంతో బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సూచించారు. సిపిఐ మద్దతుతో విజయం సాధించిన కాంగ్రెస్ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామిలను సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నాయకులు కలకొండ సంజీవ, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

**చండూరు :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సూచించారు. సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసిన నల్లగొండ జిల్లా చండూరు మండలంలో కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం, పుల్లెంల సర్పంచ్ ముక్కముల వెంకన్న, కస్తాల ఉప సర్పంచ్ గంట స్వర్ణ, దోనిపాముల ఉపసర్పంచ్ తిప్పర్తి రాములు, పుల్లెంల ఉపసర్పంచ్ సిహెచ్ ఊషయ్య, కొండాపురం ఉప సర్పంచ్ గడ్డం యాదయ్యతో పాటు వివిధ గ్రామ పంచాయతీలలో గెలుపొందిన వార్డు మెంబర్లను పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యంలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సహాయ కార్యదర్శులు, నాయకులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మాదగోని విజయలక్ష్మి , బరిగెల వెంకటేశ్, గంట రమేష్, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, ఇరిగి సంజీవ, గడ్డం నవీన్, పల్లె నర్సింహ్మా, శివర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.





## రాజకీయాలకతీతంగా అభివృద్ధి
### సిపిఐ జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/చింతకాని :** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తే ప్రజలు ఆదరిస్తారని సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం బస్వాపురం గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. గ్రామ ప్రత్యేకాధికారిణి మానస నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాసాల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో పువ్వాడ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయం నుంచి బస్వాపురం సిపిఐ కంచుకోట అన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని బస్వాపురం గత ఇరవై ఏళ్లుగా సిపిఐ గెలుస్తోందని తిరిగి మరలా ఐదవసారీ సిపిఐ గెలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, పావులూరి మల్లిఖార్జునరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నూతన సర్పంచ్ ఆవుల నర్సింహారావు, మాజీ ఎంపిపి కన్నెబోయిన విజయమ్మ, మాజీ సర్పంచ్‌లు రాసాల సాంబలక్ష్మి ,బొడ్డు సుగుణమ్మ కొండలరావు, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, వార్డుసభ్యులు, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ నిర్వీర్యానికి బిజెపి కుట్ర

### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిర్వీర్యానికి బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం విమర్శించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి జి రామ్ జి అని మార్చడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం సిపిఐ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడాలీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ శ్రేణులు పెద్దఎత్తున నిరసన తెలుపుతూ జి రామ్ జి చట్ట ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ వామపక్ష ప్రతినిధులు యుపిఎ వన్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న సమయంలో జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పేద కార్మికులకు పని కల్పించాలని సంకల్పంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెడితే నేడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం







పేరును జీ రామ్ జీగా అని పేరు మార్చి మత రాజకీయాలు చేస్తున్నదన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు యధావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మార్కపురి సూర్య,కల్లేపల్లి నవీన్, శనిగరపు చంద్రశేఖర్, ఆరేపల్లి మానస్, రేణిగుంట్ల ప్రీతం, కల్లెపెల్లి శంకర్, సాయి ఆజాద్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకానికి గాంధీని చంపిన నాతురం గాడ్సే ముద్దు పేరు రామ్ జీ అని పేరు పెట్టడం సిగ్గుచేటని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజపల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజు సతీష్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, గుడేటి ఐలయ్య, మట్టి కృష్ణ, గోలి లావణ్య, పల్లెర్ల రజిత, పెదమముల సంధ్య, వాసం రజిత, పోతుగంటి స్వప్న, నాగమణి, సుభద్ర, గోనెల తిరుపతి, జనార్ధన్, రాజేష్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి
### సిపిఐనేతలు గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మౌలిక సమస్యల పరిష్కారానికి కృషిచేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సిపిఐ తరుపున గెలిచిన సర్పంచ్‌లను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గానుగబండ, రంగాపురం గ్రామాలలో సిపిఐ సర్పంచులు కడియాల పద్మ, కట్ట కళ్యాణిలను, వార్డు మెంబర్స్‌ను సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి నిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని నూతనంగా ఎన్నికైన సర్పంచులను కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఐ పోటీ చేసిన ఎనిమిది సర్పంచ్ స్థానాల్లో ఆరింటిని గెలవడం జరిగిందని, పార్టీ మీద నమ్మకంతో గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, పోకల వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, పోటు బుజ్జిరావు, కిరణ్, అశోక్, పోకల ఆంజనేయులు, చింతలచెర్వు మల్లయ్య, సైదులు, పంగ వినోద్, ఈశ్వరచారి, షేక్ నబీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన తిరుపతి



ప్రజాపక్షం/చొప్పదండి : మండలంలోని కొలిమికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన చొక్కళ్ల తిరుపతి, ఉప సర్పంచ్ పంజాల లక్ష్మణ్ గౌడ్, పాలకవర్గ సభ్యులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నేడు భారాస నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారి సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి అర్హులకు అందించాలని అభివృద్ధి విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులుతదితరులుపాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శివప్పను పరామర్శించిన ఎంపి సురేష్‌షెట్కార్



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా సీనియర్ కాంగ్రెస్ నేత,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శివప్పను జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ పరామర్శించారు. శివప్ప తల్లి నాలుగు రోజుల క్రితం మృతిచెందారు. దీంతో ఎంపి సురేష్ షెట్కార్ వారిని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఎంపి సురేష్‌షెట్కార్‌తో పాటు బ్లాక్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి హన్మంతరెడ్డి, పిసిసి సభ్యులు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత, జీవన్‌రెడ్డి, నాయకులు బొమ్మల యాదగిరి, రాజబహదూర్ రెడ్డి, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దంలక్ష్మి,మెరుగు రాజు, వంగరి నాగరాజు. సొప్పదండి చందు, చెన్నప్ప, నాగభూషణం, సర్పంచ్ భద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## వెంకటస్వామి కాక సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/ సిద్దిపేట : పేదల మనిషి, దివంగత మాజీ ఎంపి గడ్డం వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు.సోమవారం సిద్దిపేట కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి ఆధ్వర్యంలో వెంకటస్వామి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు కాకా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి ఏడు పర్యాయాలు ఎంపిగా, రెండు సా ఎమ్మెల్యేగా, కేంద్ర,రాష్ట్ర మంత్రిగా పని చేసి ప్రజలకు ఎనలేని సేవలు అందించినట్లు తెలిపారు. వెంకటస్వామి ట్రస్టు బలహీన వర్గాలకు ప్రజలకు అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవ చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపి కృష్ణ, బిక్షపతి, దాస అంజయ్య, ఎర్రమహేందర్, మెర్గురాజు, రాజిరెడ్డి, రజినిబాబు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా జక్కుల అనిల్

ప్రజాపక్షం/చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ ఉపసర్పంచ్ జక్కుల అనిల్ కుమార్ చొప్పదండి మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైనారు. ఈ మేరకు మండల కేంద్రంలో జరిగిన ఉపసర్పంచ్‌ల సమావేశంలో మెజారిటీ సభ్యులు జక్కుల అనిల్ కుమార్ ను అధ్యక్షుడిగా ఎన్నుకోగా, ఆయన ఉపసర్పంచ్‌ల సమస్యల పట్ల నిత్యం పోరాటం చేస్తానని అందరినీ కలుపుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## ఉత్తమ ఉద్యోగులు ఎంపిక




ప్రజాపక్షం/రామగిరి : సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేయడం జరిగిందని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రామగుండం3 ఏరియా నుండి ఓ.సి1ఇ.పి.ఆపరేటర్ కె.నారాయణ, ఓ.సి2 ఇ.పి.ఆపరేటర్ పోలు శంకర్, ఎస్టేట్స్ విభాగం డిప్యూటీ ఎస్టేట్స్ మేనేజర్ కె.ఐలయ్య, ఓ.సి1 సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.అశోక్ కుమార్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా నుండి ఫిట్టర్ జి.మహేష్, జనరల్ అసిస్టెంట్ ఎ.శ్రీనివాస్, డిప్యూటి మేనేజర్ కటకం కమలాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.శ్రీధర్‌లు ఎంపిక కావడం జరిగిందని, వీరిని మంగళవారం జి.ఎం కార్యాలయ ఆవరణలో నిర్వహించే సింగరేణి ఆవిర్భావదినోత్సవవేడుకల్లో సన్మానించడంజరుగుతుందని వారు తెలిపారు.

## ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ లైసెన్స్ & రిజిస్ట్రేషన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా ఆహార భద్రత అధికారి అరవింద్

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకులు (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కోసం ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ లైసెన్స్ , రిజిస్ట్రేషన్ మేళా డిసెంబర్ 23, 2025 పోలవరం మంగళవారం నాడు నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార భద్రత అధికారి అరవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళా తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి నందు ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయ సముదాయం, గది నెం. 104లో, ఉదయం 11.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు పొందడం లేదా రెన్యువల్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 9666587569 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆరోగ్య భద్రతాధికారి అరవింద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దేవాదాయ శాఖ కమిషనర్‌కు ముక్కోటికి రావాలని ఆహ్వానం



ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీలక్ష్మి నృసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 30న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి పర్వదిన ఉత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖా కమిషనర్ కు ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు.ఈమేరకు హైదరాబాద్ లోని దేవాదాయ శాఖ కార్యాలయంలో కమిషనర్ డా.ఎస్.హరీష్ ను ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్, అర్చకులు నంబి అరుణ్ కుమార్,బొజ్జ రాజగోపాల్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ లు కలిసారు.స్వామి వారి శేషవస్త్రంతో కమిషనర్ ను సన్మానించి స్వామివారి చిత్రపటం ప్రసాదం ఇచ్చి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# భరోసా కేంద్రాల సేవలు భేష్

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్




ఘనంగా భరోసా కేంద్రం వార్షికోత్సవం

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో భరోసా కేంద్రం అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్ అన్నారు. పోలీసు శాఖ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో రేకుర్తి కొత్తపల్లి రోడ్డులో నిర్వహిస్తున్న భరోసా కేంద్రం మొదటి వార్షికోత్సవానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలు, పిల్లలు, మహిళలపై వేధింపులు వంటి కేసు లు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణకు, వేధింపులకు గురైన సమయంలో ఆదరణకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. భరోసా కేంద్రా ల్లో వైద్యం, న్యాయం, కౌన్సిలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉన్నందున బాధితుల్లో ధై ర్యాన్ని నింపుతాయని అన్నారు. కరీంనగర్ భరో సా కేంద్రంలో కేసులు తక్కువగా నమోదవడం మంచి విషయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప మేలా సత్పతి మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభమైన భరోసా కేంద్రం ఎన్నో మైలురాళ్లను దాటిందని తెలిపారు. అనేక కేసుల్లో మహిళలకు చిన్నారులకు అండగా నిలిచి బాధితుల్లో ధైర్యాన్ని నింపిందని అన్నారు. బాధితుల కు వైద్య, న్యాయ సహాయం అందించడం కౌన్సిలింగ్ ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపి జీవితంలో ముందడుగు వేసేందుకు సహకరించడం భరోసా కేంద్రం ద్వారా సాధ్యమైందని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, మహిళలు, చిన్నారులు లైంగిక వేధింపులు, హింసకు గురైన సందర్భంలో బాధితులకు ఒకే చోట వైద్యం, న్యాయం, కౌన్సిలింగ్ వంటి వివిధ సేవలను అందించేందుకు కరీంనగర్ భరోసా కేంద్రం ప్రారంభించామని తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు 47 ఫోక్సో, 13 అత్యాచారం కేసు లు నమోదు చేశామని తెలిపారు. బాధితులకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించామని అన్నారు. కౌన్సిలింగ్ నిర్వహించి వారి లో మనోధైర్యాన్ని నింపడమే కాకుండా వివిధ రంగాల్లో ఉపాధి కల్పించేందుకు శిక్షణలు ఇప్పించామని అన్నారు. మహిళలు 18 సంవత్సరాలు లోపు ఉన్న బాల బాలికలు ఎవరైనా నేరుగా గాని, పోలీస్ స్టేషన్ ద్వారా భరోసా కేంద్రం సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, పోలీస్ అధికారులు, భవిత కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐటియుసి కృషితో చెక్ పోస్ట్‌లలో నూతన ఫర్నీచర్



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని సెక్యూరిటీ చెక్‌పోస్ట్‌లలో నూతన ఫర్నీచర్‌ను, విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలని గుర్తింపు సంఘం ఎఐటియుసి కోరిన మేరకు సోమవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని నర్సరీ చెక్ పోస్ట్, సిఎస్‌పి చెక్ పోస్ట్‌లలో నూతన ఫర్నీచర్‌ను ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా సెక్యూరిటీ సిబ్బంది సౌకర్యాలపై స్పందించిన ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ ఎస్ అండ్ పి సి డిపార్ట్మెంట్ కార్యదర్శి రెడ్డి వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి ఎస్ అండ్ పి సి ఆద్వర్యంలో గత కొద్ది రోజుల క్రితం అన్ని చెక్ పోస్టులలో కంప్యూటర్ కుర్చీలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ చేసిన విజ్ఞప్తి మేరకు యాజమాన్యం సోమవారం స్థానికంగా ఉన్న కొన్ని చెక్ పోస్ట్‌లకు నూతన ఫర్నీచర్‌ను ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. మిగతా చెక్ పోస్టులలో కూడా నూతన ఫర్నీచర్‌ను సమకూర్స్తామని ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్స్ చంద శ్రీనివాస్, మహమ్మద్ అక్బర్ అలీ, జమేదార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

### దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



ప్రజాపక్షం/దుబ్బాక: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అని, అటువంటి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేసే అవకాశం రావడం నూతన సర్పంచులకు లభించిన అదృష్టమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక మండలంలోని అచ్చుమాయపల్లి, గంభీర్‌పూర్ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు దేవరాజు, బానాల సునంద్‌శ్రీనివాస్‌లతో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గాల ప్రమాణ స్వీకరా కార్యక్రమానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. మిరుదొడ్డి, తొగుట, దుబ్బాక, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో సోమవారం సర్పంచుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గత రెండేళ్లుగా గ్రామ పంచాయతీకి పూర్తిగా కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, మల్లన్నసాగర్ నుండి సాగు నీరు విడుదల చేయడానికి కాల్వలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీఠ వేయాలని సూచించారు. కార్యక్రమంలో భీమసేన, ముక్కపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

### సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి




ప్రజాపక్షం/కరీంనగర్ :డిసెంబర్ 26 కి సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతుందని 100 సంవత్సరాల దినోత్సవం రోజు కరీంనగర్ నగరంలో పార్టీ జెండాలను ఆవిష్కరించి వందేళ్ల సిపిఐ త్యాగాలు విజయాలను, ప్రజలకు తెలియజేయాలని, కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకుసిపిఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రోజున సిపిఐ కరీంనగర్ నగర కౌన్సిల్ సమావేశం పైడిపల్లి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర, భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం సందర్భంగా జరిగిన పోరాటాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఘనమైన చరిత్ర ఉన్నదని కమ్యూనిస్టు పార్టీ లేకపోతే తమకు ఎవరు పోటీ ఉండరు అనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం పోరాట ఉద్యమ చరిత్ర వక్రీకరిస్తుందని ఆయన ఆరోపించారు. సిపిఐ పార్టీ పుట్టి 100 సంవత్సరాల అయిందని ఇది దేశంలో పోరాటం చేసిన చరిత్ర ఏ పార్టీకి లేదని అన్నారు. బిజెపి పాలకులు కాంగ్రెస్‌కి చెందిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను గొప్పగా చెప్పుకుంటుందని వల్లభాయ్ వల్లనే హైదరాబాద్ విలీనం అయ్యిందని చరిత్ర వక్రీకరిస్తుందని విమర్శించారు. మద్దు మోయినుద్దీన్ బద్దం ఎల్లారెడ్డి రావినారాయణరెడ్డి సాయుధ పోరాటానికి పిలిపిచ్చారని అప్పటికీ పదిలక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు ప్రజలకు పంపిణీ చేశారని దీంతో హైదరాబాద్ కమ్యూనిస్టుల వసం అవుతుందనే భయంతోనే హైదరాబాదులో విలీనానికి ఒప్పందం జరిగిందని వారు గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరిట దేశంలో మారణ హోం సాగిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కులు, జీవనోపాదులు,గౌరవ జీవితానికి ఉన్న హామీని అణిచివేస్తుండడంపై రాజీ లేని పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. భారత స్వాతంత్ర పోరాటం నుంచి ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, విద్యా,ఉద్యోగ, ఉపాధి, గృహ సమస్యలపై వీరోచిత పోరాటం చేసింది సిపిఐ అని దాని ఫలితంగానే అనేక చట్టాలను హక్కులను సాధించుకున్నామని అందుకే కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ 100 సంవత్సరాలుగా ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. దామాషా పద్ధతిన ఎన్నికలు నిర్వహించాలని అలా చేస్తే కమ్యూనిస్టులకు రావాల్సిన ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ బ్యాంకుల జాతీయకరణ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం, చెంచల మురళి, కసి బోసుల సంతోష చారి, మాడిశెట్టి అరవింద్, సత్యనారాయణ చారి, రాజు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో గణిత దినోత్సవ వేడుకలు




ప్రజాపక్షం/కరీంనగర్: కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్లో గణిత దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గణిత అవధాని, ప్రముఖ గణిత ఉపాధ్యాయుడు ఈ.చంద్రయ్య, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి,నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ చిన్ననాటి నుండి గణిత శాస్త్రం పట్ల మక్కువ పెంచుకొని నూతన ఒరవడికి నాంది పలికారని, వారు చేసిన సేవలు చారిత్రాత్మకమని నేటికి నిష్ణాతులైన గణిత శాస్త్రవేత్తలు వారు రూపొందించిన సూత్రాలకు పరిష్కారం తెలుపలేకపోతున్నారని చెప్పారు. తమిళనాడులో జన్మించిన రామానుజన్ జీవిత చరిత్ర చాలా స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరు రామానుజన్ వలె అంకిత భావాన్ని, ఏకాగ్రతను పెంపొందించుకొని నూతన ఆవిష్కరణలకు బీజం వేయాలన్నారు. చిన్నతనంలోనే గణిత శాస్త్రంలోని విషయాలను సమగ్రంగా పరిశీలించి పరిశోధనాత్మకంగా గణిత శాస్త్రంలో నూతన విషయాలను కనుగొని నిష్ణాతులైన గణిత శాస్త్రవేత్తలకి ఆశ్చర్యం అనిపించాలరని కొనియాడారు. విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు గణిత శాస్త్రం పట్ల ప్రత్యేక ఉండాలని గణిత శాస్త్రం ద్వారా వివిధ స్థాయిలలో నిర్వహింపబడిన వివిధ పరీక్షలలో ఘనవిజయం సాధిస్తారని చెప్పారు. చక్కటి సాధన తో పాటు ఏకాగ్రత వహించిన వారికి గణితంలో అద్భుతాలు సృష్టించడమే కాకుండా అద్భుతమైన అవకాశాలను సైతం సొంతం చేసుకోవచ్చని వారు చెప్పారు రామానుజన్ బోధించినటువంటి విషయాలు చాలా అమూల్యమైనవని అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ప్రతిసాత్మక విద్యాసంస్థల్లో సీటు సాధించడమే లక్ష్యంగా గణితం బోధించడం జరుగుతుందని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షలో గెలుపొందిన వారికి నేడు సన్మానం చేయడం జరుగుతుందని, గణిత శాస్త్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి గణిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ఆమాట్ పరీక్షలో గెలుపొందిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఈ విజయ పరంపరను కొనసాగించాలని తల్లిదండ్రులకు కీర్తి తీసుకురావాలని అతిథులు ఆకాంక్షించారు.వేడుకలలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో రామానుజన్ జ్ఞాపకార్థమై నిర్వహించినటువంటి గణిత గమ్మత్తు ( మ్యాథ్స్ ఎక్సిబిషన్) అత్యంత ఆకట్టుకున్నది మ్యాథ్స్ ఎక్సిబిషన్ లో భాగంగా మ్యాథ్స్ క్విజ్, టాంగ్రామ్, మ్యాథ్స్ ఏఐ, డిజిటల్ మెజర్మెంట్, ఫన్ విత్ ఫ్యాక్టర్స్, గోల్డెన్ రేషియో, త్రికోణమి పార్క్, పాస్కల్ ట్రయాంగిల్, రామానుజన్ సంఖ్య తదితర నమూనాలు ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వివిధ పాఠశాలల యజమాన్యాలు, గణిత ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విపత్తు సమయాల్లో సమన్వయంతో సహాయక చర్యలు : కలెక్టర్ హైమావతి




ప్రజాపక్షం/ సిద్దిపేట : వరదలు, పరిశ్రమలు ప్రమాదాలు వంటి విపత్తులు సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. సోమవారం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు వివిధ జిల్లాలో మాక్‌డ్రీల్ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఈ మాక్ డ్రీల్‌ను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరదలు రావటం, వాగులు ఉప్పొంగటం. ప్రజల, పశువులు నీటిలో చిక్కుకోవటం వంటి విపత్తు పరిస్థితుల్లో ప్రజలకు, పశువులకు, కాపాడేందుకు ముందస్తు అవగాహన కార్యక్రమం మాక్ డ్రీల్ ఏంతగానో ఉపయోగపడుతుందన్నారు. వరదల సమయంలో జిల్లా యంత్రాంగం తక్షణమే ఏలా స్పందించాలి, వివిధ శాఖల సమన్వయంతో సహాయక చర్యలు ఏలా అమలు చేయాలని అనే అంశాలపై ప్రత్యక్షంగా ప్రదర్శించనున్నారు. ఈ మధ్య జిల్లాలో సంబంవించిన అధిక వర్షాల సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం స్పందించిన తీరును గుర్తు చేశారు. . ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, పోలీస్, ఇరిగేషన్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, వైద్యా ఆరోగ్య, పశుసంవర్ధక శాఖ, కార్మిక శాఖ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల నుంచి 23 ఫిర్యాదుల స్వీకరణ

### జిల్లా ఎస్‌పి మహేష్ బి.గితే



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లా ఎస్‌పి మహేష్ బిగీ.తే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమంలో అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి సమస్యలను పరిష్కరించాలన్నారు. వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారాఫిర్యాదుదారునికి పోలీస్‌శాఖపైభరోసా, నమ్మకం కలుగుతుందన్నారు.

## యావర్ రోడ్డు విస్తరణ జరిగితేనే రాజకీయాల్లో కొనసాగుతా

### జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినీ వారి కార్యాలయంలో సోమవారం నాడు కలిసి జగిత్యాల నియోజకవర్గ ప్రజల పక్షాన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినీ వారి కార్యాలయంలో కలిసిజగిత్యాల ప్రజల చిరకాల కోరిక యావర్ రోడ్డు విస్తరణ గురించి చర్చించడం జరిగిందని 2001 ముందు 80 ఫీట్ ల రహదారి గా యావర్ రోడ్డు ఉందని, యావర్ రోడ్డు మొదటి నుండి వ్యాపార సముదాయాలు కలిగి అతి తక్కువ నివాస ప్రాంతం కలిగి ఉన్నదని చాలా ప్రాంతం రెసిడెన్షియల్ పబ్లిక్ సెమీ పబ్లిక్ జోన్ గా ఉన్నది అలాంటి దాన్ని 2021 లో 100 ఫీట్ల రోడ్డుతో కమర్షియల్ జోన్ గా మార్చడం జరిగిందని రెసిడెన్షియల్ జోన్ గా మార్చడం వల్ల నేటి నిర్మాణాలు 100 ఫీట్ల వెడల్పుతో జరుగుతున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే సీఎం తెలియజేశారన్నారు. గతంలో 30,50,80 ఫీట్ల పై అనుమతి పొంది నిర్మించిన వాటిని తొలగించాలంటే వారికి నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుంది అని దీని కోసం రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారిని కోరగా వెంటనే స్పందించి ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీదేవి గారికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. జగిత్యాల పట్టణానికి రాష్ట్రంలోనే అత్యధిక నిధులు 62.50 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు, యావర్ రోడ్డు విస్తరణకు హామీ ఇచ్చినందుకుగాను ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలపడం జరిగిందని వారు తెలిపారు. జగిత్యాలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం మంజూరు అయింది అని 10 ఎకరాల్లో మినీ స్టేడియం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థలం సమస్యగా మారిందని, ప్రజల సౌకర్యార్థం చల్ గల్ వద్ద వాలంతరీ స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరగా స్పందించిన ముఖ్యమంత్రి సెక్రటరీ ఇరిగేషన్, కమాండ్ ఏరియా డెవలప్మెంట్ రాహుల్ బొజ్జ గారితో మాట్లాడి స్థలం కేటాయించడానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇట్టి స్థలం విషయంలో గతంలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి కోరడం జరిగింది అన్నారు. ముఖ్యమంత్రి 204 కోట్లు మంజూరు కాగా 135 కోట్లతో హాస్పిటల్ బిల్డింగ్ కు టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని భూమిపూజ కార్యక్రమానికి రావాలని కోరడం జరిగింది అని జనవరిలో భూమిపూజ కార్యక్రమం ఉంటుందని, జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీ కూడా తెలియజేయడం జరిగింది అని జగిత్యాల ఎమ్మెల్యే అన్నారు. యావర్ రోడ్డు విస్తరణ జరిగితేనే మళ్ళీ రాజకీయాల్లో కొనసాగుతా అని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం

**ప్రజాపక్షం/గజ్వేల్:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ లదే కీలక పాత్ర ఉంటుందని, అలాగే దేశ అభివృద్ధికి గ్రామాలు పట్టుకొమ్మలని జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షుడు, జాతీయ యూత్ అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింలు పేర్కొన్నారు. సోమవారం పిడిచేడ్ సర్పంచ్, న్యాయవాది అశోక్ రెడ్డిని సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాయవాదిగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, గజ్వేల్ కోర్టు ఎజిపిగా అనుభవం ఉన్న నేత అశోక్ రెడ్డిని సర్పంచ్‌గా ఎన్నుకోవడం మంచి విషయమని అన్నారు. ఈ నిర్ణయం గ్రామ సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి పారదర్శక పరిపాలనతో పేదలకు సేవ చేయాలని సూచించారు. మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్యా, ఆరోగ్య రంగాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మ రింత చేరువ చేయడంలో సర్పంచ్లు కీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. బాలల హక్కులను కాపాడేందుకు సర్పంచ్ లు గ్రామ బాలల రక్షణ కమిటీ చైర్మన్ గా బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాలు, బాల కార్మికులు లేని సమాజం, అందరికీ విద్యా వంటి రంగాలలో ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలోతాటోజీనరసింహ్మాచారి,పవన్‌రెడ్డి,సత్యంపాల్గొన్నారు.

## గడ్డం వెంకటస్వామి సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** దళిత నేత గడ్డం వెంకటస్వామి (కాకా) సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడుఅశోక్ మహుల్కర్, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సందీప్ పేర్కొన్నారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో గడ్డం వెంకటస్వామి 11వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. భారతదేశ రాజకీయాల్లో అనేక కార్మిక సంస్కరణలు తీసుకువచ్చి కార్మిక పక్షపాతిగా పేరు సంపాదించిన మొట్టమొదటి దళిత నేత గడ్డం వెంకటస్వామి అని వారు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం కార్యదర్శి రామ్ టెంకీ ప్రతాప్, శ్రామినర్ విద్యాసాగర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి యాజమాన్యం వైఖరిపై కార్మిక సంఘాల మండిపాటు



**ప్రజాపక్షం/కాసిపేట:** కాసిపేట 1 వ గనిపై ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఫిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించగా బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు పండుగలా జరుపుకుంటారని, అయితే ఈ ఏడాది యాజమాన్యం సరైన నిధులు కేటాయించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి ఆవిర్భావ దినోత్సవాన్ని గౌరవప్రదంగా నిర్వహించాలని, లేనిపక్షంలో మంగళవారం జరిగే వేడుకలకు దూరంగా ఉండి నల్ల బ్యాడ్జీలతో గనులపై నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు రాజేందర్, పార్వతి సురేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు రంజిత్, అశోక్, బియ్యాల రాజన్న, పార్వతి శ్రీధర్, చౌద లింగన్న, వెంకటేష్, అనిల్, శంకర్, బల్లెం శ్రీనివాస్, అంజి, ధరం కుమార్, తిరుపతి, నాయిని శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు న్యూడెమోక్రసీ మద్దతు




**ప్రజాపక్షం/బైంసా:** 2011 నుండి చేటి వరకు పెండింగ్లో ఉన్న పిఎఫ్ డబ్బులను వెంటనే జమ చేయాలని,జిఓ ప్రకారం వేతనాలను అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు.సోమవారం బైంసా పట్టణ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 4 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలియజేసి ఆయన మాట్లాడుతూ కార్మికులు కోరుతున్న డిమాండ్స్ చాలా న్యాయబద్ధమైనవని,2011 నుంచి ఓపికతో ఉంటూ అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు దిగారని తెలిపారు .బైంసా పట్టణ పరిశుద్ధతలో నిజాయితీగా పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం చేయకపోవడం దారుణం అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో పనిచేసే కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు అమలవుతుంటే,బైంసాలో ఎందుకు అమలు కాదని ప్రశ్నించారు.చిత్తశుద్ధితో కార్మికుల సమస్యను పరిష్కారం చేయకపోగా పని నుండి తొలిగిస్తామని అధికారులు హెచ్చరించడం తగదన్నారు.ఇప్పటికైనా పిఎఫ్ డబ్బులు జమ చేసి,వేతానాలు జీవో ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## జాతీయ విపత్తులపై అవగాహన

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ మండలం హంగర్గ గ్రామంలో జాతీయ విపత్తులపై తీసుకోవాల్సిన గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో తో కలిసి పర్యవేక్షించారు. రాష్ట్ర హోం శాఖ నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ 16కి అథారిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వరద విపత్తులు కర్మాగారాల ప్రమాదాల సమయాలలో అగ్నిమాపక సిబ్బంది సహకారం తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ ఏర్పాటు చేశారు. ప్రమాదానికి గురైన వ్యక్తులకు సత్వర వైద్య సహాయం కోసం ఏర్పాటు చేయడం, విపత్తులలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకు రావడం వంటి అంశాలపై ప్రయోగాత్మకంగా చూపించారు. విపత్తుల సమయంలో ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర సహాయ సహకారాలు పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో బోధన్ ఎసిపి శ్రీనివాస్, ట్రాన్స్ కో డీఈ ముక్తార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


## ప్రజావాణికి 68 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనిఅదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారంనిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమ స్య లను అదనపు కలెక్టర్‌తో పాటు నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, హౌసింగ్ పిడి పవన్‌కుమార్, జెడ్‌పి డిప్యూటీసిఇఒసాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆధునిక సౌకర్యాలతో పటాన్‌చెరులో
# కొత్త డిఎస్‌పి కార్యాలయం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/పటాన్‌చెరు:** పటాన్‌చెరు పట్టణంలో ఆధునిక వసతులతో కూడిన కొత్త డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నిర్మాణ పనులకు సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు రూ. 12 కోట్ల సిఎస్‌ఆర్ నిధులతో 44, 010 చదరపు అడుగులతో విస్తీర్ణంలో ఎక్సైజ్ ఆఫీస్ సమీపంలో నిర్మించబడనుంది. దీన్ని సెల్లార్ జి ప్లస్ రెండు అంతస్తులతో పూర్తి ఆధునిక సౌకర్యాలతో రూపొందించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిల్‌రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సబ్ డివిజన్ పోలీస్ కార్యలయాన్ని అత్యాధునికంగా నిర్మిస్తున్నామని చెప్పారు. పాత భవనం జాతీయ రహదారి విస్తరణలో తొలగించబడినందున ఈ కొత్త కార్యాలయాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. అతను మరికొన్ని పోలీస్ స్టేషన్ భవనాలను కూడా ఆధునికరించేందకు నిర్మిస్తున్నామని చెప్పారు. పాత భవనం జాతీయ రహదారి విస్తరణలో తొలగించబడినందున ఈ కొత్తకార్యాలయాన్ని త్వరిగతని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన వెల్లడించారు. అతను మరి కొన్ని పోలీస్ స్టేషన్ భవనాలను కూడా ఆధునీకరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు ,సత్వర న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ,మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్ మాజీ ఎంపిపిలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్ ,దేవానందం , మాజీ జెడ్‌పిటిసి సుధాకర్ రెడ్డి మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్ ,సఫాన్ దేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్ ,సీనియర్,నాయకులు ,వెంకట్ రెడ్డి, పాండు, నరసింహరెడ్డి, శ్యామ్‌రావు ,అంతిరెడ్డి ,నర్లాభిక్షపతి ,బండి, శంకర్, రామచందర్, వృథ్వీరాజ్, వెంకటేష్, శంకర్ శీనయ్య, ఎట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేయాలి.. గ్రామాన్ని అభివృద్ధి పరచాలి



**ప్రజాపక్షం/ ఖానాపూర్:** ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామ సర్పంచ్ గా చి న్న వయస్సులోనే పొలంపెల్లి సచిన్‌కి అవకాశం రావడం చాలా సం తోషం అ ని నిర్మల్ డిసిసి అధ్యక్షుడు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అ న్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయస్సులోనే సర్పంచ్ గా గెలిపించిన తర్లపాడ్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంకు కృషి చేయాలని సర్పంచ్ సచిన్‌కు సూచించారు.పాలక వర్గ సభ్యులు అంత ఎలాంటి సమస్యలు ఉన్న నా దగ్గరికి తీసుకుని రండి.మీ గ్రామం కోసం అన్ని సౌకర్యాలు కల్పించడం నా బాధ్యత అని హామీ ఇచ్చారు.అదేవిధంగా సచిన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను గ్రామ సర్పంచ్ ఎన్నుకున్నందుకు గ్రామపంచాయతీ అభివృద్ధి పరచడంలో ముందు ఉంటానని,గ్రామంలో ఎవరు సమస్యలు తెలిపిన తొందరగా పరిష్కరిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు డిప్యూటీ తహసిల్దార్ మంజుల,పంచాయతి సెక్రటరీ రిజ్వాన,ఉప సర్పంచ్ నరసయ్య వార్డ్ మెంబర్లు ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు,సమావేశంలో పాల్గొన్నారు.

## వేగవంతంగా ఎన్‌హెచ్ - 65 అభివృద్ధి పనులు



### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జిల్లా పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి 65 విస్తరణ అభివృద్ధిపనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా ,రెవెన్యూ ,పోలీసు, ట్రాఫిక్, విద్యుత్ తదితర అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ 65 అభివృద్ధిపనులు జిల్లాకు అత్యంత కీలకమని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పనులు అమలులో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని శాఖల మధ్య సమన్వయంతో పనిచేసే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అధికారులు చేపట్టిన పనులు ప్రస్తుత స్థితిగతులు ,పెండింగ్‌లో ఉన్న పనులు భూ సేకరణ ,యుటిలిటిల మార్పిడి వంటి అంశాలను కలెక్టర్‌కు వివరించగా ఆయా అంశాలపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, నేషనల్ హైవే ఆథారిటీ ఎస్‌ఇ ధర్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్ శాస్త్రీ సంగారెడ్డి ఆర్‌డిఓ రాజేందర్, దేవాలయ ,విద్యుత్ ట్రాన్స్ పోర్ట్ తదితర శాఖల అధికారులు సంబంధిత మున్సిపల్ కమీషనర్లు తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాణ స్వీకారంలో ఆలస్యం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలో అన్ని గ్రామపంచాయతీలకు ఒక రూల్ ఉంటే గూడురు గ్రామపంచాయతీలో మరో రూల్స్ ఉన్నట్టు కనిపించింది. సోమవారం జరిగిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యుల పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ఉదయం పది గంటలకు అన్ని గ్రామపంచాయతీలలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాలకవర్గం పదవీప్రమాణస్వీకారం చేయాలని ఉండగా అందుకు విరుద్ధంగా గూడురు గ్రామపంచాయతీలో ప్రమాణస్వీకారాన్ని మండల అధికారులు చేపట్టడం జరిగిందని గ్రామస్థులు మండిపడ్డారు. గూడురుకు స్పెషల్ ఆఫీసర్‌గా పశువైద్యాధికారి సంధ్యారాణిని నియమించగా ఆమె మధ్యాహ్నం పన్నెండు గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకోవడం జరిగింది. ఇంతెందుకు ఆలస్యమని స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణిని విలేకరుల బృందం వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి మధ్యాహ్నం పన్నెండుగంటలకు రమ్మని చెప్పిందని, అందుకు తాను ఆలస్యంగా వచ్చానని బదులిచ్చారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతోనే పదవీ ప్రమాణస్వీకారం ఆలస్యమైందని గ్రామస్థులు మండిపడ్డారు. జిల్లా అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## నమ్మకాన్ని కోల్పోవద్దు

### బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



**ప్రజాపక్షం/మోర్తాడ్:** మోర్తాడ్ గ్రామ ప్రజలు మీపై నమ్మకంతో గెలిపించారని, ప్రజల సమస్యలను నమ్మకంతో పరిష్కరించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో పంచాయతీ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం తమ తమ పదవి బాధ్యతల ప్రమాణ స్వీకారాలు గావించారు. మోర్తాడ్ గ్రామానికి నూతన సర్పంచ్‌గా ఎన్నికైన భోగ ఆనంద్‌ను సర్పంచ్‌గా స్థానిక ఎంపిడిఓతిరుమల ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజలకు ఏ ఆపద వచ్చిన మీకు నేనున్నానని తోడుగా ఉంటూ వారి సమస్యలను పాలకవర్గ సభ్యులు పరిష్కరించి భరోసా నివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ ఎంపిడిఓ తిరుమల, పంచాయతీ కార్యదర్శి సైపోద్దీన్, అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గాండ్లపేట్ గ్రామ సర్పంచిగా ధని సుభాష్, దొన్‌పాల్ గ్రామ సర్పంచిగా ముత్యాల బాజమ్మ రాములు, దొన్కల్ గ్రామ సర్పంచిగా గడ్డం అనిల్, శెట్పల్లి గ్రామ సర్పంచి గా పెగడ విజయ్, ధర్మోరా గ్రామ సర్పంచిగా క ర్నాల మానసలక్ష్మి, వడ్యాట్ గ్రామ సర్పంచిగా ద్రం శ్రీనివాస్, తిమ్మాపూర్ గ్రామ సర్పంచిగా పుప్పాల నరేష్, పాలెం గ్రామ సర్పంచిగా పల్గిరి శా రదా రవి, సుంకెట్ గ్రామ సర్పంచిగా మాక్లూర్ వనజ నర్సాగౌడ్, లతో పాటు ఆయా గ్రామాల ఉ ప సర్పంచులు, వార్డు సభ్యులు తమ పదవుల కు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఇన్‌చార్జి అధికారులు, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెదక్‌లో విపత్తులపై మాక్ డ్రిల్



**ప్రజాపక్షం/మెదక్ :** జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) జారీ చేసిన ఆదేశాల మేరక మెదక్ జిల్లాలో రెండు లొకేషన్ లలో 02 ప్రాంతాల్లో ఒకే సారి వర్షాలు,వరదలు లాంటి విపత్తులు సంభవించిన జిల్లా యంత్రాంగం ఎలా స్పందించాలి, సహాయక చర్యలు ఎలా సమన్వయంతో నిర్వహించాలి అనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ మాక్ డ్రిల్‌ను సోమవారం మెదక్ జిల్లాలోని రెండు లొకేషన్ లలో మొత్తం రెండు కీలక ప్రాంతాలలో ఏకకాలంలో నిర్వహించారు. నిరంతర భారీ వర్షాల కారణంగా వరదలు, చెరువులు నిండిపోవడం, రహదారులు దెబ్బతినడం, ప్రజలు మరియు పశువులు నీటిలో చిక్కుకుపోవడం, ఆసుపత్రులు, కాలనీలు నీటమునగడం వంటి విపత్తు పరిస్థితులను ఊహించి ఈ అభ్యాసం చేపట్టారు. ముఖ్యంగా మెదక్ టౌన్, హవేలి ఘనపూర్ మండలం ధూప్ సింగ్ తండా, బూరుగుపల్లి తదితర ప్రాంతాలలో వరద పరిస్థితులను సృష్టించి, వాటికి సంబంధించిన సహాయక చర్యలను ప్రత్యక్షంగా అమలు చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, డ్రిల్ సాధారణ పరిశీలకులు, కరీంనగర్ డిఎఫ్‌ఓ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్‌పిమహేందర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వేణుతో కలిసి సహాయక చర్యల మాక్ డ్రిల్ పర్యవేక్షించారు వర్షాల వలన వరదలు సంభవించి చెరువు నిండి నీటి ప్రవాహం లో చిక్కుకున్న పశువులను,నీటిలో మునిగి కొట్టుకు పోతున్న వ్యక్తిని,నీటి లో చిక్కుకు పోయిన వ్యక్తులను రక్షించేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు,పోలీస్,అగ్నిమాపక శాఖ,అటవీ శాఖ,రెవెన్యూ శాఖ,పశు సంవర్ధక శాఖ, ఆపద మిత్ర వాలంటీర్ లు, ఎన్‌సిసి క్యాడేట్ లు, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయం తో రక్షణ సహాయక చర్యలు మాక్ డ్రిల్ చేపట్టారు. కలెక్టర్, ఎస్‌పిలు మాక్ డ్రిల్‌ను స్వయంగా పర్యవేక్షిస్తూ దగ్గరుండి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ముందస్తు సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని తెలిపారు. ఇలాంటి మాక్ డ్రిల్ నిర్వహణ ద్వారా అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన అవగాహన పెరిగి, విపత్తు పరిస్థితుల్లో ప్రాణ నష్టం, ఆస్తినష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలోజెడ్‌పిసిఇఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఒపిడి శ్రీనివాసరావు, జిల్లా సివిల్ సప్లయిఅధికారి నిత్యానంద్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ శివ దయాల్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ అహ్మద్, హవేలీఘన్పూర్ తాసిల్దార్ సింధు రేణుక, ఇతర శాఖల జిల్లా అధికారులు గ్రామస్తులు ఉన్నారు.

## సర్వంచ్‌గా గ్రామానికి సేవ...



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సర్పంచ్‌గా గ్రామానికి సేవ చేయాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గడ్కోల్ గ్రామపంచాయతీలో నూతన సర్పంచ్, ఉపసర్పంచ్ సహా పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరగగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై కార్యవర్గాన్ని సన్మానించి మాట్లాడారు. సిఎం నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. కాంగ్రెస్ పాల నలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, నరేష్, ఎర్రన్న, రవి, సాయిరెడ్డి, శేఖర్‌గౌడ్, సంతోష్, సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఎరువుల గోడౌన్‌లో కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ మండలం మావంది ఖుర్దు గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల గోడౌన్ ను జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిలువు ఉన్న ఎరువులను పరిశీలించారు. స్టాక్ బోర్డుపై ప్రదర్శించిన వివరాలకు అనుగుణంగా నిల్వలు ఉన్నాయా..? అని గమనించారు. యాసంగి సీజన్‌లో ఎంత మొత్తంలో యూరియా ఎరువు అవసరం పడుతుందని ఆరా తీశారు. స్టాక్ కొంత మిగిలి ఉండగానే, ఇండెంట్ పెట్టి కొత్త స్టాక్ తెప్పించుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ తరహాలోనే యాసంగి సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా ఎరువుల పంపిణీ జరగాలని సూచించారు.

# పంచాయతీల్లో కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

### ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచులు, ఉప సర్పంచులు
### ప్రత్యేక అధికారుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన సర్పంచులు

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో దాదాపు 22 నెలల తరువాత ప్రత్యేక అధికారుల పాలన నుంచి పల్లెలకు విముక్తి లభించింది. జిల్లాలో మూడు విడుతలుగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ప్రజా క్షేత్రంలో విజయం సాధించిన అభ్యర్థులు కొత్త పాలనకు శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతిల్లో నూతన పాలకవర్గాలు సోమవారం కొలువుదీరాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలక మండల్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఈనెల 22వ తేదీ సోమవారం ముహూర్తం నిర్ణయిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో సర్పంచులు, వార్డు సభ్యుల చేత ప్రమాణం చేయించడా నికి పంచాయతీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.మెదక్ జిల్లాలో 492 గ్రామ పంచాయతీలు, 4220 వార్డు స్థానాలు ఉన్నాయి. మొదటి విడతలో అల్లాదుర్గం, రేగోడ్, టేగోడ్, హవేలీ ఘనపూర్, పాపన్న పేట, శంకరంపేట ఏ మండలాలకు కలిపి 160 గ్రామ పంచాయతీ స్థానాలు, 3402 వార్డు స్థానాలు ఉండగా అందులో కొన్ని గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన వాటికి ఎన్నికలు నిర్వహించారు. రెండవ విడతలో తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాం పేట్, శంకరంపేట ఆర్, మెదక్ మండలాలకు కలిపి 149 సర్పంచ్ స్థానాలు, 1290 చార్లు స్థానాలు ఉండగా ఏకగ్రీవమైనవి కాకుండా మిగిలిన వాటికి ఎన్నికలు నిర్వ హించారు. చివరి విడతలో నర్సాపూర్, చిలిపీచడ్, కౌడిపల్లి, కొల్చారం, శివంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు కలిపి 183 సర్పంచ్ స్థానాలు, 1528 వార్డు స్థానాలు ఉండగా ఏకగ్రీవమైన గ్రామపంచాయతీలు మినహా మిగిలిన పంచాయతీలకు ఎన్నికలను జిల్లా యంత్రాంగం విజయవంతంగా నిర్వహించింది. అన్ని గ్రామ పంచాయితీలకు సంబంధించి సోమవారం ఆయా పంచాయతీలలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీల్లో కొత్తగా కొలువుదీరిన పాలక వర్గాలు మొదటి సాదారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు.




# రీల్



## 'ఆర్‌కె దీక్ష' పోస్టర్ లాంచ్

ఆర్‌కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మాణ దర్శకత్వంలో బిఎస్ రెడ్డి సమర్పణలో ఢీ జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్‌గా, కిరణ్ హీరోగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ఆర్‌కె దీక్ష. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి రాజ్ కిరణ్ సంగీతం అందించగా మేఘన శ్రీను ఎడిటర్‌గా పనిచేశారు. విడుదల దగ్గర పడుతున్న సందర్భంగా తెలుగు చిత్ర నిర్మాత మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ చేతుల మీదుగా నూతన పోస్టర్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర నిర్మాత మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... 'ఎన్టీఆర్ చిత్ర పేరును తీసుకుని ఆయన ఆశయాలతో ఆర్‌కె దీక్ష సినిమాను తీయడం జరిగింది. నటి అక్సా ఖాన్ ఈ చిత్ర ప్రమోషన్స్‌లో ఉత్సాహంగా పాల్గొనడం హర్షించదగిన విషయం. ప్రస్తుతం చిన్న సినిమాల మనుగడకు చాలా కష్టంగా ఉంది. దాసరి నారాయణరావు చిన్న సినిమాలకు సపోర్ట్ చేస్తూ, టికెట్ ధరలు తక్కువలో ఉండాలని కోరుకునేవాళ్ళు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. డిజిటల్ ఎంతో అధిక ధరలతో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రామకృష్ణ ఇటువంటి పరిస్థితులలో కూడా సినిమాలు చేయడం అభినందించదగిన విషయం. చిన్న సినిమాలు బ్రతకాలి, అప్పుడే అందరూ బావుంటారు అని అన్నారు.



## మీ నమ్మకమే నా రియల్ సక్సెస్

### ఛాంపియన్ నైట్ ఈవెంట్‌లో హీరో రోషన్

స్వప్న సినిమాస్ అప్ కమింగ్ మూవీ 'ఛాంపియన్'. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో గ్రాండ్‌గా ఛాంపియన్ నైట్ ఈవెంట్ నిర్వహించారు. ఛాంపియన్ నైట్‌లో హీరో రోషన్ మాట్లాడుతూ.. ప్రదీప్ ఈ ప్రాజెక్టు నా దగ్గర తీసుకొచ్చినప్పుడు ఈ సినిమా తప్పితే మరో సినిమా చేయనని అప్పుడే డిసైడ్ అయిపోయాను. సినిమా షూటింగ్ సమయంలో పీటర్ మాస్టర్ కంపోజ్ చేసిన యాక్షన్ సీక్వెన్స్‌లో నాకు కొన్ని గాయాలు కూడా అయ్యాయి. ఆయనతో మళ్లీమళ్లీ యాక్షన్ సీన్లు చేయాలని కోరుకుంటున్నాను. వైజయంతి మూవీస్, స్వప్న, ప్రియాంక థాంక్యూ సో మచ్. దత్ లెజెండ్రీ ప్రొడ్యూసర్. నన్ను కూడా ఛాంపియన్ ద్వారా తీసుకొస్తున్నందుకు థాంక్యూ అన్నారు. అమ్మ నాన్న కష్టాన్ని నమ్ముకో అని నేర్పించారు. అలాగే దేని మీద కష్టపడతామో అది చాలా ఇంపార్టెంట్ అని చెప్పారు. మూడేళ్లు ఒక ప్రాజెక్ట్ కోసం ఆగాను అంటే అది కేవలం ఛాంపియన్ కోసమే. నేను ఇంకా ఏదైనా మంచి ప్రాజెక్టు వస్తే దానికి ఏదైనా ఇవ్వడానికి రెడీ. మీ నమ్మకమే నా రియల్ సక్సెస్. మొన్నటి వరకు టెన్షన్ ఉండేది. ట్రైలర్ వచ్చిన తర్వాత ఎడిట్ చూసిన తర్వాత హిట్ కొడతామని నమ్మకం వచ్చేసింది. నేను భవిష్యత్తులో ఏదైనా తప్పు చేస్తే మీరందరూ నన్ను తిట్టుకోవచ్చు కానీ 25న మీకు ఆ అవకాశం ఇవ్వను. అందరూ ఛాంపియన్ చూడండి అని పేర్కొన్నారు.

హీరోయిన్ అనస్వర మాట్లాడుతూ.. 25న ఛాంపియన్ సినిమా రిలీజ్ అవుతుంది. తెలుగులో రిలీజ్ అవుతున్న నా మొదటి సినిమా ఇది. డైరెక్టర్ ప్రదీప్‌కి థాంక్యూ. స్వప్న ప్రియాంక ఎంతగానో సపోర్ట్ చేశారు. స్వప్న సినిమాస్ వైజయంతి మూవీస్ లాంటి లెజెండ్రీ బ్యానర్లో నేను తెలుగులో లాంచ్ కావడం అదృష్టంగా భావిస్తున్నాను. గిరగిర సాంగ్ నా కెరీర్లో గుర్తుండిపోతుంది. రోషన్ ఎంతో హార్డ్ వర్క్ చేశారు. డిసెంబర్ 25 తర్వాత రోషన్ ని అందరూ ప్రేమిస్తారు. తను కచ్చితంగా చాంపియన్ అవుతారు. ఇందులో నా క్యారెక్టర్ పేరు చంద్రకళ. తెలుగు ఆడియన్స్ నా మలయాళ సినిమాలు చూసి ఎంతగానో సపోర్ట్ చేశారు , తెలుగులో కూడా నాకు సపోర్ట్ చేయండి అని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రామ్ మిరియాల, కాసర్ల శ్యామ్, రచ్చ రవి, రోషన్ తల్లి, ఒకప్పటి హీరోయిన్ ఊహ పాల్గొన్నారు.

## 25న 'మిషన్ సాంటా' విడుదల



యానిమేషన్ ఫిలింగా సంచలన విజయం సాధించిన నరసింహా అవతార్ సినిమా గురించి అందరికి తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరో యానిమేషన్ ఫీచర్ ఫిలిం రిలీజ్ కాబోతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిన ఈ భారీ యానిమేటెడ్ ఫిలిం 'మిషన్ సాంటా'. ఈ యానిమేషన్ ఫీచర్ ఫిలిం ఈ నెల 25న క్రిస్మస్ కానుకగా భారత్తో పాటు ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో ఒకేసారి ఈ చిత్రం థియేటర్లో సందడి చేయబోతుంది. ఇందులో భాగంగా ఈనెల 25న థియేటర్లో 'మిషన్ సాంటా' రిలీజ్ కాబోతుంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ కథతో రూపొందిన హై ఎనర్జీ యానిమేటెడ్ అడ్వెంచర్ చిత్రం ఇది. యానిమేషన్ క్వాలిటీ, సినిమాలో ఉండే ఎమోషన్స్, ఎంటర్టైన్మెంట్, అడ్వెంచరస్ అన్ని మీకు ఓ అద్భుతమైన సినిమాను చూసిన ఫీలింగ్‌ను, అనుభూతిని ఈ సినిమా ఇవ్వబోతుంది. ముఖ్యంగా చిన్నారులు, తల్లిదండ్రులు, తాత ముత్తాలు అందరూ కలిసి వెండితెరపై చూడదగ్గ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది. పూర్తి యానిమేషన్ ప్రొడక్షన్ భారత్‌లో భారతీయ సీనియర్ యానిమేషన్ నిపుణుల పర్యవేక్షణలో జరిగింది. సుమారు 20 నెలల పాటు 150కి పైగా భారతీయ యానిమేషన్ నిపుణులు ఈ చిత్ర నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని నిర్మించిన బ్రాడ్విజన్ ఇండియా, స్టూడియో 56, భారతీయ యానిమేషన్ను కేవలం సేవల స్థాయి నుంచి క్రియేటివ్గా, వాణిజ్యపరంగా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించాయి. ఈ చిత్రం ఇంగ్లీష్ భాషలో విడుదల అవుతోంది.



## 'త్రీ రోజెస్' సీజన్ 2కు ఒటిటిలో అనూహ్య స్పందన

ఈషా రెబ్బా, సత్య, రాశీ సింగ్, హర్ష చెముడు, సూర్య శ్రీనివాస్, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన ఆహా ఒరిజినల్స్ వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్' సీజన్ 2 స్ట్రీమింగ్‌కు వచ్చి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్ గర్ల్స్ గ్యాంగ్ హంగామా చూపిస్తూ ప్రైమ్ వీడియోలో సూపర్ హిట్ అయిన '4 మోర్ షాట్స్ ప్లీజ్' లాంటి సక్సెస్ అందుకుంటోంది. సంప్రదాయాలను మించిన స్వేచ్ఛను, ఎవరి విమర్శలను పట్టించుకోని స్నేహం, తమదైన ఆశయంతో ముందుకు సాగే ముగ్గురు అమ్మాయిలుగా ఈషా, రాశీ, కుషిత తమ పర్ ఫార్మెన్స్‌లతో ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండీ లైఫ్‌లో లవ్, కెరీర్, పర్సనల్ స్పేస్‌ను కోరుకునే నవతరం తెలుగు అమ్మాయిల జర్నీని ఈ వెబ్ సిరీస్ ఆసక్తికరంగా చూపిస్తోంది.


## 'వృషభ' ప్రీ రిలీజ్

మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'వృషభ'. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ నెల 25న గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తోంది. 'వృషభ' చిత్రాన్ని కన్నెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మిస్తున్నారు. విమల్ లహోటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న 'వృషభ' సినిమాను దర్శకుడు నందకిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. సోమవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ.. 'వృషభ' ఒక పవర్ ఫుల్ సినిమా. ఈ సినిమాలో నెక్స్ట్ ఏం జరుగుతుంది అనేది ఊహించలేరు. సినిమా ప్రారంభం నుంచి చివరి దాకా ఆసక్తిగా చూసేలా ఉంటుంది. ఈ సినిమా క్లైమాక్స్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంటుంది. మోహన్ లాల్ లాంటి లెజెండరీ యాక్టర్‌తో కలిసి నటించడం సంతోషంగా ఉంది అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ.. ఎలాంటి గర్వం లేని దర్శకుడు నందకిషోర్. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ఈ సినిమాలో నటిస్తే, తెలుగు ప్రొడ్యూసర్స్‌లో సూపర్ స్టార్ అయిన అల్లు అరవింద్ 'వృషభ' సినిమాను రిలీజ్ చేస్తున్నారు. అలాగే బన్నీ వాస్ లక్కీ హ్యాండ్. ఈ నెల 25న రిలీజ్ అవుతున్న 'వృషభ' సినిమా మంచి విజయం సాధించాలని, టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా అన్నారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ.. భారీ బడ్జెట్ ఖర్చు పెట్టి 'వృషభ' సినిమాను నిర్మించారు. ఈ సినిమా విజువల్స్ గ్రాండ్‌గా ఉంటాయి. కింగ్ ఎపిసోడ్ వచ్చినప్పటి నుంచి సినిమా మరో స్థాయికి వెళ్తుంది. ఫైట్స్, ఎమోషనల్ కంటెంట్ కూడా బాగుంటుంది. సామ్ సిఎస్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నేను దాదాపు 45 నిమిషాల పుటేజ్ చూశాను. సమర్జిత్‌లో ఈజ్ ఉంది. అతను కన్నడలో పెద్ద స్టార్ అవుతాడు అని అన్నాడు.



## 'బ్యాడ్ గాళ్స్' ట్రైలర్ విడుదల

ప్రశ్వీత ఎంటర్టైన్మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్వీఎల్ క్రియేషన్స్ బ్యానర్సపై రేణు దేశాయ్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మొయిన్, రోహన్ సూర్య ముఖ్య తారాగణంతో '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' చిత్ర దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో వస్తున్న మరో ఎంటర్టైనర్ చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ చిత్రం క్రిస్మస్ పండుగ కానుకగా 25న విడుదల కానుంది. ప్రభాస్ నటించిన రాజా సాబ్ చిత్ర దర్శకుడు మారుతి ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది, ప్రామిసింగ్‌గా అనిపించింది. దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి (మున్నా) నాకు చిరకాల మిత్రుడు, ఇండస్ట్రీలో సాధు జీవి, మంచి సంగీత జ్ఞానం ఉన్నవాడు. తన మొదటి చిత్రంలోని నీలి నీలి ఆకాశం పాట ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలుసు. ఇప్పుడు 'బ్యాడ్ గాళ్స్' చిత్రంతో మన ముందుకు వస్తున్నాడు. ఒక మంచి విషయాన్ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నం చేశాడు. ఒక ఐదుగురు కొత్త అమ్మాయిలతో సినిమా చేయడం, ప్రొడక్షన్ విషయంలో కాంప్రమైజ్ కాకుండా సినిమా ని పూర్తి చేయడం తన ప్యాషన్‌కి నిదర్శనం. సినిమా టైటిల్ మాత్రానే 'బ్యాడ్ గాళ్స్' కానీ సినిమా అంతా పాజిటివ్‌గా ఉంటుందని అన్నారు.



## మోహన్ భగవత్ వ్యాఖ్యలు
# రాజ్యాంగ ధిక్కారం: సిపిఐ



**న్యూఢిల్లీ:** భారత్ సహజ సిద్ధంగా హిందూ దేశమేనని, అందుకు రాజ్యాంగ సవరణ అవసరం లేదన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యల్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ సమితి ఓ ప్రకటన విడుదల చేసింది. తూర్పున సూర్యుడు ఉదయిస్తాడు.. భారత్ సహజ సిద్ధంగానే హిందూదేశం.. ఇందు కోసం ఎవరి అనుమతి అవసరం లేదని ప్రకటించడం ద్వారా తాను గొప్ప శాస్త్రీయ పురోగతిని సాధించానని మోహన్ భగవత్ నమ్ముతున్నట్లు అనిపిస్తుంది. విచారకరం ఏంటంటే... రాజ్యాంగం, మన గణతంత్ర స్వభావం పట్ల దశాబ్దాల తరబడి ఆర్‌ఎస్‌ఎస్ ధిక్కారాన్ని ఆయన బయటపెట్టారు. భారతదేశం హిందూ దేశం అని చెప్పడానికి రాజ్యాంగం అనుమతి అవసరం లేదనడం ఆయనకున్న జ్ఞానం కాదు, అది ఉద్దేశపూర్వక అజ్ఞానమని సిపిఐ విమర్శించింది. 'డాక్టర్ అంబేద్కర్ హిందూ రాష్ట్రం అనే ఆలోచనను తీవ్రంగా తిరస్కరించారు. ఎందుకంటే అది సోపానక్రమాన్ని కఠినతరం చేస్తుందని, కుల అణచివేతను చట్టబద్ధం చేస్తుందని, మైనారిటీలతో వివక్షను సంస్థాగతీకరిస్తుందని ఆయనకు తెలుసు. భారత్ మతం లేని లౌకిక గణతంత్రరాజ్యం. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం ప్రబలంగా ఉండేలా రూపొందించబడింది. వేలాది మంది స్వాతంత్ర్య సమర యోధుల త్యాగం, పోరాటాలతో నిర్మించబడిన దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగ వ్యతిరేకతకు స్థానం లేదు. భారతదేశంలో రాజ్యాంగాన్ని అనుసరించడం ఐచ్ఛికం కాదని మోహన్ భగవత్‌కు గుర్తెరగాలి' అని సిపిఐ స్పష్టం చేసింది.

# పెండింగ్ ఫీజులివ్వకుంటే యుద్ధమే

- పేద పిల్లల విద్యకు రూ.6వేల కోట్లు అప్పు తెండి
- విద్యార్థుల భారీ ప్రదర్శనలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం బిసిలు, పేద విద్యార్థుల విద్యకు పెండింగ్ ఫీజులు చెల్లించాలని, లేనిపక్షంలో యుద్ధం జరుగుతుందని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. గత రెండేళ్లలో రూ.2లక్షల 50వేల కోట్ల అప్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.5లక్షల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఇంత బడ్జెట్ వచ్చినా పేద పిల్లల చదువుకు రూ.6వేల కోట్లు ఇవ్వడానికి పాలకులకు మనసు ఒప్పుకోవడం లేదని మండిపడ్డారు. వివిధ కాలేజీల్లో చదువుతున్న 15లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్ల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని బర్కత్‌పుర నుంచి నారాయణగూడ వరకు వేలాది మంది బిసి విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్ నాయకత్వంలో జరిగిన ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని ప్రకటిస్తూనే, మరోవైపు వారి చదువులకు ఆటంకం కలిగిస్తుందని విమర్శించారు. సిఎంలు మారినప్పుడల్లా ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లకు ఒక్కొక్కరికి రూ.6వేల కోట్ల నుంచి రూ.7వేల కోట్ల వరకు కమీషన్లు తీసుకొని బడ్జెట్ ఇచ్చారని, విద్యార్థులకు ఫీజులివ్వకపోవడం విద్యను నిర్లక్ష్యం చేయడం కాదా? అని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంకు రూ.6వేల కోట్లు అప్పుతెస్తే ఎవరు అడ్డుకొంటారన్నారు. కేంద్రం కూడా ఈ పథకం కింద వేల కోట్లు కేటాయిస్తుందని, ఆ డబ్బులను ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఫీజుల బకాయిలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, నేతలు శివకుమార్ యాదవ్, నరేశ్‌గౌడ్, జిల్లపల్లి అంజి, రామకోటి, రామూర్తి, మోదీ రాందేవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్ పాస్ కార్డుల నిర్ణయం స్వాగతిస్తున్నాం : ఆర్‌టిసిజెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసిలో గత రెండేళ్లుగా అమలవుతున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి గాను జిరో టికెట్ స్థానంలో బస్సు పాస్‌లను ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తోందని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైఎస్ ఛైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎం.డి మౌలానా, కోకన్వీనర్లు, కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరితెలిపారు. ఈ పథకం కింద మహిళలకు ఆర్‌టిసి బస్‌ల్లో ఇస్తున్న 'జిరో' టికెట్ వల్ల కండక్టర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, అధిక రద్దీ సమయాల్లో ఈ రెండు రకాల టికెట్స్ ఇచ్చునప్పుడు అనుకోకుండా పురుషులకు జిఓ టికెట్ రావడం వీటిపై టిటిఐలు కేసులు నమోదు చేయడం, ఈ కేసులకు గురైన వారిని అధికారులు ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తూ జిరో టికెట్ బదులు ఉచిత బస్సు పాస్ కార్డ్ ఇవ్వాలని జెఎసి డిమాండ్ చేయడంతో ఈ అంశాన్ని పలుమార్లు ప్రభుత్వ, యాజమాన్యాల దృష్టికి తీసుకపోవడం కూడా జరిగిందన్నారు. అంతేకాకుండా ఈనెల 6వ తేదీన రవాణ శాఖ మంత్రితో జెఎసి నాయకులు జరిపిన చర్చల్లో ఉచిత పాసు అంశాన్ని మరో సారి లేవనేత్తగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇదేక్రమంలో ఆదివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆధ్వర్యంలో జరిగిన ఆర్‌టిసి సమీక్ష సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు మహిళలకు జిఓ టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల జెఎసి హర్షం వ్యక్తం చేస్తుందని తెలిపారు. ఉచిత బస్ పాస్ కార్డు జారీకి కృషి చేసిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డిలకు యావత్ ఆర్‌టిసి కార్మికుల తరుపున జెఎసి నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నమన్నారు.

# ఏ అవకాశాన్నీ వదలడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

నాన్‌ఎసి తరగతులు, అన్ని రైళ్లలోని ఎసి తరగతులకు కిలోమీటరుకు 2 పైసలు చొప్పున రైల్వే టికెట్ ధరలను పెంచుతున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఖర్గే సోమవారం ఎక్స్‌లో స్పందించారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వేలు నిర్లక్ష్యం, ఉదాసీనతతో విచారకరమైన కథను ఎదుర్కొన్నాయన్నారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం అదృశ్యమైందని ఖర్గే ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కాంక్రీట్ డెలివరీ కంటే నకిలీ ప్రచారంలో బిజీగా ఉండగా రైల్వేలు ధీనావస్థలో ఉన్నాయన్నారు.

'భద్రత పట్టాలు తప్పింది. మరణాలు పెరుగుతున్నాయి : రైల్వే ప్రమాదాల్లో 2.18 లక్షల మరణాలు (ఎన్‌సిఆర్‌బి నివేదిక: 2014–23 మధ్య). రైల్వేలు ఇకపై సురక్షితంగా లేవు, అవి జీవితంతో జూదం. 'కవాచ్ క్షీణిస్తుంది: ఐదు సంవత్సరాల హైప్, సున్నా తీవ్రత. కవాచ్ 3 శాతం కంటే తక్కువ మార్గాలను, 1 శాతం కంటే తక్కువ లోకోమోటివ్‌లను కవర్ చేస్తుంది. ఇది గంభీరమైన ప్రసంగాలలో మాత్రమే ఉన్న భద్రతా వ్యవస్థ' అని ఆయన తన పోస్ట్‌లో అన్నారు. రైల్వేలలో ఖాళీల గురించి ప్రస్తావిస్తూ, ఖాళీ ఉద్యోగాలతో భవిష్యత్తు నిలిచిపోయింది, 3.16 లక్షల ఖాళీలతో వ్యవస్థ కుళ్ళిపోతుందన్నారు. యువత శాశ్వత నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని, కాంట్రాక్టు నియామకాలు పెరుగుతున్నాయని, (వేతనం, భత్యాలపై తాజా వార్షిక నివేదిక అందుబాటులో ఉంది) ఖర్గే ఆవేదన చెందారు. శిక్షణ, హెచ్‌ఆర్‌డి నిధులను నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ, 2023–24లో 42 శాతం మాత్రమే వినియోగించారని, డిసెంబర్ 2024–25 వరకు 68 శాతం వినియోగించారని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. లోకో పైలట్లు ప్రాథమిక విరామాలను తిరస్కరించారని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికను ఉటంకిస్తూ ఆయన పేర్కొన్నారు. 'పనితీరు కంటే ప్రచారానికే ప్రాధాన్యత: అమృత్ భారత్ కింద 453 స్టేషన్ల లక్ష్యానికి గాను కేవలం ఒక స్టేషన్‌ను మాత్రమే ఆధునీకరించారు. ఇది అభివృద్ధిపై ఒక క్రూరమైన జోక్. విన్యాసాలు పుష్కలంగా, సారం కరువు: రీల్స్ చిత్రీకరిస్తూ, రైళ్లలో ఎటిఎంలను ప్రచారం చేస్తున్నప్పటికీ, రైల్వేలు నష్టాల్లో కూరుకుపోతున్నాయి. రూ. 2,604 కోట్ల నష్టాలు (కాగ్, 2024), సీనియర్ సిటిజన్ల రాయితీలు రద్దు చేసి, వృద్ధుల నుండి రూ. 8,913 కోట్లు రాబట్టారు' అని ఆయన అన్నారు. వేగం విషయంలో లోపాలను ప్రస్తావిస్తూ, 160 కిలోమీటర్ల వేగం అనే గొప్ప వాదనకు విరుద్ధంగా వందే భారత్ రైలు 76 కిలోమీటర్ల వేగంతో నడుస్తోందని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వేలు నిర్లక్ష్యం, ఉదాసీనత, తప్పుడు ప్రచారం అనే విచారకరమైన గాథను ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఇద్దరు ప్రధానులు ఫోన్‌లో సంభాషించుకున్నారు, ఆ తర్వాత ఎఫ్‌టిఎపై ప్రకటన చేశారు. మార్చి 2025లో లక్సన్ భారత పర్యటన సందర్భంగా చర్చలు ప్రారంభించడంతో, తొమ్మిది నెలల రికార్డు సమయంలో ఎఫ్‌టిఏ ముగింపు దేశాల మధ్య సంబంధాలను మరింతగా పెంచుకోవాలనే ఉమ్మడి ఆశయం, రాజకీయ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని ఇద్దరు నాయకులు అంగీకరించారు. మరోవైపు, న్యూజిలాండ్ గొర్రె మాంసం, ఉన్ని, బొగ్గు, 95 శాతానికి పైగా అటవీ, కలప వస్తువుల వంటి వస్తువులకు సుంకం లేకుండా యాక్సెస్ పొందుతుంది. ఈ ఒప్పందం ప్రకారం, వెల్లింగ్టన్ కివి పండు, వైన్, కొన్ని సముద్ర ఆహారాలు, చెర్రీస్, అవకాడోలు, పెర్సిమోన్స్, బల్క్ ఇన్‌ఫెంట్ ఫార్ములా, మనుకా తేనె మరియు మిల్క్ అల్బుమిన్‌లు వంటి అనేక ఇతర వస్తువులపై సుంకం లేకుండా రాయితీలు పొందుతుంది. దేశీయ రైతులు, ఎంఎస్‌ఎంల ప్రయోజనాలను కాపాడటానికి, పాలు, క్రీమ్, పాలవిరుగుడు, పెరుగు మరియు చీజ్ వంటి రాజకీయంగా సున్నితమైన పాల రంగంలో భారతదేశం ఎటువంటి సుంకం లేకుండా రాయితీలు ఇవ్వదు. సేవల రంగానికి సంబంధించి, న్యూజిలాండ్ నైపుణ్యం కలిగిన వృత్తులలో భారతీయ నిపుణులకు సంవత్సరానికి 5,000 వీసాల కోటా, మూడు సంవత్సరాల వరకు బసతో తాత్కాలిక ఉపాధి ప్రవేశ వీసా మార్గాన్ని అందిస్తుంది. ఈ మార్గం ఆయుష్ అభ్యాసకులు, యోగా బోధకులు, భారతీయ చెఫ్‌లు, సంగీత ఉపాధ్యాయులు వంటి భారతీయ వృత్తులతో పాటు ఐటి, ఇంజనీరింగ్, ఆరోగ్య సంరక్షణ, విద్య, నిర్మాణం, శ్రామిక శక్తి చలనశీలత మరియు సేవల వాణిజ్యాన్ని బలోపేతం చేయడం వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాలను కవర్ చేస్తుంది. ఈ ఒప్పందంపై దాదాపు 78 నెలల్లో సంతకం చేసి అమలు చేసే అవకాశం ఉంది. ట్రంప్ పరిపాలన భారతీయ వస్తువులపై విధించిన 50 శాతం సుంకాల ప్రభావంతో సతమతమవుతున్న భారతీయ ఎగుమతిదారులు ఓషియానియా ప్రాంతంలో సరుకులను వైవిధ్యపరచడానికి ఈ ఒప్పందం సహాయపడుతుంది. భారతదేశం ఇప్పటికే ఆస్ట్రేలియాతో వాణిజ్య ఒప్పందాన్ని అమలు చేసింది. ఎఫ్‌టిఎ ద్వైపాక్షిక ఆర్థిక నిశ్చితార్థాన్ని గణనీయంగా పెంచుతుంది, మార్కెట్ ప్రాప్యతను పెంచుతుంది, పెట్టుబడి ప్రవాహాలను ప్రోత్సహిస్తుంది, రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేస్తుంది మరియు వివిధ రంగాలలో రెండు దేశాల ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులు, రైతులు, ఎంఎస్‌ఎంఇలు, విద్యార్థులు మరియు యువతకు కొత్త అవకాశాలను తెరుస్తుంది. రానున్న ఐదు సంవత్సరాలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతో పాటు రాబోయే 15 సంవత్సరాలలో న్యూజిలాండ నుండి భారతదేశంలో యుఎస్‌డి 20 బిలియన్ల పెట్టుబడిపై ఇద్దరు నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు' అని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ పెట్టుబడి దేశీయ తయారీకి ప్రోత్సాహాన్ని ఇస్తుందని, ఉద్యోగాలను సృష్టిస్తుందని గోయల్ అన్నారు.

# కాల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాల్పుల ఘటన జరిగింది. 'నేషనల్ సిటిజన్ పార్టీ ఖుల్నా డివిజన్ ప్రాంత నాయకుడు, పార్టీ వర్కర్స్ ఫ్రంట్ సెంట్రల్ కో–ఆర్డినేటర్ మోతలెబ్ షిగ్దర్ కొద్ది నిమిషాల క్రితమే కాల్పుల్లో హతుడయ్యారు' అని ఎన్‌సిపి సంయుక్త ప్రధాన సమన్వయకర్త మహ్మూదా మితు ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారు. మహ్మూదా మితు ఒక వైద్యుడు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఎన్‌సిపి నాయకుడు షిగ్దర్‌ను హుటాహుటిన ఖుల్నా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించామని ఆయన అక్కడ మరణించారని మితు చెప్పారు. షిగ్దర్‌ను తల ఎడమవైపు భాగంలోంచి తూటా దూసుకుపోయిందని స్థానిక పత్రిక పేర్కొంది. ఆయనను ఆసుపత్రికి తీసువెళ్ళేసరిగా తలలో ఆ ప్రాంతం నుండి విపరీతంగా రక్తస్రావం జరుగుతోందని తెలిపింది. జులై ఉద్యమ నాయకుడు, ఇంక్విలాబ్ మంఛో పార్టీ వ్యవస్థాపకుడు హది ఈ 12వ తేదీన గుర్తు తెలియని ముసుగు సాయుధుల చేతిలో హతుడయ్యారు. గత ఏడాది జులైలో ప్రధానమంత్రి షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేయడంలో ఒస్మాన్ హది కీలకపాత్ర పోషించాడు. హది సెంట్రల్ ఢాకాలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత సింగపూర్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. శనివారం బంగ్లాదేశ్‌లో హదీకోసం శోకదినంగా పాటించింది. కాల్పులకు పాల్పడినవారని క్షమించేదిలేదని, వారిని అరెస్టు చేస్తామని మహ్మద్ యూనుస్ ప్రతిజ్ఞ చేశారు.

### యూనుస్‌కు ఉగ్రవాదుల అండదండలు : హసీనా

తాను బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు మహ్మద్ యూనుస్‌కు ఉగ్రవాదులు మద్దతు ఇస్తున్నారని పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనా విమర్శించారు. గూండాలను యూనుస్ ప్రభుత్వం దేశభక్తులుగా చిత్రీకరిస్తోందని విమర్శించారు. వారి చర్యలే తనను అజ్ఞాతంలోకి నెట్టాయన్నారు. జైల్లో ఉండాల్సిన ఉగ్రవాదులను యూనుస్ ప్రభుత్వం ప్రజాజీవితంలోకి విడుదల చేయడంవల్లనే బంగ్లాదేశ్‌లో హింస పెరిగిపోయిందన్నారు. దేశం వదిలి పారిపోలేదని, దేశంలో జరుగుతున్న హింసాకాండను ఆపేందుకే తాను తాత్కాలికంగా వైదొలగానని పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా చెప్పారు.అడ్డూ అదుపూ లేకుండా జరుగుతున్న హింసాకాండను వైదొలగడంద్వారా అదుపు చేసే ప్రయత్నం చేశానన్నారు. తాను భయపడి పారిపోలేదన్నారు. యూనుస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హింస పెరిగిపోయిందని, చట్టాలు బలహీనపడ్డాయని, దీనివల్ల ప్రపంచంలో బంగ్లాదేశ్ దెబ్బతింటుందన్నారు. దీపూ చంద్రదాస్ హత్య ఘటనను ఆమె తీవ్రంగా ఖండించారు. మైనార్టీ మతస్థులకు రక్షణ కరువైందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com